www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బంగ్లాలో కొలువుదీరిన తాత్కాలిక ప్రభుత్వం

ప్రధానమంత్రికి ఉండే అధికారాలతో

ప్రధాన సలహాదారుగా యూనస్ ప్రమాణం

ప్రభుత్వంలో సభ్యులుగా 16 మంది 2

విద్యార్థి నేతలు నహీద్, ఆసిఫ్‌కు చోటు

కొత్త బంగ్లాదేశ్ నిర్మాణానికి సహకరించండి

లేదంటే.. నాకు వీడ్కోలు పలకండి: యూనస్

శుక్రవారం | 9-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 132

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి తె. 3.14 తదుపరి షష్ఠి; నక్షత్రం: హస్త రా. 2.44 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ. 9.04-10.53; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.23, మ. 12.45-1.36; అమృతఘడియలు: రా. 7.56-9.45; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.40

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నీరజతమే!

పారిస్ ఒలింపిక్స్‌లో రజతంతో సరిపెట్టుకున్న నీరజ్ చోప్రా

89.45 మీ. విసిరి రెండోస్థానంలో జావెలిన్ త్రోయర్

92.97 మీటర్లతో స్వర్ణం నెగ్గిన పాకిస్థానీ నదీమ్

స్పెయిన్‌పై గెలిచిన భారత హాకీ జట్టుకు కాంస్యం

వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ పతకంతో రికార్డు



క్రీడాంశాలన్నీ అయిపోతున్నా అతడిపై ఆశ..! స్టార్లంతా చేతులెత్తేస్తున్నా అతడు మాత్రం అద్భుతం చేస్తాడన్న భరోసా..! భరత మాత మెడలో మళ్లీ బంగారు పతకం వేస్తాడన్న అంచనా..! కానీ, పారిస్ ఒలింపిక్స్‌లో స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఉసూరుమనిపించాడు. 89.45 మీటర్ల దూరం విసిరి రజత పతకానికి పరిమితం అయ్యాడు. ఈ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఇదే తొలి రజతం. పాకిస్థాన్ జావెలిన్ త్రోయర్ నదీమ్ రికార్డు స్థాయిలో 92.97 మీటర్ల దూరం విసిరి స్వర్ణం సాధించాడు. మరోవైపు, వెనుకబడినా పుంజుకున్న భారత హాకీ జట్టు అద్భుతం చేసింది! కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 3 నిమిషాల్లో చకచకా రెండు గోల్స్ కొట్టడంతో కాంస్యం సాధించింది. స్పెయిన్‌ను 2-1తో మట్టికరిపించింది. 11

రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికిన వినేశ్ ఫొగట్



వికారాబాద్ జిల్లా పులిచర్లకుంట తండాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ భూములు

సమీకృత గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు

9 జిల్లాలు.. 20 వేల ఎకరాలు

అన్నీ ఓఆర్ఆర్‌కు 50-60 కి.మీ. లోపలే

కొడంగల్ నుంచి ప్రారంభించిన ప్రభుత్వం

దుద్యాలలో 1,373 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్

త్వరలో నల్లగొండ, మెదక్ జిల్లాల్లోనూ

హైదరాబాద్, వికారాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న సమీకృత గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల ప్రాజెక్టు పట్టాలెక్కింది. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో 20 వేల ఎకరాల్లో ఒకేచోట హైదరాబాద్ ఫార్మా సిటీని ఏర్పాటు చేసేందుకు గత సర్కారు చర్యలు తీసుకోగా.. ఆ ప్రాజెక్టును ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. భూ సేకరణ

మిగతా 13వ పేజీలో...



హైదరాబాద్‌లో 'చార్లెస్ స్క్వాబ్ సెంటర్'!

ఆర్థిక సేవల బహుళ జాతి సంస్థ భారత్‌లో నెలకొల్పే తొలి కేంద్రం ఇదే

డాలస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కంపెనీ ప్రతినిధుల చర్చలు

గాంధీజీ విగ్రహానికి రేవంత్ నివాళి.. కాలిఫోర్నియాలో ఎన్నారైల ఘనస్వాగతం

అమెరికాలోని డాలస్‌లో మహాత్మా గాంధీ స్మారక శిలాఫలకం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు 13

వక్ఫ్ బిల్లుపై విపక్షాల కన్నెర్ర

రాజ్యాంగ వ్యతిరేకమన్న ఇండియా కూటమి 2

మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల కోసమే..: కాంగ్రెస్

భూముల దురాక్రమణను అడ్డుకునేందుకేనన్న కేంద్రం

జేపీసీకి బిల్లు సిఫారసు



నెలాఖరులో కొత్త పీసీసీ! 12

కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు

మధుయాష్కీ, బలరాంనాయక్ పేర్ల పరిశీలన.. రేసులో సంపత్

బస్సుపైకి బీరు బాటిల్.. కండక్టర్‌పైకి పాము

బస్సు ఆపలేదన్న కోపంతో విసిరిన ఓ మహిళ 14

బీరు బాటిల్ ధాటికి పగిలిన బస్సు వెనుక అద్దాలు

హైదరాబాద్‌లో ఘటన

పోలీసుల అదుపులో నిందితురాలు

బ్యాంకు ఖాతా లేకున్నా

యూపీఐ చెల్లింపులు!

వేరొకరి ఖాతా నుంచి చెల్లించే అవకాశం



త్వరలో అందుబాటులోకి తేనున్న ఆర్బీఐ

యూపీఐ ద్వారా ప్రస్తుతానికి రూ.లక్షగా ఉన్న పన్ను చెల్లింపు పరిమితి 5 లక్షలకు పెంపు


ఇక గంటల్లోనే చెక్కుల క్లియరెన్స్‌కు ఆదేశం

వరుసగా 9వసారీ రెపో రేటు యథాతథం

ఆర్బీఐ ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు

ముంబై, ఆగస్టు 8: గూగుల్‌పే, ఫోన్‌పేలాంటి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులు జరపాలంటే వాటిని మన బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయాల్సిందే! మరి బ్యాంకు ఖాతాలు లేనివారి పరిస్థితి? అలాంటివారు వేరొకరి ఖాతా నుంచి

మిగతా 2వ పేజీలో...



9

సూచీలకు ఆర్బీఐ దెబ్బ

మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు

సెన్సెక్స్ 581 పాయింట్ల పతనం

కూలిన సుంకిశాల గోడ



సుంకిశాల వద్ద కుప్పకూలిన పంప్‌హౌస్ రక్షణ గోడ

ధ్వంసమైన రెండో టన్నెల్ గేటు

కుప్పకూలిన ఇంటేక్ వెల్ రక్షణ గోడ

క్షణాల్లో భారీ సంపులోకి వరద నీరు

వంద మందికి త్రుటిలో తప్పిన పెను ముప్పు

2నే జరిగినా గోప్యంగా ఉంచిన జల మండలి

శంకుస్థాపన, పనులు బీఆర్ఎస్ హయాంలోనే

20 కోట్ల వరకూ నష్టం జరిగినట్లు అంచనా

జలాశయంవైపు మట్టి తొలగింపుతోనే ప్రమాదం

నాగార్జునసాగర్, హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8: అది నాగార్జున సాగర్ జలాశయానికి ఆనుకుని నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టు! నిత్యం ఒక్కో షిఫ్టులో అక్కడ వంద మంది పని చేస్తూ ఉంటారు! ఈనెల రెండో తేదీన రాత్రి షిఫ్టు చేసిన కార్మికులు ఉదయం ఆరింటికి బయటకు వెళ్లారు! పగలు

మిగతా 3వ పేజీలో...

సీపీఎం సీనియర్ నేత బుద్ధదేవ్ కన్నుమూత

2001-11 మధ్య పశ్చిమబెంగాల్ సీఎంగా సేవలు

ఆయన హయాం అనంతరం రాష్ట్రంలో 34 ఏళ్ల వామపక్ష పాలనకు తెర 2

ప్రధాని మోదీ, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సహా పలువురు రాజకీయ ప్రముఖుల సంతాపం



బ్యాంకు ఖాతా లేకున్నా.. యూపీఐ చెల్లింపులు!

- వేరొకరి ఖాతా నుంచి చెల్లించే అవకాశం
- త్వరలో అందుబాటులోకి తేనున్న ఆర్బీఐ
- యూపీఐ ద్వారా ప్రస్తుతానికి రూ.లక్షగా ఉన్న పన్ను చెల్లింపు పరిమితి 5 లక్షలకు పెంపు
- ఇక గంటల్లోనే చెక్కుల క్లియరెన్స్‌కు ఆదేశం
- వరుసగా 9వసారీ రెపో రేటు యథాతథం

ముంబై, ఆగస్టు 8: గూగుల్‌పే, ఫోన్‌పేలాంటి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులు జరపాలంటే వాటిని మన బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయాల్సిందే! మరి బ్యాంకు ఖాతాలు లేనివారి పరిస్థితి? అలాంటివారు వేరొకరి ఖాతా నుంచి చెల్లింపులు జరిపే వీలు కల్పించేలా.. డెలిగేటెడ్ పేమెంట్స్ (ప్రాతినిధ్య చెల్లింపులు) విధానాన్ని త్వరలో అందుబాటులోకి తేనున్నట్టు భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ) ప్రకటించింది. డిజిటల్ చెల్లింపులను మరింత సులభతరం చేసేందుకు, యూపీఐ వినియోగాన్ని మరింతగా పెంచేందుకు ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్బీఐ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో ప్రధానమైనది ఈ ప్రాతినిధ్య చెల్లింపుల విధానం. ఈ విధానంలో.. ఒక యూపీఐ వినియోగదారు తన బ్యాంక్ అకౌంట్ నుంచి నిర్దేశిత పరిమితి వరకూ యూపీఐ చెల్లింపులు జరిపేందుకు మరో వ్యక్తికి అధికారమిచ్చే వీలుంటుంది. బ్యాంక్ ఖాతా లేని వ్యక్తులు, మైనర్లు తమ తల్లిదండ్రులు లేదా సంబంధిత వ్యక్తుల బ్యాంక్ ఖాతాల ద్వారా యూపీఐ చెల్లింపులు జరిపేందుకు ఈ కొత్త విధానం ఉపయోగపడనుందని థర్డ్‌పార్టీ పేమెంట్ అప్లికేషన్ కివీ సహ-వ్యవస్థాపకులు మోహిత బేడీ అన్నారు. అయితే, ఈ వెసులుబాటుకు సంబంధించిన పూర్తి విధివిధానాలను ఇంకా ప్రకటించాల్సి ఉంది.

ఇక యూపీఐ పరిమితి రూ.5 లక్షలకు..

యూపీఐ ద్వారా పన్ను చెల్లింపుల పరిమితి ప్రస్తుతం రూ.లక్షగా ఉండగా.. దాన్ని రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. తద్వారా పన్ను చెల్లింపుదారులు అధిక మొత్తంలో పన్నును సైతం యూపీఐ ద్వారా సులువుగా, వేగంగా చెల్లించేందుకు వీలవుతుందని పేర్కొంది. అలాగే చెక్కుల ద్వారా చెల్లింపులను మరింత వేగవంతం చేయనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ప్రస్తుతం చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (సీటీఎస్) బ్యాచ్-ప్రాసెసింగ్ విధానంలో పనిచేస్తుంది. అంటే, నిర్దిష్ట సమయం వరకు వచ్చిన చెక్కులన్నింటినీ ఒక బ్యాచ్‌గా ప్రాసెస్ చేసి, క్లియర్ చేస్తారు. ఈ విధానంలో చెక్కు క్లియరెన్స్‌కు రెండు రోజుల దాకా సమయం పడుతుంది. ఇకపై బ్యాచ్ ప్రాసెసింగ్‌కు బదులు ఆన్ రియలైజేషన్ సెటిల్‌మెంట్ విధానంలో చెక్కులను క్లియర్ చేస్తారు. అంటే.. చెక్కు వచ్చిన తక్షణమే క్లియరెన్స్‌కు వెళుతుంది. తద్వారా కొన్ని గంటల సమయంలోనే అది క్లియర్ అవుతుంది. ఈ విధానం వల్ల చెక్కు ద్వారా చెల్లింపులు జరిపే వారికి, సొమ్ము అందుకునేవారికీ ఉపయోగం.

అనధికారిక డిజిటల్ రుణ యాప్స్‌కు చెక్

అనధికారిక రుణయాప్‌లకు చెక్ పెట్టేందుకు తమ నియంత్రణలోని సంస్థలు నిర్వహిస్తున్న డిజిటల్ రుణ యాప్‌లతో ఒక రిపాజిటరీని ఏర్పాటు చేయాలని ఆర్బీఐ ప్రతిపాదన చేసింది. అనధికారిక యాప్‌లను గుర్తించడంతోపాటు కస్టమర్లు వాటి వలలో పడకుండా ఉండేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొంది.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అంతటి అలజడి

- ప్రస్తుతం ప్రపంచమంతా గందరగోళంగా ఉంది
- సీడీఎస్ అనిల్ చౌహాన్

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ప్రస్తుతం ప్రపంచమంతా గందరగోళంగా ఉందని, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రస్తుతం అంతటి అలజడి నెలకొని ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. ప్రపంచంలోని పలు దేశాల మధ్య అసాధారణ వివాదాలు నెలకొని ఉన్నాయని ఆయన అన్నారు. ఢిల్లీలో గురువారం భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ) మందుగుండు సామగ్రిపై నిర్వహించిన సదస్సులో అనిల్ చౌహాన్ మాట్లాడుతూ, మయన్మార్, సుడాన్, కాంగో దేశాలు అంతర్గత యుద్ధాలతో సతమతమవుతున్నాయని అన్నారు. అలాగే లిబియా, సిరియా, యెమెన్, అర్మేనియాలలో యుద్ధం ఆగిపోయినప్పటికీ అక్కడ శాంతి వాతావరణం నెలకొంటుందో లేదో చెప్పలేని పరిస్థితి నెలకొని ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలో నెలకొన్న ఈ అశాంతి వాతావరణం సరఫరా గొలుసు వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. యుద్ధ సామగ్రి మొదలుకొని ప్రతి వస్తువుకు గిరాకీ ఏర్పడిందని చెప్పారు. ఫిక్కీ ఈ సమస్యకు పరిష్కారం చూపుతుందని అనిల్ చౌహాన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రష్యా భూభాగంలోకి ఉక్రెయిన్ బలగాలు

మాస్కో, ఆగస్టు 8: రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చుతోంది. తాజాగా ఉక్రెయిన్ బలగాలు మరో అడుగు ముందుకేసి రష్యా భూభాగంలోకి ప్రవేశించి దాడులు చేస్తున్నాయి. దీంతో ఇరు దేశాల బలగాల మధ్య పోరు తీవ్రంగా సాగుతోందని తెలుస్తోంది. సరిహద్దును దాటి ఉక్రెయిన్ బలగాలు దాడులను సాగిస్తున్నందున కుర్స్క్ ప్రాంతంలో అత్యవసర స్థితిని ప్రకటించినట్టు ఆ ప్రాంత గవర్నర్ అలెక్సీ స్మిర్నోవ్ తెలిపారు. శత్రు సైనికులను ఈ ప్రాంతం నుంచి తరిమికొట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఉక్రెయిన్ బలగాలు ప్రవేశించినప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఐదుగురు పౌరులు మరణించారని, 31 మందికి గాయాలు కాగా వారిలో ఆరుగురు పిల్లలున్నారని రష్యా అధికారులు తెలిపారు. కాగా దీనిపై ఉక్రెయిన్ అధికారికంగా ఇప్పటి వరకు పెదవి విప్పలేదు.

ఉద్యోగ ఆఫర్లతో గ్రాడ్యుయేట్లకు నాన్-ఇమిగ్రెంట్ వీసా

- జారీ ప్రక్రియను సులభతరం చేయనున్న అమెరికా

న్యూఢిల్లీ, ఆగస్టు 8: అమెరికాలో గుర్తింపు పొందిన ఉన్నత విద్యాసంస్థల నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి జాబ్ ఆఫర్ పొందిన విద్యార్థులు పని ఆధారిత నాన్-ఇమిగ్రెంట్ వీసాలు పొందడం సులభతరం కానుంది. నిర్దిష్ట దరఖాస్తులకు మినహాయింపులను ఎప్పుడు సిఫారసు చేయాలనే దానిపై జూలై 15న కాన్సులర్ అధికారులకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. వర్క్ వీసా జారీ ప్రక్రియను క్రమబద్ధీకరించడంతో పాటు వేగవంతం చేసే లక్ష్యంతో ఈ మార్పులు ప్రతిపాదించింది. కొత్త పథకం ప్రకారం అర్హులైన దరఖాస్తుదారులు నాన్-ఇమిగ్రెంట్ వీసాలను మరింత తర్వగా అందుకుంటారు. కొత్త ప్రతిపాదనలు అమలులోకి వస్తే పెద్దసంఖ్యలో గ్రాడ్యుయేట్లు ప్రయోజనం పొందుతారు

కొలువుదీరిన తాత్కాలిక ప్రభుత్వం

బంగ్లా ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా యూనస్ ప్రమాణం.. సభ్యులుగా 16 మంది నియామకం

- అభినందించిన భారత ప్రధాని మోదీ
- హిందువులకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి
- హింసను వీడాలి.. శాంతిని నెలకొల్పాలి
- దేశ ప్రజలనుద్దేశించి మహమ్మద్ యూనస్ వ్యాఖ్యలు



ప్రమాణస్వీకారం చేస్తున్న యూనస్ (కుడివైపు)

ఢాకా/న్యూఢిల్లీ, ఆగస్టు 8: విద్యార్థుల కోటా ఉద్యమంతో కల్లోలంగా మారిన బంగ్లాదేశ్‌లో నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరింది. అధ్యక్షుడి అధికారిక నివాసం బంగభవన్ దర్బార్‌హాల్‌లో గురువారం సాయంత్రం 8.30కు జరిగిన కార్యక్రమంలో యూనస్‌తోపాటు.. మరో 16 మందికి గాను.. 13 మంది తాత్కాలిక ప్రభుత్వ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తాత్కాలిక ప్రభుత్వంలో విద్యార్థి సంఘాల సమన్వయ కర్త నహీద్ ఇస్లాం, మరో నాయకుడు ఆసిఫ్ మహమూద్‌కు చోటు దక్కింది. అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. యూనస్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు(ప్రధానికి ఉండే అధికారాలతో)గా ప్రమాణం చేశారు. మరో ముగ్గురు సభ్యులు రాయ్, చక్మా, బీర్ ప్రతీక్ ఫారూఖ్-ఎ-ఆజమ్ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నందున ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఈ కార్యక్రమంలో 400 మంది దాకా అతిథులు పాల్గొన్నారు. వీరిలో ఆర్మీ చీఫ్ వకార్-ఉజ్-జమా, రాజకీయ పార్టీల నాయకులు, త్రివిధ దళాధిపతులు, దౌత్యవేత్తలు ఉన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా యూనస్‌కు అభినందనలు తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు భద్రత కల్పించాలని కోరారు.

ప్రజలు సామరస్యంతో మెలగాలి: యూనస్

దేశంలో శాంతిభద్రతలను పునరుద్ధరించడమే తమ ప్రభుత్వ తొలి కర్తవ్యమని మహమ్మద్ యూనస్ అన్నారు. "ప్రజలు దేశంలో ఎక్కడా ఎవరిపైనా దాడులు జరగకుండా చూసుకోవాలి. బంగ్లాదేశ్ పునర్నిర్మాణంలో అంతా భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో, తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ప్రమాణ స్వీకారం సందర్భంగా పైవ్యాఖ్యలు చేశారు. దేశంలో హింస ప్రజ్వరిల్లుతోందని, ఇది మంచిది కాదంటూ.. భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేందుకు శాంతిని పాటించాలని ఆయన దేశ ప్రజలను కోరారు. మైనారిటీలైన హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులు, అహ్మదీయులపై జరుగుతున్న దాడులను ఖండించారు. "ఈ దాడులు కుట్రలో భాగమే. ప్రజలు హింస జోలికి వెళ్లొద్దు. మన దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తి మన సోదరుడే. నాపై విశ్వాసం ఉంచండి. ప్రభుత్వం మీకు న్యాయం చేస్తుంది. ఒకవేళ మీరు నా మాట వినకపోతే.. నేను ఇక్కడ(ప్రభుత్వంలో) ఉండి కూడా వృథానే. ఇక్కడ నా అవసరం లేదనుకుంటే.. నాకు వీడ్కోలు పలికితే.. నా పని నేను చూసుకుంటాను" అని ఉద్వేగంగా అన్నారు. దేశ ప్రగతికి హింస, గందరగోళ పరిస్థితులే అతిపెద్ద శత్రువులని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ రోజు బంగ్లాదేశ్ కొత్త విజయదినోత్సవం. ఈ రోజు మనం మొదలు పెట్టిన నవ బంగ్లాదేశ్ నిర్మాణ ప్రయాణానికి శత్రువులైన వాటిని వీడి.. దేశంకోసం పనిచేద్దాం. విద్యార్థులు హింసను వీడి చదువుపై దృష్టి సారించాలి" అని ఆయన పేర్కొన్నారు.

అవామీ లీగ్‌పై నిషేధం విధించాలి: బీఎన్‌పీ

హసీనా పార్టీ అవామీ లీగ్‌పై నిషేధం విధించాలని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) చైర్‌పర్సన్ ఖలీదా జియా సలహాదారు రుహుల్ కుద్దూస్ తాలూక్దార్ డిమాండ్ చేశారు. గురువారం నాటోర్ నగరంలోని కనాయిఖలీ చత్తర్‌లో జరిగిన బీఎన్‌పీ బహిరంగ సభలో ఆయన ఈ డిమాండ్‌ను ప్రభుత్వం ముందు పెట్టారు. కాగా, బంగ్లాదేశ్ పరిణామాలపై హసీనా కుమార్తె సైమా వజీద్ పుతుల్ తొలిసారి స్పందించారు. ప్రస్తుతం న్యూఢిల్లీలో ఉంటూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆగ్నేయాసియా రీజనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమె.. బంగ్లాదేశ్ పరిస్థితులను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "క్లిష్ట సమయంలో అమ్మ ఈ దేశం(భారత్)లోనే ఉన్నా.. ఆమెను కౌగిలించుకోలేని పరిస్థితి" అంటూ ఆమె ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. కాగా, బంగ్లాదేశ్‌లో అనిశ్చితికి జరిగిన కుట్రకు పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఆజ్యం పోసిందని హసీనా కుమారుడు సాజిబ్ వాజెద్ జాయ్ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగాక.. తన తల్లి తిరిగి దేశానికి వస్తారన్నారు. గురువారం ఆయన పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. తన తల్లికి రక్షణగా నిలిచిన భారత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అవామీ లీగ్ పార్టీ భారత్‌తో సదా స్నేహపూర్వకంగా ఉంటుందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు భారత్ ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

బ్రిటన్ విదేశాంగ మంత్రికి జైశంకర్ ఫోన్

బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీతో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఫోన్‌లో మాట్లాడారని అధికారులు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వివరాలను వెల్లడించారు. ఇరువురూ ఫోన్‌లో బంగ్లాదేశ్ అంశంపై చర్చించారని పేర్కొన్నారు. అయితే.. హసీనా రాజకీయ ఆశ్రయంపై వీరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతల పునరుద్ధరణ జరగాలని భారత్ కోరుకుంటోందని జైస్వాల్ వివరించారు. కాగా.. బంగ్లాదేశ్‌లో భారత వీసా జారీ సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు.

దేశ ప్రజలు ప్రధాని మోదీ ఇంట్లోకీ చొరబడతారు

- మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత సజ్జన్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు

భోపాల్, ఆగస్టు 8: శ్రీలంక, బంగ్లాదేశ్‌లో జరిగిన మాదిరిగా ఏదో ఒక రోజు భారతదేశ ప్రజలు ప్రధాని మోదీ ఇంట్లోకి చొరబడతారంటూ మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ సజ్జన్ సింగ్ వర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ తప్పుడు విధానాల వల్ల ప్రజలు తిరగబడతారన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో మంగళవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

బంగ్లాలో హిందువులపై దాడులను అడ్డుకోవాలి

- అమెరికా చట్టసభ సభ్యులు రో ఖన్నా, రాజా కృష్ణమూర్తి

న్యూయార్క్, ఆగస్టు 8: బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువులపై జరుగుతున్న దాడులను భారతీయ అమెరికన్ చట్టసభ (కాంగ్రెస్) సభ్యులు రో ఖన్నా, రాజా కృష్ణమూర్తి ఖండించారు. 'బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన పోరాటం న్యాయసమ్మతమైనది. అయితే, హిందువులు లక్ష్యంగా ఆ దేశంలో జరుగుతున్న దాడులను ఆపాలి. తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన యూనస్ చర్యలు తీసుకోవాలి' అని ఎక్స్‌లో రో ఖన్నా పేర్కొన్నారు. హిందువుల ఇళ్లు, వ్యాపారాలు, ఆలయాలపై జరుగుతున్న దాడులను తక్షణం ఆపటానికి అధికారులు, పోలీసులు కృషి చేయాలని, దోషులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని రాజా కృష్ణమూర్తి ఒక ప్రకటనలో కోరారు. కాగా, బంగ్లాలో హిందువులపై జరుగుతున్న దాడులను అమెరికా ప్రభుత్వం ఖండించకపోవటాన్ని పలు హిందూ అమెరికన్ సంఘాలు తప్పుబట్టాయి. దాడులను ఆపటానికి కృషి చేయాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు 'ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడం' అమెరికా రాయబారి రషద్ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

లోకం తీరు



రాజ్యసభ నుంచి చైర్మన్ వాకౌట్!

- ఎగువ సభలో అనూహ్య ఘటన

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రాజ్యసభలో గురువారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. సాక్షాత్తూ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సభ నుంచి వాకౌట్ చేయడం కలకలం సృష్టించింది. సాధారణంగా విపక్షాలు ప్రభుత్వంపై నిరసనతో వాకౌట్ చేస్తుంటాయి. అయితే ధన్‌ఖడ్ విపక్షాల తీరుపై అసహనంతో సభ నుంచి వెళ్లిపోవడం గమనార్హం. ఉదయం సభ ప్రారంభం కాగానే.. పారిస్ ఒలింపిక్స్‌లో రెజ్లర్ వినేశ్ ఫొగట్‌పై అనర్హత వేటు అంశంపై చర్చకు ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర విపక్షాల నేతలు పట్టుబట్టారు. ఆ సమయంలో కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ తనను చూసి నవ్వడాన్ని చైర్మన్ ధన్‌ఖడ్ భరించలేకపోయారు. 'మీ అలవాటు నాకు తెలుసు. ఇక్కడ నన్ను కాదు.. చైర్మన్ స్థానాన్నే సవాల్ చేస్తున్నారు. అందులో కూర్చున్న నాకు విలువ లేదన్న భావనతోనే చాలెంజ్ చేస్తున్నారు' అని ఆక్షేపించారు. విపక్షాల వైపు నుంచి మళ్లీ రన్నింగ్ కామెంట్రీ రావడంతో ధన్‌ఖడ్ జైరాం వైపు చూసి స్పందించారు. తను ఈ చైర్‌లో కూర్చోవాలనిపించడం లేదంటూ లేచి నిల్చుని రెండు చేతులూ జోడించి సభ నుంచి వాకౌట్ చేసేశారు.

జపాన్‌ను వణికించిన భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదు

టోక్యో, ఆగస్టు 8: జపాన్ దక్షిణ తీరంలో గురువారం శక్తిమంతమైన భూకంపం సంభవించింది. దీంతో సునామీ హెచ్చరిక జారీ చేయాల్సి వచ్చింది. ప్రజలు తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. భూకంపం మూలంగా ముగ్గురికి గాయాలయ్యాయి. అయితే తీవ్ర స్థాయిలో నష్టం ఏమీ జరగలేదని తెలుస్తోంది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదైంది. క్యుషు ద్వీపం సమీపంలో దాదాపు 30 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం నమోదైనట్టు జపాన్ వాతావరణ ఏజెన్సీ పేర్కొంది.



వచ్చే ఏడాది వరకు ఐఎస్ఎస్‌లోనే సునీత విలియమ్స్!

- ఫిబ్రవరిలో తిరిగి వచ్చే అవకాశం: నాసా

వాషింగ్టన్, ఆగస్టు 8: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న వ్యోమగాములు సునీత విలియమ్స్, బచ్ విల్మోర్‌లు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో భూమి మీదికి తిరిగి వస్తారని నాసా గురువారం వెల్లడించింది. అయితే, వారిని ఐఎస్ఎస్‌కు తీసుకెళ్లిన బోయింగ్ కంపెనీ స్టార్‌లైనర్ వ్యోమనౌకలో కాకుండా.. స్పేస్‌ఎక్స్ కంపెనీకి చెందిన క్రూ డ్రాగన్ వ్యోమనౌకలో తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, బచ్ 8 రోజులపాటు అక్కడ ఉండి తిరిగి రావాలన్నది ముందస్తు ప్రణాళిక. కానీ, వారు ప్రయాణించిన స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తటంతో తిరుగు ప్రయాణం ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. స్టార్‌లైనర్‌లో వ్యోమగాములను తిరిగి తీసుకురావటం సురక్షితం కాని పక్షంలో ఆ వ్యోమనౌకను ఖాళీగా వెనక్కి రప్పించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, ఐఎస్ఎస్‌కు సెప్టెంబరులో వెళ్లే క్రూ డ్రాగన్‌లో ఇద్దరు వ్యోమగాములను మాత్రమే తీసుకెళ్లి, వారు ఫిబ్రవరిలో తిరిగి వచ్చేటప్పుడు సునీత, బచ్‌లను కూడా వెంట తీసుకురావాలని నాసా ప్రయత్నాలు చేస్తోంది.

వక్ఫ్ బిల్లుపై విపక్షాల కన్నెర్ర

సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు అధికారాలకు కత్తెర వేసే వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ సూత్రాలు, సమాఖ్యస్ఫూర్తిని ఉల్లంఘిస్తోందని.. మత స్వేచ్ఛకు విరుద్ధమని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ధ్వజమెత్తాయి. దీంతో ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపాలని కేంద్రం నిర్ణయించింది. మోదీ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పరిచాక జేపీసీకి అంగీకరించడం ఇదే మొదటిసారి. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు గురువారం లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతిపక్షాలు అనవసరంగా ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన విమర్శించారు. 1995నాటి వక్ఫ్ సవరణ చట్టాన్ని సమీకృత వక్ఫ్ యాజమాన్య, సాధికారిక, సామర్థ్య అభివృద్ధి చట్టంగా మారుస్తున్నామని రిజిజు అన్నారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిం మహిళలు, ముస్లిమేతరులకు అవకాశం కల్పించడం, షియాలు, సున్నీలు, బోహ్రాలు, ఆగాఖానీలు, ఇతర వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం, బోహరాలకు, ఆగాఖానీలకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడం తమ లక్ష్యమని ఆయన చెప్పారు. కేంద్ర పోర్టల్, డాటా బేస్ ద్వారా వక్ఫ్ ఆస్తుల నమోదును క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. వక్ఫ్ బిల్లు ఇప్పటి వరకూ హక్కులు లేని వారికి హక్కులు కల్పిస్తుందేగానీ, ఎవరి హక్కులనూ తొలగించదన్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం కొందరు పిల్లలకు మహిళలకు వారసత్వంగా రావాల్సిన భూములను వక్ఫ్‌కు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. కొన్నిచోట్ల మునిసిపల్ భూములను కూడా వక్ఫ్ భూములుగా నిర్ణయిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. తమ పూర్వీకులు ఒకచోట నమాజ్ చేశారని చెబితే దాన్ని వక్ఫ్ భూమిగా తీర్మానిస్తున్నారని.. దీనిపై మతంరీత్యాకాక సామాజిక న్యాయంరీత్యా ఆలోచించాలని రిజిజు కోరారు. మైనారిటీల పరిస్థితిపై కాంగ్రెస్ హయాంలో నియమించిన సచార్ కమిటీ సిఫారసులను దృష్టిలో ఉంచుకున్నామన్నారు.



బిల్లుకు మద్దతుగా చేతులెత్తిన బీజేపీ సభ్యులు

దేశాన్ని విభజించేలా..

కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్‌తోపాటు ఇండియా కూటమికి చెందిన పార్టీలన్నీ ఈ బిల్లు దేశాన్ని విభజించేలా ఉందని విమర్శించాయి. ఎన్డీయే మిత్రపక్షాల్లో జనతాదళ్ (యూ) ఈ బిల్లును సమర్థించగా.. దాన్ని జేపీసీకి నివేదించాలని టీడీపీ ఎంపీ హరీశ్ (అమలాపురం) కోరారు. ఈ బిల్లు అమలులోకి వస్తే ముస్లిం సమాజానికి, వక్ఫ్ ఆస్తులకు నష్టం వాటిల్లుతుందని ఏపీ టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతాఉల్లాహ్.. పార్టీ ఎంపీలైన హరీశ్, కేశినేని శివనాథ్‌ను జమాతే ఇస్లామీ హింద్ సంస్థ ప్రతినిధి వర్గంతో పార్లమెంట్‌లో కలిసి వివరించారు. వారు ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ముస్లిం సమాజానికి ఎలాంటి నష్టమూ కలగకుండా చంద్రబాబు చూస్తారని భరోసా ఇచ్చారు. కాగా మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కేంద్రం ఈ బిల్లును రూపొందించిందని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఈ బిల్లు సమాఖ్య వ్యవస్థపై దాడి చేస్తోందని దుయ్యబట్టారు. ముస్లిమేతరులను వక్ఫ్ పాలకమండలిలో సభ్యులుగా చేర్చడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. ముస్లింలపైనే కాక క్రైస్తవులు, జైనులపై దాడులు చేయడం బీజేపీ లక్ష్యమని విమర్శించారు. ఇక మైనారిటీలే తమ ఆస్తులను నిర్వహించుకునేందుకు రాజ్యాంగంలోని 30వ అధికరణ వీలు కల్పిస్తోందని, ఈ బిల్లు ఆ అధికరణకు వ్యతిరేకమని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. ఈ బిల్లును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే డిమాండ్ చేశారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని 14,15,35 అధికరణలను ఉల్లంఘిస్తోందని ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. దేశాన్ని విభజించడమే తప్ప.. సమైక్యం చేయడం ఈ బిల్లు ఉద్దేశంకాదన్నారు. ముస్లింలకు ప్రభుత్వం శత్రువనే విషయాన్ని ఈ బిల్లు స్పష్టం చేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు అధికారాలను తొలగించి మొత్తం వ్యవస్థను కుప్పకూలుస్తున్నారని ఆర్ఎస్పీ ఎంపీ ఎన్.కె.ప్రేమచంద్రన్ చెప్పారు.ఈ బిల్లు ముస్లింలకు ఎలా వ్యతిరేకమో అర్థంకావట్లేదని జేడీయూ ఎంపీ, కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ అన్నారు. కాగా వక్ఫ్ బిల్లుపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, కేంద్ర మంత్రి అమిత్‌షా మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వక్ఫ్ భూములను బీజేపీ సభ్యులకు ధారాదత్తం చేసేందుకే ఈ బిల్లును రూపొందించారని అఖిలేశ్ విమర్శించారు. లోక్‌సభ స్పీకర్ అధికారాలను కూడా కబళిస్తున్నారని తనకు తెలిసిందన్నారు. దీనిపై హోంమంత్రి అమిత్‌షా తీవ్రంగా స్పందిస్తూ స్పీకర్ అధికారాలు మొత్తం సభకు చెందినవన్నారు.


వినేష్ మా అందరికీ చాంపియనే!

- రజత పతక విజేతగానే ఆమెను పరిగణిస్తాం
- రివార్డులను అందజేసి ఘనంగా సన్మానిస్తాం
- హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీ వెల్లడి
- పోరాడి వినేష్ అలసిపోయారు: శశి థరూర్
- వినేష్‌ను రాజ్యసభకు పంపేవాళ్లం: భూపీందర్



న్యూఢిల్లీ, ఆగస్టు 8: పారిస్ ఒలింపిక్స్‌లో అనూహ్య రీతిలో పతకం కోల్పోయినప్పటికీ వినేష్ ఫొగట్ తమ అందరికీ చాంపియనే అని ఆమె సొంత రాష్ట్రం హరియాణా ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ పేర్కొన్నారు. వినేష్‌ను రజత పతక విజేతగానే పరిగణిస్తామని ప్రకటించారు. ఈ మేరకు అన్ని రివార్డులను అందజేసి ఘనంగా సన్మానిస్తామని స్పష్టం చేశారు. "హరియాణా ధీర వనిత వినేష్ అద్భుత ప్రదర్శనతో ఒలింపిక్ ఫైనల్‌కు చేరింది. కొన్ని కారణాలతో ఆమె ఫైనల్ ఆడలేకపోయింది. అయినప్పటికీ ఆమె మా అందరికీ చాంపియనే. మేమందరం నిన్ను చూసి గర్విస్తున్నాం వినేష్" అంటూ సీఎం సైనీ ట్వీట్ చేశారు. కాగా, వ్యవస్థలతో పోరాడి వినేష్ అలసిపోయారంటూ కాంగ్రెస్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ నర్మగర్భంగా మోదీ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ ట్వీట్ చేశారు. గత ఏడాది భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను తప్పించాలంటూ వినేష్ సహా అగ్రశ్రేణి రెజ్లర్లు తీవ్ర స్థాయి ఆందోళనలు చేసిన సంగతి తెలిసిందే. వాటిని దృష్టిలో పెట్టుకుని థరూర్ ట్వీట్ చేయడం గమనార్హం. మరోవైపు హరియాణా అసెంబ్లీలో తమకు తగిన బలం ఉంటే వినేష్‌ను త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజ్యసభకు పంపేవాళ్లమని కాంగ్రెస్‌కు చెందిన ఆ రాష్ట్ర మాజీ సీఎం భూపీందర్‌సింగ్ హుడా వ్యాఖ్యానించారు. ఆయన కుమారుడు, లోక్‌సభ సభ్యుడైన దీపేందర్ హుడా కూడా ఈ ప్రతిపాదనను సమర్థించారు. అన్ని పార్టీలు దీనిపైన ఆలోచించాలని సూచించారు. దీపేందర్ రాజీనామాతోనే రాజ్యసభ ఎంపీ సీటు ఖాళీ అయింది. అయితే, వినేష్ పెదనాన్న, మాజీ రెజ్లర్ గీతా ఫొగట్ తండ్రి అయిన మహవీర్ ఫొగట్ మాత్రం భిన్నంగా స్పందించారు. దేశానికి తన కుమార్తె ఎన్నో పతకాలు సాధించిందని.. ఆ సమయంలో రాష్ట్రంలో భూపీందర్ ప్రభుత్వమే ఉందని, ఆమెను కనీసం డీఎస్పీని కూడా చేయలేదని తప్పుబట్టారు. అలాంటివారు వినేష్‌ను రాజ్యసభకు పంపాలని కోరడం ఏమిటని ధ్వజమెత్తారు.

సీపీఎం దిగ్గజ నేత బుద్ధదేవ్ కన్నుమూత



కోల్‌కతా, ఆగస్టు 8: సీపీఎం దిగ్గజ నేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య (80) ఇకలేరు. కొంతకాలంగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం కోల్‌కతాలోని తన నివాసంలో కన్నుమూశారు. 2000 నవంబరు 6 నుంచి 2011 మే13దాకా పశ్చిమబెంగాల్ సీఎంగా ఉన్న ఆయన.. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేశారు. కానీ 2011లో జరిగిన ఎన్నికల్లో సీపీఎం ఓడిపోవడంతో బెంగాల్‌లో 34 ఏళ్ల వామపక్ష పాలనకు తెరపడినట్లయింది. ఇప్పుడు ఆయన మరణంతో పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో ఒక శకం ముగిసినట్లయింది!! బుద్ధదేవ్ కోరిక మేరకు ఆయన మృతదేహాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ఆర్ఎస్ ఆస్పత్రి-వైద్యకళాశాలకు అప్పగించనున్నట్టు కుటుంబసభ్యులు వెల్లడించారు. శుక్రవారం ఉదయం ఆయన భౌతికకాయాన్ని బెంగాల్ శాసనసభకు తీసుకెళ్లనున్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలించి కార్యకర్తల సందర్శనార్థం అక్కడ కొద్దిసేపు ఉంచనున్నారు. సీఎంగా ఉన్నప్పుడు రెండు గదుల చిన్న అపార్ట్‌మెంట్‌లో ఉన్నారంటే బుద్ధదేవ్ ఎంత నిరాడంబర జీవితం గడిపారో తెలుస్తుంది. ఆయన తుదిశ్వాస విడిచింది ఆ ఇంట్లోనే. 1944 మార్చి1న ఉత్తర కోల్‌కతాలోని పండితుల కుటుంబంలో బుద్ధదేవ్ జన్మించారు. ఆయన కొన్నాళ్లపాటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1966లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకుని 1972లో పార్టీ రాష్ట్ర కమిటీకి ఎంపికయ్యారు. 1977లో కాశీపూర్- బెల్గాచియా నియోజకవర్గం నుంచి గెలుపొంది తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. క్యాబినెట్ మంత్రిగానూ పనిచేశారు. 1982ఎన్నికల్లో స్వల్పతేడాతో ఓడిపోయిన ఆయన 1987లో జాదవ్‌పూర్ నుంచి గెలుపొందారు. అప్పటి నుంచి 2011దాకా అదే నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధించారు. జ్యోతిబసు ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. బుద్ధదేవ్ నేతృత్వంలో సీపీఎం 2001, 2006 ఎన్నికల్లో ఘనవిజయాలు సాధించింది. సీఎంగా పగ్గాలు చేపట్టాక పారిశ్రామిక వ్యతిరేక పార్టీ అనే ముద్రను చెరిపివేయడానికి ఆయన ఎంతోకృషి చేశారు. సింగూరులో టాటా మోటార్స్ నానో కార్ల తయారీ ఫ్యాక్టరీకి అనుమతులిచ్చారు. కానీ అక్కడ భూసేకరణపై చెలరేగిన వివాదాన్ని, నందిగ్రామ్‌లో నిరసనకారులపై పోలీసు కాల్పులను ఆయుధంగా మలచుకున్న మమతాబెనర్జీ 2011లో గెలిచి అధికారంలోకి వచ్చారు. అనంతరం బుద్ధదేవ్ క్రియాశీల రాజకీయాల నుంచి క్రమంగా తప్పుకొన్నారు. కాగా.. బుద్ధదేవ్ మృతి పట్ల ప్రధాని నరేంద్రమోదీ, పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ, సీపీఎం సీనియర్ నేత సీతారాం ఏచూరి సహా పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

కుప్పకూలిన సుంకిశాల గోడ

(మొదటి పేజీ తరువాయి)

డ్యూటీ కార్మికులు ఇంకా లోపలికి రాలేదు! ఆ సమయంలో భారీ శబ్దం! టన్నెల్ గేటు, ఇన్‌టేక్ వెల్ రక్షణ గోడ ఒక్కసారిగా కుప్పకూలాయి. కళ్లు మూసి తెరిచేలోగానే ఇన్‌టేక్ వెల్ (భారీ సంపు) నీట మునిగింది! ఆ సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. ఇదే ప్రమాదం అరగంట ముందు జరిగి ఉంటే సుమారు 100 మంది కూలీలు జలసమాధి అయ్యేవారు. హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 50 ఏళ్ల వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సుంకిశాల వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. దీని నిర్మాణ పనులకు నాటి మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్, సబిత, మహమూద్ అలీ, జగదీశ్ రెడ్డి 2022, మే 14న శంకుస్థాపన చేశారు. తొలుత, రూ.1,450 కోట్లతో మేఘా ఇంజనీరింగ్ వర్క్స్ ఒప్పందం చేసుకుంది. తర్వాత అంచనా వ్యయం రూ.2,215 కోట్లకు పెంచారు. ప్రాజెక్టులో భాగంగా ఇన్‌టేక్ వెల్, మూడేసి పంప్ హౌజ్‌లు, టన్నెళ్లు, పంప్‌హౌజ్ సూపర్ స్ట్రక్చర్ నిర్మిస్తారు. నాటినుంచి నిర్మాణ పనులు సాగుతున్నాయి.

మూడు స్థాయిల్లో పంప్‌హౌజ్‌లు

నాగార్జున సాగర్ జలాశయం కనిష్ఠ నీటి మట్టం (డెడ్ స్టోరేజీ) 510 అడుగులు. ప్రస్తుతం అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. సాగర్‌లో నీటిమట్టం 510 అడుగుల కంటే తగ్గితే.. అక్కంపల్లికి నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. నీటి మట్టం 450 అడుగుల వరకూ ఉన్నా నీటిని తరలించేందుకు వీలుగా సుంకిశాల ప్రాజెక్టు చేపట్టారు. అంటే, మండు వేసవిలోనూ హైదరాబాద్ తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలా దీనిని నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా జలాశయం నుంచి సొరంగ మార్గం (మూడు టన్నెళ్లు) ద్వారా నీటిని ఇన్‌టేక్ వెల్‌కు తరలిస్తారు. ఇక్కడి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దఅడిశర్లపల్లి మండలం కోదండాపూర్ వాటర్ ప్లాంట్‌లో నీటిని నిల్వ చేస్తారు. అక్కడ ఫిల్టర్ చేసిన తర్వాత జంట నగరాలకు తరలిస్తారు. జలాశయం నుంచి ఇన్‌టేక్ వెల్‌కు నీటిని తరలించడానికి మూడు పంప్‌హౌజ్‌లు నిర్మిస్తున్నారు. వీటిలో మొదటిది, మూడోది పూర్తయ్యాయి. రెండో టన్నెల్, పంప్ హౌజ్ పనులు కొనసాగుతున్నాయి. జూలై 29, 30, 31 తేదీల్లో టన్నెల్‌కు గేటు అమర్చారు. ఇందుకు రిజర్వాయర్ వైపున్న మట్టిని తొలగించారు. అదే సమయంలో సాగర్‌కు ఎగువ నుంచి భారీ వరద ప్రారంభమైన విషయం తెలిసిందే. దాంతో, టన్నెల్ గేటు ధ్వంసమైంది. దానికి అనుసంధానంగా ఉన్న ఇన్‌టేక్ వెల్ సైడ్ వాల్ (రక్షణ గోడ) కూలిపోయింది. కేవలం ఐదు నిమిషాల స్వల్ప వ్యవధిలోనే 590 అడుగుల ఇన్‌టేక్ వెల్ పూర్తిగా నిండిపోయింది. ఇంత పెద్ద ప్రమాదం జరిగి వారం రోజులు గడిచినా.. హైదరాబాద్ జలమండలి బయటకు వెల్లడించలేదు. నిర్మాణ సంస్థ కూడా గోప్యంగానే ఉంచింది. గోడ కూలుతున్న సమయంలో అక్కడ పని చేసే ఒడిశా కార్మికులు తీసిన వీడియో ద్వారా విషయం బయటకు వచ్చింది. నిజానికి, రక్షణ గోడ నిటారుగా ఉండడంతో ప్రమాదం ఉంటుందని, దానికి అనుసంధానంగా టై బీమ్‌లను నిర్మించాలని ఐదారు నెలల క్రితమే ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. ఆ పనులు చేస్తుండగానే ప్రమాదం జరిగింది. అదే సమయంలో గేటు ఏర్పాటుకు రిజర్వాయర్ వైపు మట్టి తొలగింపు పనులు చేశారు. దాంతో, గేటు ధ్వంసమై, రక్షణ గోడ కూలింది.

మొదటి నుంచీ వివాదాస్పదమే

సుంకిశాల పంప్‌హౌజ్ నిర్మాణ పనులు పూర్తయితే జంట నగరాలకు ఏఎంఆర్‌పీ నుంచి నీటిని తరలించడం ఆపేసి ఇక్కడి నుంచి నిరంతరాయంగా సరఫరా చేస్తారు. నిజానికి, జంట నగరాలకు సుంకిశాల నుంచి నీటిని తీసుకెళ్లాలని నాటి ఉమ్మడి ఏపీ సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ప్రతిపాదించారు. అప్పట్లో ఆ పనులను సీపీఎం, టీడీపీ వ్యతిరేకించాయి. దీనిపై అప్పట్లో నార్ల తాతారావు ఆధ్వర్యంలో ఒక కమిటీని వేసింది. ఆ కమిటీ సుంకిశాలతో లాభం లేదని తేల్చి.. అక్కంపల్లి వద్ద ఏఎంఆర్‌పీని ప్రతిపాదించింది. దీంతో, ఎన్టీఆర్ హయంలో అక్కంపల్లి వద్ద పంప్‌హౌజ్‌కు శంకుస్థాపన చేసి అక్కడి నుంచి కోదండాపూర్ పంప్‌హౌజ్‌కు తరలించి శుద్ధి చేసిన నీటిని జంట నగరాలకు తరలించే ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏఎమ్మార్పీకి బదులు సుంకిశాల నుంచి జంట నగరాలకు తాగు నీటిని అందించాలని నిర్ణయించింది. గత ఏడాది డిసెంబరుకే ఈ పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ, ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

పునః నిర్మాణ ఖర్చు మేఘాదే: జలమండలి

పునర్నిర్మాణ పనులకు సుమారు రూ.20 కోట్ల వరకూ ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రాజెక్టులో దెబ్బతిన్న భాగాన్ని మేఘా సంస్థే నిర్మిస్తుందని, ఇందుకయ్యే ఖర్చునూ నిర్మాణ సంస్థే భరిస్తుందని వాటర్ బోర్డు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అనూహ్యంగా భారీ వరద వచ్చి టన్నెల్ వద్ద ఒత్తిడి పెరగడంతో ప్రమాదం సంభవించిందని, ఉదయం 7 గంటల సమయంలో ప్రమాదం జరగడంతో సైట్ ఇంజనీర్లు ఘటనా స్థలంలో లేరని పేర్కొన్నారు. ఘటనపై బోర్డు స్థాయిలో ఇంజనీర్లతో విచారణ కమిటీ ఏర్పాటు చేశారని, సభ్యులుగా వాటర్ బోర్డు ఈడీ సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌ను నియమించారని తెలిపారు. నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటారని, మార్చిలోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ఘటనతో మరో రెండు నెలలు ఆలస్యమవుతుందని వివరించారు. నిజానికి, జలాశయం నీటిమట్టం కనిష్ఠ స్థాయిలో 510 అడుగుల కంటే తక్కువ ఉంటేనే ప్రాజెక్టు నిర్మాణ పనులు సాగుతాయి. లేకపోతే పంప్ హౌజ్‌లోకి నీళ్లు చేరి పనులకు ఆటంకం ఏర్పడుతుంది. అంటే, సాగర్‌లో నీటి మట్టం డెడ్ స్టోరేజీ కంటే తగ్గితేనే తిరిగి ఇక్కడ పనులు ప్రారంభం కానున్నాయి. అంటే, రాబోయే వేసవిలోనే ఈ పనులు చేయడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



రక్షణ గోడ కూలిపోయిన ప్రాంతం ఇదే

ఈ పాపం బీఆర్ఎస్‌దే: భట్టి



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు సుంకిశాల ప్రాజెక్టులో గోడ కూలిన పాపం కూడా గత బీఆర్ఎస్ పాలకులదేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. మేడిగడ్డ, సుందిళ్ల మాత్రమే నాసిరకమని అనుకున్నామని.. గోదావరినే కాదు కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కూడా వదిలిపెట్టలేదని సుంకిశాల ఘటన తేటతెల్లం చేస్తోందని మండిపడ్డారు. విద్యుత్తు శాఖపై గురువారం ఆయన ఖైరతాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుంకిశాల ప్రాజెక్టును బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభించారని, 2023 జూలైలో టన్నెల్ రక్షణ గోడను పూర్తి చేశారని వివరించారు. గోడలు డిజైన్ల లోపంతో కూలిపోతే.. కాంగ్రెస్ సర్కారు రాగానే కూలిందంటూ తమ పాపాన్ని వేరొకరిపై వేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సుంకిశాల ఘటనపై అధికారులు విచారణ చేస్తున్నారని చెప్పారు. విద్యుత్తు శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912కు విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన కార్యాచరణ వెంటనే చేపట్టాలని సీఎండీలను భట్టి విక్రమార్క ఆదేశించారు.

ఆనాడే వ్యతిరేకించా: గుత్తా



నల్లగొండ, ఆగస్టు 8: కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టుల నిర్మాణంపై బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం చూపిందని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆరోపించారు. సుంకిశాల పంప్‌హౌస్ నిర్మాణాన్ని ఆనాడే తాను వ్యతిరేకించానని, కేటీఆర్ దృష్టికి సైతం తీసుకెళ్లానని చెప్పారు. ఆ నిధులను ఎస్ఎల్‌బీసీకి కేటాయిస్తే బాగుండేదన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరంతోపాటు గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులపైనే పూర్తి స్థాయిలో శ్రద్ధ పెట్టిందన్నారు. కాళేశ్వరంపై చూపిన శ్రద్ధలో 15 శాతం కృష్ణా బేసిన్‌పై చూపినా నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీతోపాటు డిండి ఎత్తిపోతలు, ఉదయసముద్రం ప్రాజెక్టులు పూర్తయి ఉండేవన్నారు. నల్లగొండ జిల్లాలోని పలు ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించి.. 18 సంవత్సరాలు అవుతున్నా కొలిక్కి రాకపోవడం బాధాకరమన్నారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా 4 లక్షలు, ఏఎమ్మార్పీ ద్వారా 3 లక్షలు, డిండి ద్వారా 3 లక్షలు, ఉదయసముద్రం ద్వారా లక్ష ఎకరాలకు సాగు నీరు వస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు.నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ దృష్టి సారించాలని కోరారు.

గత సర్కారు వల్లే: పొన్నం



ఎల్కతుర్తి/భీమదేవరపల్లి, ఆగస్టు 8: సుంకిశాల పంపుహౌస్ నిర్మాణం సందర్భంగా రక్షణ గోడ కూలిన ఘటనపై న్యాయ విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా సుంకిశాలపై సమగ్ర విచారణ చేపడతామన్నారు. ప్రాథమికంగా విచారణ చేపట్టాలని హెచ్ఎండీఏ, మునిసిపల్ అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లిలో గురువారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. పెట్టుబడులను ఆహ్వానించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్తే బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్.. పెట్టుబడులు తీసుకురావాలని ఏనాడూ ఆలోచించలేదని దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగినా మాట్లాడలేని చేతగాని మంత్రి కిషన్‌రెడ్డి అని విమర్శించారు. రుణ మాఫీపై విమర్శలు చేయడం ఆయనకే చెల్లిందని మండిపడ్డారు.

అర్హులకే అసైన్డ్ భూములు

» నాదర్‌గుల్ రైతులకు డిప్యూటీ సీఎం భట్టి భరోసా

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ కాలంలో భూమి లేని పేదలకు పంచిన అసైన్డ్ భూములు తిరిగి అర్హులైనవారికే చెందేలా చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భరోసానిచ్చారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నాదర్‌గుల్ కస్రా రైతులు... గురువారం ప్రగతిభవన్‌లో డిప్యూటీ సీఎంను కలిసి తమకు కేటాయించిన భూములను కొంత మంది ప్రైవేటు వ్యక్తులు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. తప్పుడు పత్రాలతో బలవంతంగా భూముల నుంచి ఖాళీ చేయించే కుట్ర చేస్తున్నారని, వెయ్యి కుటుంబాలు ఈ భూములపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. బాధితుల గోడు విన్న డిప్యూటీ సీఎం స్పందిస్తూ.. ఈ మేరకు వారి వద్ద ఉన్న సమాచారాన్ని రాతపూర్వకంగా ఇవ్వాలని చెప్పారు. ఆ సమాచారాన్ని అధికారులకు పంపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ధ్రువీకరణ పత్రం తప్పని తేలితే ఉద్యోగం ఊడినట్టే

» రాజ్యసభలో కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 8: తప్పుడు పత్రాలు సమర్పించి ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారిని సర్వీసు నుంచి తొలగించడానికి ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలు అనుమతిస్తాయని గురువారం రాజ్యసభలో కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ప్రకటించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా వివిధ సివిల్ సర్వీసులకు అర్హులైన అభ్యర్థులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగంలో చేరితే వారిపై డీవోపీటీ ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? అన్న ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 'వివిధ మంత్రిత్వ, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల్లో చేరిన వారిపై ఫిర్యాదులు వస్తుంటాయి. తప్పుడు కుల/మత ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాన్ని సంపాదించారంటూ వచ్చే ఫిర్యాదులను సాధారణంగా ఆయా మంత్రిత్వ, ప్రభుత్వ శాఖలకు తగు చర్యల నిమిత్తం పంపిస్తాం. విచారణలో ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగంలో చేరాడని తేలితే సదరు ఉద్యోగి సర్వీసులో కొనసాగలేడు. ఉద్యోగి తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించారని తెలిసిన మరుక్షణం నియామక అధికారి నిబంధనల ప్రకారం సదరు ఉద్యోగిని తొలగించడానికి అవసరమైన చర్యలు చేపడతారు. సాధారణంగా కుల/మత ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. ఉద్యోగులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపి జారీ చేసిన అధికారి నుంచి ధ్రువీకరణ తీసుకోవాలని కేంద్రం కోరుతుంది. నెల రోజుల్లోగా వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోతే నేరుగా ఆయా మంత్రిత్వ, ప్రభుత్వ శాఖలే ఆయా ప్రభుత్వాలను సంప్రదిస్తాయి' అని కేంద్ర సహాయ మంత్రి వివరించారు.

కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసులో సీఎం అర్వింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని మళ్లీ ఈ నెల 20వ తేదీ వరకు రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. గురువారం తిహాడ్ జైలు నుంచే కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరుపర్చగా.. ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో కేజ్రీవాల్‌పై సీబీఐ దాఖలు చేసిన అనుబంధ చార్జ్‌షీట్‌ను కోర్టు ఈ నెల 12న పరిశీలించే అవకాశముంది. ఇటు, సీబీఐ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారమే ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే కేజ్రీవాల్ ఇంటికెళ్లి ఆయన సతీమణి సునీతా కేజ్రీవాల్‌తో భేటీ అయ్యారు. ఉద్ధవ్ కుమారుడు ఆదిత్య ఠాక్రే, సేన ఎంపీ సంజయ్ రౌత్.. ఆప్ ఎంపీలు సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీలుగా ఉన్న ఆప్, సేన (యూబీటీ).. త్వరలో జరగనున్న మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చర్చలు జరిపినట్లు తెలిసింది.

ఉల్లి ధరలు తగ్గించాలంటూ విపక్షాల నిరసన

» ఉల్లి దండలు మెడలో వేసుకొని ఎంపీల ఆందోళన

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ఉల్లి, ఇతర కూరగాయల ధరల పెరుగుదలను నిరసిస్తూ విపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఉల్లిపాయ దండలను మెడలో వేసుకొని పార్లమెంటు ద్వారం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెరుగుతున్న ధరలను తగ్గించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనల్లో కాంగ్రెస్, టీఎంసీ, ఆర్జేడీ, శివసేన(యూబీటీ), ఎన్సీపీ సహా ఇండియా కూటమి ఎంపీలు పాల్గొన్నారు. 'రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ.. కనీస మద్దతు ధర కల్పించడం లేదు. మహారాష్ట్రలో ఉల్లి ఎగుమతులకు అనుమతులు ఇవ్వలేదు. కాని గుజరాత్‌కు మాత్రం అనుమతి ఇచ్చింది" అని శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది విమర్శించారు.

లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన ఈడీ అధికారి

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అసిస్టెంట్ డైరెక్టర్ సందీప్‌సింగ్ యాదవ్ రూ.20 లక్షల లంచం తీసుకుంటూ సీబీఐకి దొరికిపోయారు. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3, 4 తేదీల్లో ముంబైకు చెందిన ఓ నగల వ్యాపారి ఇంట్లో ఈడీ సోదాలు చేపట్టింది. ఆ తర్వాత రూ.25 లక్షలు ఇవ్వకపోతే మీ కొడుకును అరెస్టు చేస్తానంటూ సదరు నగలవ్యాపారిని సందీప్‌సింగ్ బెదిరించారు. చర్చల అనంతరం రూ.20 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో సందీప్ లంచం తీసుకుంటున్న సమయంలో సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

20 వేల రైళ్లలో కవచ్ 4.0

» ఈ ఏడాది చివరికల్లా ఏర్పాటు చేయాలని కేంద్ర యోచన

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రైలు ప్రమాదాలను నివారించేందుకు రూపొందించిన స్వదేశీ యాంటీ కొలీషన్ సిస్టమ్ కవచ్. దీని తాజా వెర్షన్ 4.0ను దేశవ్యాప్తంగా 20 వేల ఇంజన్లలో ఏర్పాటు చేయడానికి రైల్వే శాఖ సిద్ధంగా ఉంది. ఈ ఏడాది చివరికల్లా వీటిని ఏర్పాటు చేయడానికి టెండర్లు జారీచేయాలని యోచిస్తోంది. ఒక్కో దానిలో 10 వేల ఇంజన్లకు కవచ్‌ను ఏర్పాటు చేసేలా రెండు టెండర్లను పిలవాలని భావిస్తోంది. ఈ ఏడాది అక్టోబరు నాటికి ఒక టెండర్‌ను ఖరారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. రిసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్డీఎస్‌వో) కవచ్ 4.0ను ఆమోదించిన తర్వాత వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న గత కవచ్ వెర్షన్లను కూడా 4.0తో అప్‌గ్రేడ్ చేయనున్నామని వెల్లడించారు. కొత్తతరం ఇంజన్లు ఇప్పటికే కవచ్ 4.0తో వస్తున్నాయని, వచ్చే నాలుగేళ్లలో కవచ్‌ను దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఢిల్లీ-చెన్నై, ముంబై-చెన్నై సెక్షన్లలో కవచ్ ఏర్పాటుకు ఇప్పటికే 3,300 రూట్ కి.మీ.తోపాటు అదనంగా 5వేల రూట్ కి.మీ. కవర్ చేసేలా కీలకమైన ఆటోమ్యాటిక్ సెక్షన్ల ఏర్పాటుకు ఇప్పటికే టెండర్లు పిలిచామని తెలిపారు.

ప్రమాదాలు నివారించే కవచ్

కవచ్ అనేది రైల్వే రక్షణ వ్యవస్థ. ప్రమాదాల నుంచి రైళ్లను కాపాడే కవచం. ఒకే ట్రాక్‌మీద వస్తున్న రెండు రైళ్లు ఢీకొనకుండా ఆపే 'యాంటీ-ట్రెయిన్ కొలీషన్ సిస్టమ్' కవచ్‌ను రైల్వేకు చెందిన రిజెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్డీఎస్‌వో) అభివృద్ధి చేసింది. దీని పనితీరు ఐదు ఉప వ్యవస్థలపై ఆధారపడి ఉంటుంది. రైల్వే ట్రాక్‌ల పక్కన ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్, రేడియో పరికరాలతో కూడిన టవర్లు, ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు ఏర్పాటు చేయాలి. అలాగే రైల్వే స్టేషన్లలో డేటా సెంటర్లు ఏర్పాటు చేసి దాన్ని సిగ్నలింగ్ వ్యవస్థతో అనుసంధానం చేయాలి. వీటితోపాటు రైలు ఇంజన్ కూడా కవచ్ ఉప వ్యవస్థను కలిగి ఉంటుంది. లోకోపైలట్ సిగ్నల్‌ను జంప్ చేసినా, నిర్ణీత వేగానికి మించి వెళ్తున్నా ఇది హెచ్చరిస్తుంది. ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టమ్‌తో రైలుని నియంత్రిస్తుంది. ప్రతికూల వాతావరణంలో ప్రమాదాల నివారణకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

పంచాయతీల నిధులపై హరీశ్ అబద్ధాలు

8 నెలల్లో రూ.905.88 కోట్లు విడుదల చేశాం

సర్పంచులను పాడెక్కించిన పాపం బీఆర్ఎస్‌దే: సీతక్క



హైదరాబాద్, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు కాంగ్రెస్ ప్రభుత్వం పైసాకూడా ఇవ్వలేదని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్లించారని మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలన్నీ అబద్ధాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో మంత్రి మీడియాతో చిట్‌చాట్ చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు రూ.905.88 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ నిధుల్లో 15వ ఆర్థికసంఘం నిధులు రూ.431.32కోట్లు ఉన్నాయని, అదనంగా గ్రామీణాభివృద్ధి ప్రత్యేక నిధుల పేరిట రూ.323.99 కోట్లను విడుదల చేసినట్లు చెప్పారు. పారిశుధ్య కార్మికుల వేతన బకాయిల కోసం రూ.150.57 కోట్లు విడుదలచేస్తూ జూలై13న ఉత్తర్వులిచ్చామని వెల్లడించారు. ఇవన్నీ విస్మరించి ఓ సీనియర్ నాయకుడు వాస్తవాలను వక్రీకరిస్తూ.. ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేయడం సరికాదని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సర్పంచులను ఆత్మహత్యలకు పాల్పడేలా చేసి.. వారిని పాడెక్కించిన పాపం బీఆర్ఎస్ సర్కారుదేనని సీతక్క విమర్శించారు. గ్రామ స్వరాజ్యాన్ని గంగలో కలిపి ఇప్పుడు నీతి సూక్తులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖల పురోగతిని అంచనా వేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించనున్నట్లు సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల13న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లానుంచి ప్రారంభిస్తామని చెప్పారు.

ఏది అబద్ధం?

పంచాయతీలకు కేంద్రమిచ్చిన నిధులు మళ్లించడమా?

9నెలల పాలనల్లో 9పైసలు కూడా ఇవ్వకపోవడమా?

మంత్రి సీతక్కను ప్రశ్నించిన హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): "మేం చెబుతున్నదాంట్లో ఏది అబద్ధం? కాంగ్రెస్ 9 నెలల పాలనలో పంచాయతీలకు 9 పైసలు కూడా ఇవ్వలేదని చెప్పడమా? కేంద్రం విడుదల చేసిన నిధులు ప్రభుత్వం దారి మళ్లించడమా?" అంటూ మంత్రి సీతక్కను మాజీమంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. మేం అబద్ధం చెబుతున్నామని మంత్రి సీతక్క పేర్కొనడం తగదని, ఈ ప్రభుత్వం వాస్తవాలు గుర్తించి.. సమస్యలు పరిష్కరించకపోగా ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో పంచాయతీలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పారిశుధ్య నిర్వహణ కష్టంగా మారిందని ఉన్నమాటంటే ఉలికిపాటు ఎందుకు? అని గురువారం ఒక ప్రకటనలో ఆయన నిలదీశారు. పారిశుధ్య లోపం కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలి.. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. పంచాయతీ కార్మికులకు రెండునెలల జీతాలివ్వాలి.. జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు 8నెలల గౌరవ వేతనాలివ్వలేదు. మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లులకోసం చలో సచివాలయానికి పిలుపునిస్తే ప్రభుత్వం వారిని పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించిందని ఆరోపించారు. ఉపాధిహామీ, హెల్త్ మిషన్‌వంటి పథకాలకు కేంద్రం నుంచి వచ్చిన రూ.2100 కోట్లు గ్రామాలకు ఇవ్వకుండా ప్రభుత్వం దారిమళ్లించిందని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.500 కోట్లను పంచాయతీలకు ఇవ్వకుండా ఆపలేదా? మంత్రి సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

త్వరలో కొత్త రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు

» 15తో రుణమాఫీ పూర్తి చేస్తాం

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

» సీతారామ పనుల పరిశీలన



సీతారామ ప్రాజెక్టు సొరంగాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

సత్తుపల్లి, ఆగస్టు8: గత ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రానికి రూ.7.19లక్షల కోట్ల అప్పులున్నాయని, తమ ప్రభుత్వం అసలు, వడ్డీ కింద ప్రతి నెలా సుమారు రూ.6వేల కోట్లు బ్యాంకులకు చెల్లిస్తోందని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. రూ.31వేల కోట్ల రుణ మాఫీ చేసే స్థితిలో రాష్ట్రం లేకపోయినా రైతును రాజు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఆగస్టు 15తో రైతు రుణమాఫీని పూర్తి చేస్తామని ప్రకటించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద జరుగుతున్న సీతారామ ఎత్తిపోతల పథకం పనులను మంత్రి పొంగులేటి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టులోని సొరంగంలోకి వెళ్లి పనులను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. సీతారామా ప్రాజెక్టు రీడిజైన్ పేరిట గత ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. తాము నిధులను పొదుపు చేస్తూ ప్రాజెక్టు పనులను వీలైనతం త్వరగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. వందల కోట్లు ఖర్చు చేసినా గత ప్రభుత్వం ఎకరాకు కూడా నీళ్లివ్వలేదని, అన్నీ అనుకూలిస్తే 15వ తేదీనే సీఎం చేతులమీదుగా తాము ప్రాజెక్టును ప్రారంభిస్తామని చెప్పారు. అర్హులందరికీ త్వరలో రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇస్తామన్నారు. అలాగే, 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నెలాఖరులో ప్రారంభిస్తామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కమలకు సానుకూలం!

డెమోక్రటిక్ పార్టీ తరఫున అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా పోటీలో ఉన్న కమలాహారిస్, ఉపాధ్యక్ష అభ్యర్థిగా మిన్నెసోటా గవర్నర్ టిమ్‌వాల్జ్‌ను ఎంచుకున్నారు. మంచిపేరున్న వాల్జ్‌ను ఎంచుకొని ఆమె ఎంతో మంచిపనిచేశారని అమెరికన్ మీడియా మెచ్చుకుంటోంది. గవర్నర్‌గా, ఫుట్‌బాల్ కోచ్‌గా, ఉపాధ్యాయుడుగా విభిన్న భూమికలు నిర్వహించిన వాల్జ్‌ను నిర్ణయించి తనకంటే చక్కగా, గట్టిగా ప్రత్యర్థిని విమర్శించగలిగే వ్యక్తిని కమల తోడుతెచ్చుకున్నారని పార్టీ అభిమానులు సంతోషిస్తున్నారు. డోనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్‌లను ఈయన విచిత్రమైన పదబంధాలతో, చమత్కారాలతో విమర్శిస్తూ ప్రజల దృష్టిని బాగా ఆకర్షించగలుగుతున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి, సైన్యంలోనూ పనిచేసి, మధ్యతరగతి మెచ్చినవాడిగా, శ్రామిక వర్గం పక్షపాతిగా పేరున్న వాల్జ్ చేరికతో విజయానికి కమల మరింత చేరువైనారని ఆమె పార్టీ నమ్ముతోంది.

పార్టీ ప్రతినిధులంతా ముక్తకంఠంతో డెమోక్రటిక్‌పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా అధికారికంగా ఖరారుచేయడంతో ఆమె ఒక కీలక దశ దాటింది. తద్వారా, అమెరికా అధ్యక్ష ఎన్నికల చరిత్రలో ఈ భారత, ఆఫ్రికన్ సంతతి మహిళ కొత్త అధ్యాయాన్ని లిఖించింది. అమెరికాలోని ఒక ప్రధాన రాజకీయపక్షంనుంచి అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని పొందిన తొలి నల్లజాతి వనిత ఆమె. ఇక, జో బైడెన్ బరిలో నిలిచి ఉన్నంతకాలం డోనాల్డ్ ట్రంప్ విజయం ఖాయమనీ, ఆయన చాలా ముందంజలో ఉన్నారని సర్వేలన్నీ తేల్చేశాయి. ఎన్నికల ప్రచారంలోనూ ట్రంప్ దూకుడుగా ఉంటూ వచ్చారు. పార్టీ ఒత్తిడిమేరకు బైడెన్ తప్పుకొని, కమలను క్రమంగా పెద్దలంతా బలపరుస్తున్న తరుణాన సర్వేలు ఆమెకే అనుకూలంగా ఉంటున్నాయి. ట్రంప్ కంటే కమల మెరుగ్గా పరిపాలించగలరని నమ్మేవారి సంఖ్య హెచ్చుతోంది. భారీగా విరాళాలు సమకూరడం, ఆమె సభలకు జనం పెద్దసంఖ్యలో వస్తూండటం స్పష్టంగా కనిపిస్తున్న మార్పు. గతనెలలో ట్రంప్‌మీద భయానకమైన హత్యాయత్నం జరిగిన తరువాత ప్రజల్లో ఆయనపట్ల సానుభూతి పెరిగినమాట నిజం. ఒక ధీరుడిగా, పోరాటవీరుడిగా, రక్షకుడిగా ఆయన కనిపించాడు. తుపాకీ గుండు ఛేదించిన చెవితో, రక్తం చిందిన ముఖంతో, భద్రతాబృందం మధ్యలోనుంచి పిడికిలెత్తి నినదిస్తున్న ఆ దృశ్యం ఓటర్ల మీద ప్రభావం చూపకపోదు. కానీ, ఆ దెబ్బతో ఘోరపరాజయం ఖాయమని డెమోక్రాట్లంతా భయపడి, అధ్యక్ష అభ్యర్థిని మార్చేయడం ఇప్పుడు సానుకూల ఫలితాన్నిస్తున్నది.

ఈ మార్పు గమనించబట్టే, కమలాహారిస్ మూలాలకు సంబంధించి డోనాల్డ్ ట్రంప్ నోట విచిత్రమైన వ్యాఖ్యలు వెలువడ్డాయి. మనమంతా బహుళ సాంస్కృతిక ప్రపంచంలో బతుకుతున్నామని, విభిన్న మతాలు, జాతుల మధ్య వివాహాలతో మానవ సమాజం పురోగమిస్తున్నదని ఆయనకు తెలియకపోదు. కానీ, ప్రత్యర్థి జాతీయతను అనుమానించడం ద్వారా తాను రాజకీయంగా లబ్ధి పొందవచ్చునని ఆయన అనుకున్నారు. ఆఫ్రో అమెరికన్ జర్నలిస్టుల వేదికనుంచి కమల భారతీయురాలే తప్ప, నల్లజాతి కాదని చెప్పదల్చుకున్నారు. ఆమె దశాబ్దాలపాటు తన భారతీయమూలాలను ప్రచారం చేసుకొని, ఇప్పుడే నల్లజాతి అస్త్రాన్ని వెలికితీసిందన్న రీతిలో ట్రంప్ విమర్శ చేశారు. కమల ప్రతిస్పందనను అటుంచితే, ఒక బ్లాక్ ఎకనమిస్టుకు, ఇండియన్ బయోలజిస్టుకు పుట్టిన ఆమె తన రెండు వారసత్వాలను ఘనంగా, గర్వంగా చెప్పుకోవచ్చునని కొందరు అంటున్నారు. బరాక్ ఒబామా, కమలా హారిస్ తండ్రులు ఇద్దరూ నల్ల జాతి వారేనని గుర్తుచేస్తున్నారు. భారతీయ అమెరికన్లు, నల్లజాతి అమెరికన్లు ఆమెలో తమను చూసుకుంటారన్న భయం ట్రంప్‌కు ఉండవచ్చు. భారతీయ మూలాలున్నాయి కాబట్టి, ఆమె నల్లజాతీయురాలు కాదని ఆయన నిరూపించడానికి ప్రయత్నించినప్పటికీ, అమెరికన్ శ్వేతజాతి సమాజంలో మిగతాజాతులమీద అది పెద్దగా పనిచేయదు, నిజం ఏమిటో వారికి తెలియనిదీ కాదు. అధ్యక్ష అభ్యర్థిగా కమల ప్రవేశంతో అక్కడి రాజకీయం ఒక్కసారిగా మారింది. అమెరికన్ ప్రజలు ఆశాజీవులనీ, మార్పుకోసం తపిస్తారనీ, బరాక్ ఒబామాను రెండుసార్లు అధ్యక్షుడిని చేసినట్టుగానే, కమలా హారిస్‌నూ గద్దెనెక్కిస్తారని కొందరి నమ్మకం. రేపటి ఆమె విజయం పలురకాల వివక్షలున్న అమెరికన్ సమాజంమీద విశేషమైన ప్రభావం చూపుతుందన్న ఆ నమ్మకం నిజమైతే మంచిదే.

విప్లవానికి అడ్డుగా ఆలుగడ్డ!

మానవుల విప్లవాల గురించి అందరికీ తెలుసు. భాషాభివృద్ధి ఒక మహా విప్లవం. దీనికి సరితూగే విప్లవం ఇప్పటికీ రాలేదు! నిప్పు వినియోగం, చక్రం రూపకల్పనలూ గొప్పవే! విద్యుచ్ఛక్తీ వాహనాలూ వాటి ఉన్నత దశలే! ఇక పారిశ్రామిక విప్లవ విశిష్టత తిరుగులేనిది. యంత్రశక్తి ఆధారిత ఆధునిక నాగరికతకు అదే మూలం. అంతకు ముందటి సమాజం శారీరక శ్రమపైనే ఆధారపడేది. కండరాలు కరిగిస్తేనే సంపద సృష్టి అయ్యేది. అలా కరిగించని వాళ్లంతా ఆలోచనాపరులు, వేదాంతులు, బోధకులు, పాలకులు! కండలు కరిగించేవారు సృష్టించే సంపద ఎలా పంపిణీ అవ్వాలో, అందుకు ఏ కట్టుబాట్లు కావాలో నిర్దేశించటమే వారి విధిగా ఉండేది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం వచ్చి ఆర్థిక పరిస్థితులు మారినప్పుడు నూతన భావాలు తలెత్తుతాయి. ప్రజా ప్రాతినిధ్య పాలన, వ్యాపార స్వేచ్ఛ, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పరిమిత పాత్ర లాంటి భావాలు కాస్త అటుఇటుగా పారిశ్రామిక విప్లవంతో పాటే వచ్చాయి. చరిత్ర దృష్టితో చూస్తే ఒకటి మాత్రం స్పష్టంగా కనపడుతుంది. 250 ఏళ్ల క్రితం మొదలైన పారిశ్రామిక విప్లవం ప్రపంచాన్ని సమూలంగా మార్చివేసింది. ఆ విప్లవ విస్తరణ ఇంకా సాగుతూనే ఉంది. యంత్రాలు నడవాలంటే శ్రామికులు కావాలి. వారికి కండపుష్టీ ఉండాలి. అందుకు ఆహార పంటల ఉత్పత్తి బాగా జరగాలి. ఆ పంటల్లో మనమిప్పుడు సాదాసీదాగా భావించే ఆలుగడ్డలు.. ఒకనాడు పోషించిన పాత్రను తెలుసుకుంటే విస్తుపోయే విశేషాలెన్నో వెల్లడవుతాయి. మనమిప్పుడు ఏ డాక్టరు దగ్గరకు వెళ్లినా ఆలుగడ్డల వాడకం తగ్గించాలనే చెబుతారు. కానీ ఒకప్పుడలా కాదు. ఆలుతోనే పేదలు బతికి బట్టకట్టిన కాలముంది. యూరోపు జనాభా ఇబ్బడి ముబ్బడిగా పెరగటానికి ఆలు ఒకప్పుడు విపరీతంగా తోడ్పడింది. పరిశ్రమలకు కావాల్సిన శ్రామికశక్తిని అందివ్వటానికీ దోహదపడింది. ఎక్కడో దక్షిణ అమెరికాలో వేల అడుగుల ఎత్తునున్న ఆండియన్ పీఠభూముల్లో స్థానికులు మాత్రమే వినియోగించే ఆలుగడ్డ విశ్వవ్యాప్తమై ప్రపంచ చరిత్రను మార్చివేసింది. నమ్మలేకపోయినా ఇది నిజం! ఆలు మార్చిన ప్రపంచగతిని విశ్లేషిస్తూ ప్రఖ్యాత చరిత్రకారుడు విలియం.హెచ్.మక్‌నీల్ పరిశోధనాత్మక వ్యాసాన్ని రాశారు. 'బర్క్‌షర్ ఇన్‌సైక్లోపీడియ ఆఫ్ వర్ల్డ్ హిస్టరీ'లోనూ దాని గురించి ఆసక్తికరమైన వివరాలను అందించారు. అమెరికా ఖండానికి వెళ్లిన యూరోపియన్లు తమలో నిద్రాణంగా ఉన్న సూక్ష్మక్రిములు, వైరస్‌లను స్థానికులకు అంటించి కోట్ల మరణాలకు కారణమైన సంఘటనలపై విపులంగా రాసిన చరిత్రకారుల్లో మక్‌నీల్ ముందు వరుసలో ఉంటారు.



> చరిత్రను రాజుల వీరోచిత చర్యలకూ, మతాల మహత్యాలకు పరిమితం చేస్తే ఆలూ లాంటి పంటలు సృష్టించిన ఆహార విప్లవాలు మనకు కనపడవు. అవి వివిధ వర్గాల ప్రజలపై వేసిన ప్రభావాలూ కనపడవు. మనుషులు ఎన్నో పనిముట్లను సృష్టించారు. ఎన్నో పంటలను కనిపెట్టారు. ఎన్నో శక్తులను గుప్పిటపట్టారు. విజ్ఞాన, అజ్ఞానాలనూ ఆస్వాదించారు. వాటిపై వెలుగులు ప్రసరిస్తేనే చరిత్రకు సార్థకత!

ప్రపంచ ఆహార పంటల్లో ఇప్పుడు వరి, గోధుమ, మొక్కజొన్నలు మొదటి మూడు స్థానాల్లో ఉంటే ఆలు నాలుగో స్థానంలో ఉంది. పెరూ, బొలివియల్లోని పర్వత పీఠభూమిలో ప్రకృతి సహజంగా పెరిగే ఆలుగడ్డలను నాలుగువేల ఏళ్ల క్రితమే తిండి పదార్థంగా స్వీకరించి, తర్వాతి కాలంలో దాన్ని తోటల్లో పెంచటంలోనూ స్థానికులు ప్రావీణ్యం సంపాదించారు. విత్తన సాంకర్యాలతో మేలురకాలను పండించటమూ నేర్చుకున్నారు. స్పెయిన్ నావికులు, సాహసికులు దక్షిణ అమెరికాలోకి అడుగు పెట్టేనాటికి అక్కడ ఇన్కా సామ్రాజ్యం ఉండేది. స్పెయిన్ సైనికుల దాడితోనూ, స్థానిక యుద్ధాలతోనూ సతమతమై 1572 నాటికి అది పూర్తిగా కూలిపోయింది. కొత్త సూక్ష్మక్రిములు, వైరస్‌ల దాడిని తట్టుకునే రోగనిరోధక శక్తి లేని స్థానికులు పిట్టల్లా రాలిపోయారు. ఆక్రమదారులు దీన్ని తమ మతం గొప్పతనంగా భావించారు. భగవంతుడే స్థానికులను అడ్డు లేకుండా చేస్తున్నాడని నమ్మారు.

దక్షిణ అమెరికా అంతా ఆలుకు అనుకూలమైన వాతావరణం ఉండేది కాదు. 8372 చదరపు కిలోమీటర్లు విస్తరించిన ప్రఖ్యాత టిటికాక సరస్సు చుట్టు పక్కల మాత్రమే ఆలుగడ్డల పంటకు అనువైన వాతావరణం ఉండేది. చల్లని -తేమ వాతావరణంలోనే ఆలుసాగు సాధ్యమయ్యేది. ఇన్కా సామ్రాజ్యం (1438) ఏర్పడటానికి ముందున్న చిన్న రాజ్యాలకు కూడా ఆలు ప్రధానంగా ఉపయోగపడేది. రాత్రిపూట టిటికాక సరస్సు పరిసర ప్రాంతాల్లో గడ్డకట్టుకుపోయే చలి ఉండేది. నేలమాళిగల్లో ఆలుగడ్డలను భద్రపరటానికి అదెంతో తోడ్పడింది. ఏళ్ల పాటు నిల్వలను నేలమాళిగల్లో ఉంచేవారు. అవసరమైనప్పుడు బయటకు తీసేవారు. ఇప్పటి రిఫ్రిజిరేటర్లుగా నేలమాళిగలు ఉపకరించేవి. భూమిలేని కూలీలకు కూలీగా కూడా ఆలుగడ్డలనే ఇచ్చేవారు. రైతుల నుంచి ఆలుగడ్డలనే శిస్తుగా వసూలుచేసి గిడ్డంగుల్లో ఉంచే వారు. మహా కట్టడాలు, రహదారులు, ఇతర నిర్మాణాలకు అవసరమైన కూలీలకూ ఆలుగడ్డలనే ఇచ్చేవారు. మొక్కజొన్న లాంటి ఒకటి రెండు ప్రధాన పంటలున్నా రుతువులతో సంబంధం లేకుండా లభించే ఆలుగడ్డల వల్ల ఆహారానికి కొరత ఉండేది కాదు. ఆండియన్ పర్వత ప్రాంతంలో వందలేళ్ల నాగరికతలు కొనసాగటానికి నిరంతర ఆహార లభ్యత ప్రధాన కారణంగా ఉండేది.



■ రాహుల్ కుమార్

ఇన్కా సామ్రాజ్యాన్ని కూలదోసిన తర్వాత కూడా స్పెయిన్ సైనికులు, సాహసికులు కూడా ఆలుగడ్డలు, మొక్కజొన్నలపై ఆధారపడి వ్యవహారాలు నడిపారు. బొలివియలోని పొటోసీలో (1545) వెండిగనిని తవ్వటానికి కూడా ప్రధానంగా ఆలుగడ్డలనే స్థానికులకు పంపిణీ చేశారు. స్పెయిన్ నుంచి వచ్చినవారికీ అవే ఇచ్చారు. పొటోసీలో తవ్విన వెండి వందేళ్లపాటు యూరప్‌ను ముంచెత్తింది. ఆ వందేళ్లలో స్పెయిన్ ఒక వెలుగు వెలిగింది. గని ఖాళీ కావటంతో స్పెయిన్ ప్రాభవం ముగిసింది. వెండి ప్రవహించిన వందేళ్లూ యూరప్‌తోపాటు చైనా, భారత్‌లూ తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. వెండి విపరీతంగా లభ్యమవ్వటంతో వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ధన ప్రవాహం నైతిక విలువల్లో దిగజారుడుని తీసుకు వచ్చింది. భూస్వాముల ప్రతిష్ఠ క్షీణించింది. వెండి దండిగా ఉన్న వ్యాపారుల పరపతి పెరిగింది. చైనా, భారత్‌ల నుంచి వస్తువులు కొనుగోలు చేయటానికి పొటోసీ వెండిని విపరీతంగా వాడారు. దీంతో 17వ శతాబ్దంలో భారత్, చైనాల్లో వస్త్ర, చేనేత పరిశ్రమలు పరుగులెత్తాయి.

ఇట్లా ఆలుగడ్డ నిరంతరంగా అందించిన ఆహారం, దాన్ని ఆధారంగా వెండిగనులను కొల్లగొట్టటం, అక్కడ నుంచి అది యూరప్, ఆసియా దేశాలకు తరలివెళ్లి రాజకీయ, ఆర్థిక మార్పులు కలగచేయటం... ప్రపంచ చరిత్రపై ఆలు కలగచేసిన తొలి ప్రభావంగా చెప్పుకోవచ్చు. రెండో ప్రభావం.. ఆలుగడ్డలే యూరప్ తరలి వెళ్లి అక్కడ ఎన్నో మార్పులకు కారణం కావటం. వాటిల్లో పారిశ్రామిక విప్లవానికి తోడ్పడటం ప్రధానమైంది. స్పెయిన్ నావికులు తిరిగి స్వదేశం వచ్చేటప్పుడు నౌకల్లో ఆలుగడ్డలను, మొక్కజొన్నను నింపుకుని వచ్చేవారు. మొక్కలనూ తెచ్చేవారు. క్రమేపీ పలుచోట్లకు అవి వ్యాపించాయి. మొదట జాలర్లు, ఆ తర్వాత ఐర్లండు రైతులు ఆలు సాగును ప్రారంభించారు. 17వ శతాబ్దం చివరి నాటికి ఐర్లండులో ఆలు బాగా వ్యాపించింది. మరోవైపు స్పెయిన్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లోనూ క్రమేపీ ఆలు విస్తరించింది. ఇంగ్లండు ఆక్రమణలతో తల్లడిల్లిన ఐర్లండు రైతులు ఆలుతోనే ప్రాణాలను దక్కించుకున్నారు. గోధుమతో పోల్చితే రెండు నుంచి నాలుగు రెట్లు అధిక క్యాలరీలు ఆలు నుంచీ లభించేవి. ఎకరం పొలం, పాడి ఆవు ఉంటే ఐర్లండు కుటుంబం నిశ్చింత జీవితాన్ని గడిపేచేది. ఇక యూరపులో నిరంతరం యుద్ధాలు జరుగుతూనే ఉండేవి. ఏళ్లపాటు కొనసాగేవి. సైనిక పటాలాలు కదులుతున్న ప్రాంతాల్లో రైతుల నుంచి ధాన్యాన్ని బలవంతంగా తీసుకునేవారు. యుద్ధ కాలంలో ఆలు పంట మాత్రమే చాలా చోట్ల రైతులకు మిగిలేది. అందువల్లే ప్రతి యుద్ధం అప్పుడూ ఆలుసాగు పెరిగేది. ఆలు విస్తీర్ణం పెరిగినప్పటికీ ఆహారధాన్యాల ప్రాధాన్యం తగ్గలేదు. 1750ల నాటికి ఫ్రాన్స్, జర్మనీ, పోలండ్, రష్యాల్లోకి ఆలు విస్తరించింది. యూరపులో ప్రతి ఏటా మూడోవంతు భూమిని రైతులు ఖాళీగా పెట్టేవారు. కలుపుని నివారించటానికి ఎండకాలంలో ఆ భూమిని దున్ని ఖాళీగా వదిలేసేవారు. ఈ ఖాళీ భూముల్లోనే ఆలూ సాగు మొదలైంది. అందువల్ల ఆహారధాన్యాల ఉత్పత్తికి ఆటంకం కలగకుండానే ఆలు సాగు వ్యాపించింది. క్యాలరీస్ ఎక్కువుండే ఆలు వినియోగం.. జనాభా పెరుగుదల మీద 1750 తర్వాత బాగా ప్రభావాన్ని చూపింది. అందుకే ముఖ్యంగా ఉత్తర యూరపులో జనాభా పెరుగుదల రేటు ఆనాడు రికార్డు స్థాయికి వెళ్లింది. ఆలూని ఎక్కువగా వినియోగించే కిందిస్థాయి వర్గాల్లో సంతానవృద్ధి బాగా పెరిగింది. బ్రెడ్‌తో పోల్చితే ఉడకబెట్టిన ఆలు చాలా చౌక. రై పంట స్థానాన్ని చాలచోట్ల ఆలు ఆక్రమించింది. దీంతో పరిశ్రమలకు కావాల్సిన కార్మికులు చాలా తక్కువ వేతనాలకు లభ్యమయ్యేవారు. పెరిగిన జనాభాతో సైనికులు, నావికుల సంఖ్యను ప్రభుత్వాలు విపరీతంగా పెంచాయి. ఈ బలగాలతోనే 1750 నుంచి 1950ల వరకూ ప్రపంచంపై యూరపు ఆధిపత్యం నడిచింది. దీనికి అనేక ఇతర కారణాలు తోడైనా ఆలు పంట ప్రభావాన్ని కూడా ఒక ప్రధాన కారణంగానే భావించాలని మక్‌నీల్ వ్యాఖ్యానించారు. ఆలు లేకపోతే 1848 తర్వాత జర్మనీ పారిశ్రామిక, సైనిక శక్తిగానే ఎదిగి ఉండేది కాదు. చల్లని, తేమ వాతావరణం ఉన్న అన్ని ప్రాంతాలకూ ఆలు విస్తరించింది. 1980ల నాటికి చైనాలో ఆలు సాగుకు ఇతర ప్రధాన పంటలతో పోల్చితే అంత ప్రాధాన్యం లేదు. 2002 నాటికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆలుకు పెద్ద ఎగుమతి దేశంగా చైనా మారింది. భారత్ కూడా ఆలు ఉత్పత్తిలో ద్వితీయ స్థానానికి చేరుకుంది. చారిత్రక దృష్టితో చూస్తే ఆలూకు వచ్చిన ప్రాధాన్యం స్పష్టంగా తెలుస్తుంది. కానీ మొదట్లో భయాలు, అపోహలు కూడా ఎక్కువే. లుడ్విగ్ ఫాయర్ బాఖ్ అనే జర్మనీ తత్వవేత్త తన దేశ ప్రజల రక్తాన్ని ఆలుగడ్డ పౌరుషహీనం చేస్తోందనీ, భావ విప్లవం జాప్యం కావటానికి కారణమవుతోందని వ్యాఖ్యానించారు. చరిత్రను రాజుల వీరోచిత చర్యలకూ, మతాల మహత్యాలకు పరిమితం చేస్తే ఆలూ లాంటి పంటలు సృష్టించిన ఆహార విప్లవాలు మనకు కనపడవు. అవి వివిధ వర్గాల ప్రజలపై వేసిన ప్రభావాలూ కనపడవు. మనుషులు ఎన్నో పనిముట్లను సృష్టించారు. ఎన్నో పంటలను కనిపెట్టారు. ఎన్నో శక్తులను గుప్పిటపట్టారు. విజ్ఞాన, అజ్ఞానాలనూ ఆస్వాదించారు. వాటిపై వెలుగులు ప్రసరిస్తేనే చరిత్రకు సార్థకత!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

ఇంతకీ రాజ్యాంగంలో పేజీలెన్ని అధ్యక్షా?!

"రాజ్యాంగంలో ఎన్ని పేజీలు ఉన్నాయి? చెప్పండి, రాజ్యాంగంలో ఎన్ని పేజీలు ఉన్నాయి? ఎప్పుడైనా చదివితేగా తెలియడానికి? ఊరికే రాజ్యాంగం ప్రతిని చేతిలో పట్టుకు తిరిగితే సరిపోదు, కనీసం ఒక్కసారి అయినా చదివారా? చదవరు, కాని ఎప్పుడూ చేతిలో పట్టుకు ఊరూరా తిరుగుతారు".. ఈ మాటలన్నది బీజేపీకి చెందిన పార్లమెంటు సభ్యుడు అనురాగ్ ఠాకూర్. ఈ ప్రశ్న ఎవరిని ఉద్దేశించింది? పదేళ్ల తరువాత ప్రతిపక్ష నాయకుని హోదాలో పార్లమెంటులో నిల్చుని అధికార పక్షాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ఉద్దేశించి అన్నది. అనురాగ్ ఈ ప్రశ్న అడుగుతుంటే రాహుల్ బిక్కచచ్చిపోయి, నిరుత్తరుడైపోయాడు. ఇది నిజంగా నిజమేనా? దాదాపు నెలరోజులుగా సామాజిక మాధ్యమాలలో ఈ వీడియో విస్తృతంగా సంచరిస్తోంది. దీన్ని పంపించిన వాళ్లే మళ్లీ మళ్లీ పంపిస్తున్నారు, అందుకున్న వాళ్లే మళ్లీ మళ్లీ అందుకుంటున్నారు. ఇంతకీ ఇది లైవ్ పుటేజీలో భాగమేనా? రాహుల్ బిక్కచచ్చిపోవడం, సమాధానం చెప్పలేక దిక్కులు చూడడం... నిజంగా నిజమేనా? కాదు, ఇది అర్ధ సత్యం! ఇంతకీ ఈ వీడియో అసలు స్వరూపం ఏమిటి, కొసరు దుష్ట రూపం ఏమిటీ అని కొందరు సత్యాన్వేషణాపరులు శోధించగా అనురాగ్ ఠాకూర్ ప్రశ్నలు సంధించడం నిజమే గాని, అప్పుడు సభలో రాహుల్ లేరని తేలింది.

ఇంతకీ రాజ్యాంగంలో ఎన్ని పేజీలు ఉన్నాయన్న ప్రశ్నకి ప్రాసంగికత ఏమిటి? సరే, ప్రస్తావన వచ్చింది కాబట్టి రాజ్యాంగం గురించి కాస్త చెప్పుకోవలసిందే: రాజ్యాంగం అసలు ప్రతి హీలియం నింపిన పేటికలో పార్లమెంటు గ్రంథాలయంలో భద్రంగా ఉంది. దీని పరిమాణం నిలువు 22 అంగుళాలు, వెడల్పు 16 అంగుళాలు. మొత్తం 284 మంది రాజ్యాంగ రూపకర్తలు దీనిపై సంతకాలు చేశారు. ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సుప్రసిద్ధ కాలిగ్రాఫర్ ప్రేమ్ బెహారీ నారాయణ్ రాయిజాదాను ప్రత్యేకంగా ఆహ్వానించి అన్ని వసతులు, వనరులు కల్పించి ఇంగ్లీషులో రాజ్యాంగాన్ని రాయించారు. ఈ బృహత్తర కార్యాన్ని భుజానికెత్తుకుని అద్భుతమైన అక్షరాలతో రాజ్యాంగాన్ని లిఖించినందుకు ప్రేమ్ చిల్లిగవ్వ కూడా తీసుకోలేదు. ప్రతి పుటలోనూ తన సంతకం చేసుకోవడానికి అనుమతించమని మాత్రమే ప్రేమ్ కోరారు. అందుకు నాటి ప్రధాని సంతోషంగా అంగీకరించారు. ఈ మొత్తం రాజ్యాంగాన్ని నారాయణ్ పగలనకా రాత్రనకా అకుంఠిత దీక్షతో చేతితో రాశారు. అసలు ప్రతిలో 251 పుటలు ఉన్నాయి. ఈ చరిత్రను అలా ఉంచి వర్తమానానికి వద్దాం.

> భారత ప్రజలు 234 సీట్లతో ప్రతిపక్షాన్ని పార్లమెంటులో నిలిపారు. అధికార హోదాలో ప్రతిపక్ష నాయకుడు ఉన్నారంటే అర్థం–ప్రభుత్వం చేసే మంచి పనులను మెచ్చుకుంటూనే, కాని పనులను నిలదీయమని. ప్రశ్నించడం ద్వారా ప్రభుత్వంలో ఏమి జరుగుతున్నదో, ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఏమి చేయదలచిందో ప్రజలకు వివరించాలని. ఈ 18వ లోక్‌సభ స్ఫూర్తిని అధికారపక్ష సభ్యులు గ్రహించక నోరెత్తేవారి నోళ్లు అవమానాలతో కట్టేయాలని చూస్తే రాజ్యాంగ స్ఫూర్తిని క్షీణింపజేస్తున్నట్టే.



అసత్యాలతో, అర్థసత్యాలతో వీడియోలను మార్ఫింగ్ చేసి కుప్పలు తెప్పలుగా జనంలోకి పంపుతున్న వారి అంతిమ లక్ష్యం ఏమిటి? నామ్ కే వాస్తే గా అయినా ఒక ప్రశ్నించే స్వరం ఉండరాదనా? పార్లమెంటులో మాట్లాడే హక్కును పరిరక్షించడానికి కనీసం న్యాయ పరిధిలో, చట్ట పరిధిలో ఏదో ఒక నిర్మాణాత్మకమైన వ్యవస్థ అవసరమా, కాదా? ఇందులో రాజ్యాంగ పరిరక్షక పాత్ర, నిర్వహణ పాత్ర పోషించవలసిన పార్లమెంటు సభ్యుల వైఖరి ఏమిటి? రాజకీయ దురుద్దేశాలతో అసంబద్ధమైన వీడియోలు వస్తుంటే– తమకు అనుకూలమైనవి వచ్చినప్పుడు సంబరపడడం, ప్రతికూలమైనవి వచ్చినప్పుడు విరుచుకుపడడమేనా? వారి పాత్ర ఇంతవరకే పరిమితమా? దేశంలో అత్యంత ఉత్కంఠభరితమైన వాతావరణంలో ఇటీవల జరిగిన ఎన్నికలు, అనూహ్యమైన నాటకీయ ఫలితాలనిచ్చిన ఈ ఎన్నికలు ప్రజాప్రతినిధులకు అప్పగించిన బాధ్యత ఏమిటి? ప్రజలు కోరుతున్నది ఏమిటి? ప్రజా తీర్పు సారాంశం ఏమిటి? కేంద్రంలో ప్రభుత్వం మారకపోయినా, లెక్కల తారుమారైనందుకు అధికార పక్షం వైఖరిలో ఏ కాస్త అయినా సంయమనం, సమతౌల్యం కనిపిస్తుందని ఆశిస్తే అది మాత్రం లేశమైనా కనిపించడం లేదు. కాని ప్రతిపక్షం మాత్రం తమకు అధికారం రాకపోయినప్పటికీ, భారత దేశ ప్రజలు అధికార పక్షం నడ్డి విరగకొట్టి చతికిలపడేటట్టు చేసినందుకు తమకే అధికారం కట్టబెట్టినంత, కొండొకచో అంతకంటె ఎక్కువగానే సంబరపడిపోతోంది. ఇది భారత పార్లమెంటులో ఒకానొక విచిత్రమైన దృశ్యం. ఈ దృశ్యం ఎంత అధివాస్తవికంగా ఉంది! సీట్లు, ఓట్లు లెక్కల సంగతి అటుంచితే, ప్రస్తుత పార్లమెంటుకు భారత ప్రజలు ఒక దిశానిర్దేశం చేసిన విషయం విస్మరించరానిది. అదేమంటే రాజ్యాంగ పరిరక్షణ. దాన్ని అనునిత్యం విస్మరిస్తున్న విషయం కనిపిస్తూనే ఉంది కదా. తాజాగా కులగణన గురించి రాహుల్ మాట్లాడితే కులమే లేనివాడు కులగణన గురించి మాట్లాడం ఏమిటని ఈ అనురాగ్ ఠాకూరే జూలై 30 తేదీనాడు పార్లమెంటులో మళ్లీ విరుచుకుపడ్డారు. రాజ్యాంగంలో కులాలకు సంబంధించిన అధికరణాలు ఏం చెబుతున్నాయి? కుల మత ప్రాతిపదికపై ఎవరిపైనా వివక్ష చూపకూడదని, కులమతాలతో, లింగ భేదాలతో ప్రమేయం లేకుండా భారత పౌరులు అందరినీ సమానంగా చూడాలనీనూ. ఆ అర్థంలో ఒక సభ్యుడు కులగణన ఆవశ్యకత గురించి సభలో అడుగుతుంటే అసలు నీకు కులమే లేదన్న అర్థంలో హేళన చేయడం ఆ రాజ్యాంగ స్ఫూర్తిని బలహీనపరచడం కాదా?

ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు భారత ప్రజాస్వామ్యానికి ఒక కొంగ్రొత్త అర్థాన్ని ఇచ్చాయి. ఇది 16, 17 లోక్‌సభల వంటి పరిస్థితి కాదు. ప్రజలు చాలా స్పష్టంగా బ్రూట్ మెజారిటీకి కాలం చెల్లిపోయిందని తీర్పు చెప్పారు! అప్పుడంటే ప్రతిపక్ష నాయకుడే లేని నికృష్ట కాలం. ఇప్పుడు అలా కాదు, దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారత ప్రజలు ఏకంగా 234 సీట్లతో ప్రతిపక్షాన్ని పార్లమెంటులో నిటారుగా నిలిపారు. అధికార హోదాలో ప్రతిపక్ష నాయకుడు ఉన్నారంటే అర్థం ప్రభుత్వం చేసే మంచి పనులను మెచ్చుకుంటూనే కాని పనులను నిలదీయమని. ప్రశ్నించడం ద్వారా ప్రభుత్వంలో ఏమి జరుగుతున్నదో, ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఏమి చేయదలచిందో ప్రజలకు వివరించాలని. ఈ 18వ లోక్‌సభ స్ఫూర్తిని అధికారపక్ష సభ్యులు గ్రహించక నోరెత్తేవారి నోళ్లు అవమానాలతో కట్టేయాలని చూస్తే రాజ్యాంగ స్ఫూర్తిని క్షీణింపజేస్తున్నట్టే. ఇటీవల సుప్రీంకోర్టు చెప్పిన మాట కూడా అదే కదా. వేధింపుల భయంతో పార్లమెంటు సభ్యులు తమ వాక్ స్వేచ్ఛను సరిగ్గా ఉపయోగించుకునే పరిస్థితిని కల్పించనప్పుడు అది పార్లమెంటుకు గాని, రాజ్యాంగానికి గాని ఏమి శోభ చేకూరుస్తున్నట్టు అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఆందోళనతో వ్యాఖ్యానించారు. "ఝార్ఖండ్ ముక్తి మోర్చా అవినీతి కేసు"గా ప్రాచుర్యం పొందిన కేసులో ప్రధాన న్యాయమూర్తి మరో మాట చెప్పారు. పార్లమెంటు సభ్యులు గాని, అసెంబ్లీ సభ్యులు గాని నిర్భయంగా మాట్లాడే పరిస్థితి లేకపోతే, ఏ కారణం చేతనైనా వారు భీతిల్లిపోతే, సమున్నతమైన ఈ సభలు తమ ప్రాతినిధ్య స్వభావాన్నే కోల్పోతాయి, ఆ పరిణామం అభిలషణీయం కాదని ఆయన నొక్కి చెప్పారు. రాజ్యాంగం ప్రజలకు వాక్ స్వేచ్ఛకు హామీ ఇచ్చింది, అదే ప్రజాప్రతినిధులకూ వర్తిస్తుంది. దీన్ని నిర్వీర్యం చేయరాదన్నది ఆయన మాటల సారాంశం. మరి అది ఆచరణలో జరుగుతోందా?

కాలం మారిందని గుర్తించి అధికారపక్ష సభ్యులు వ్యవహరించవలసిన సందర్భం ఇది. ప్రతిపక్షాన్ని గేలి చేయకుండా, వారితో గౌరవంగా మెలిగేటట్టు చూడవలసిన బాధ్యత స్పీకర్‌కే ఉంది. ఏవైనా కీలకమైన నిర్ణయాలు చేసేటప్పుడు ప్రతిపక్ష నాయకునితో పంచుకోవడం బ్రిటన్‌లో ఆనవాయితీగా వస్తోంది. మనం తరిమేశాం కదా అనుకోకుండా, ఈ సంప్రదాయాన్ని అలవరచుకుంటే పోయేదేం లేదు, విద్వేషాలు తప్ప! పార్లమెంటులో అధికార పక్షం కంటె ప్రతిపక్షానికే మాట్లాడే సమయం ఎక్కువ ఇవ్వాలని జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న కాలంలో స్పీకర్‌తో అనేవారట. వారి ద్వారానే కదా ప్రజల సమస్యలు ఏమిటో, వారు కాంక్షిస్తున్నది ఏమిటో తెలుసుకునేది, అధికార పక్షం సభ్యులే మాట్లాడుతూ పోతే పొగడ్తలు తప్ప మరేం ఉంటుంది అని ఆయన పార్లమెంటుకు దిశానిర్దేశం చేసేవారట. మరి వ్యక్తిగత ఇష్టానిష్టాలతో ప్రమేయం లేకుండా నెహ్రూ పాటించిన ఈ ప్రజాస్వామిక పద్ధతులను కూడా అలవరచుకోవచ్చు, పోయేదేం లేదు, అహం తప్ప!

■ జగన్ (సీనియర్ జర్నలిస్ట్)

ఆదివాసీల హననానికే 'కగార్'

ఆగస్టు-9ని 'అంతర్జాతీయ ఆదివాసీ దినం'గా జరపాలని ఐక్యరాజ్యసమితి 1982లో నిర్ణయించింది. ఆనాటి నుంచి కేంద్రంలో ఆయా రాష్ట్రాల్లో పాలకులు దీనిని వేడుకగా జరుపుతున్నారు. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంతగానో చేస్తున్నట్లు పెద్దయెత్తున ప్రచారం చేసుకుంటున్నారు. లోతైన విశ్లేషణ చేస్తే... 'కశ్మీర్ అయినా, మణిపూర్ అయినా, దండకారణ్యమైనా ఏ పీడిత జన సముదాయమైనా, అన్నిటి మీదా అందరి మీద గురితో 'ఫాసిస్టు' దండయాత్ర సాగుతున్నది. ఒక వైపు ఆదివాసీ దినం జరుపుతూ, మరోవైపు వారిని విధ్వంసం చేస్తున్న పాలకుల ద్వంద్వనీతిని ఈసారి జరిగే 'ప్రపంచ ఆదివాసీదినం' సందర్భంగా బట్టబయలు చేయాల్సిన అవసరం ఉంది! 2023లో తీసుకొచ్చిన నూతన అటవీ పరిరక్షణ చట్టాన్ని రద్దు చేయాలని నినదిస్తూ, ఆదివాసీల హక్కుల పరిరక్షణకై పోరాడుదాం.

ఆపరేషన్ 'కగార్' అనే 'రాజకీయ సాంస్కృతిక సైనికవ్యూహం' మధ్యభారతంలో ఈ ఏడాది జనవరి-1న ఆరంభమైంది. ఆ రోజు దండకారణ్యంలోని బీజాపూర్ జిల్లా గంగలూరు దగ్గర ఉన్న 'ముద్దుం' అనే ఊరిమీద దాడి జరిగి మంగ్లీ అనే ఆరునెలల ఆదివాసీ పాప తల్లి ఒడిలో పాలు తాగుతూ సైనిక బలగాల కాల్పుల్లో కన్నుమూసింది. ఆదివాసీల పిల్లలను, స్త్రీలను, పురుషులను చంపినట్లుగా నిజనిర్ధారణ బృందాల ద్వారా, వార్తా ప్రసార మాధ్యమాల ద్వారా విస్తుపోయే కథనాలు బయటి ప్రపంచం విన్నది, చూసింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక ములుగు-కొత్తగూడెం జిల్లాల పరిధిలోని షెడ్యూలు ప్రాంతంలో దామరతోగు-బొల్లేపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఆ పార్టీ వైఖరి తేటతెల్లమయ్యింది.



> భారత రాజ్యాంగంలోని షెడ్యూలు–5 అడవి బిడ్డలకు అనేక రకాల హక్కులను, గ్యారంటీలను కల్పిస్తూ వచ్చినా... గడిచిన ఏడున్నర దశాబ్దాల పాలన అడవి బిడ్డలకు తీరని అన్యాయాన్ని మిగిల్చింది. అభివృద్ధి పేరుతో సాగుతున్న భారీ ప్రాజెక్టులకు, జలాశయాలకు, ఫ్యాక్టరీలకు, మైనింగ్‌కు, పారిశ్రామిక కారిడార్లకు, అభయారణ్యాలకు అడవులే దిక్కయ్యాయి.

షెడ్యూలు ప్రాంతంలో అడవిపై, భూములపై హక్కులను రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించింది. 1/70 చట్టం సైతం వీరికి అండగానే చేశారు. 'రాజ్యాంగం' ప్రకారం షెడ్యూలు ప్రాంతంలోని ఆదివాసీలకు స్వయంపాలన కల్పించాలి. విభజించి పాలించిన తెల్లదొరల కుటిలనీతికి నేటి పాలకులు పాల్పడుతున్నారు. కొమరంభీం, అల్లూరి, సోయం గంగులు, బిర్సాముండా, తదితర వీరుల విగ్రహాలను నెలకొల్పి, పూలదండలు వేస్తూ వారి వారసులను అంతం చేస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాలపై ఉక్కుపాదం మోపుతూ, పాశవిక హననానికి, నిర్బంధానికి పాల్పడుతున్నారు. కార్పొరేట్ కంపెనీల అడుగులకు మడుగులొత్తుతూ పోలీసు, పారా మిలటరీ సైన్యాలను, అటవీ అధికారులను ఆదివాసీల పైకి ఉసిగొల్పుతున్నారు.

2023 పార్లమెంటు వర్షాకాల సమావేశాలలో నూతనంగా రూపొందించిన అటవీ పరిరక్షణ చట్టంతో అడవుల వినాశనం, ఆదివాసీల అస్తిత్వ హననం తప్పదని, దాని రద్దుకై పోరాడుతున్న ఆదివాసీ ప్రజలను పక్కదారులు పట్టించారు. అందుకు దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ ప్రాంతాల మీదుగా 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'కు నరేంద్ర మోదీ పిలుపునిచ్చి ప్రారంభించడం ఆదివాసీ సమాజానికి తెలిసిందే. నిజానికి ఇది ఎవరి వికాసం కోసమో, ఎవరి వినాశనం కోసమో ఆ యాత్ర ప్రారంభం రోజే గడ్చిరోలి జిల్లా పోలీసులు తోడగుట్ట ప్రజా ధర్నాపై అమానుషమైన దాడి జరపడం ద్వారా ప్రజలకు, ప్రపంచానికి తేటతెల్లం చేశారు.

90వ దశకంలో దేశంలో ముందుకొచ్చిన సరళీకరణ, ప్రైవేటీకరణ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు సంక్షేమ రంగానికి గోరీ కడుతూనే ఉన్నాయి. దేశ సంపదను, సకల వనరులను స్వదేశీ, విదేశీ బహుళజాతి సంస్థలు యథేచ్ఛగా దోచుకెడుతూనే ఉన్నాయి. అపార ఖనిజ సంపదకు, సహజవనరులకు నిలయంగా ఉన్న అడవులను, కొండలను, గుట్టలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ ఆదివాసీలను అడవుల నుంచి బలవంతంగా వెళ్లగొట్టే చర్యలకు దిగారు.

భారత రాజ్యాంగంలోని షెడ్యూలు-5 అడవి బిడ్డలకు అనేక రకాల హక్కులను, గ్యారంటీలను కల్పిస్తూ వచ్చినా... గడిచిన ఏడున్నర దశాబ్దాల పాలన అడవి బిడ్డలకు తీరని అన్యాయాన్ని మిగిల్చింది. అభివృద్ధి పేరుతో సాగుతున్న భారీ ప్రాజెక్టులకు, జలాశయాలకు, ఫ్యాక్టరీలకు, రహదారులకు, మైనింగ్‌కు, పారిశ్రామిక కారిడార్లకు, జాతీయ పార్కులకు, అభయారణ్యాలకు అడవులే దిక్కయ్యాయి. ఈ అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేసుకొని బతుకుతున్న ఆదివాసీలు కోట్లాదిగా నిర్వాసితులు అవుతున్నారు. కేంద్రం, ఆయా రాష్ట్రాల పాలకులు చెబుతున్నట్లుగా అటవీ విస్తీర్ణం తగ్గిపోవడానికి, పర్యావరణం దెబ్బతినడానికి ఆదివాసీలు కారణం కాదు. అధికార పార్టీల అండదండలతో బడా కలప కాంట్రాక్టర్లు, స్మగ్లర్లు, అవినీతి అధికారగణమే అడవుల విధ్వంసానికి కారణం.

చరిత్రలో ఎక్కడ చూసినా పోరాటం, త్యాగాలు లేకుండా ఆదివాసీ, ఇతర పేదలకు భూమి, హక్కులు దక్కలేదనడానికి చాలా సాక్ష్యాలున్నాయి. 1946 నుంచి 1952 వరకు సాగిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలు.. నక్సల్బరీ, శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటాలు, ప్రతిఘటనా పోరాటాలు ఆదివాసులకు చూపుతున్న సత్యాలు! ఇంకోవైపు, అవినీతికర ఆదివాసీయేతర పాలకుల కనుసన్నలలోనే కొత్తగా దొంగరికార్డులు సృష్టించబడి చట్టబద్ధం అవుతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలకు మైదాన ప్రాంతాల నుంచి వలసలు కొనసాగుతున్నాయి. చివరికి తమ ప్రాంతంలోనే ఆదివాసీలు పరాయివాళ్ళవుతున్నారు. రాజ్యాంగాన్ని సవాలు చేస్తూ ఆదివాసీ చట్టాలను సవరించాలని, షెడ్యూలు ప్రాంతం నుంచి మినహాయించాలని కొంతమంది ఆదివాసీయేతరులను పాలకులే దుర్మార్గంగా కోర్టు మెట్లెక్కిస్తున్నారు.

రాజ్యాంగంపై ప్రమాణం చేస్తూ దానినే ఉపేక్షిస్తున్నారు. పార్లమెంటు, అసెంబ్లీలు చేసిన పెసా చట్టం, అటవీ హక్కులచట్టం, 1/70 చట్టాలను బుట్టదాఖలు చేస్తున్నారు. షెడ్యూలు ప్రాంతాల నుంచి గెలిచిన ఆదివాసీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు సైతం వారి స్వార్థ సంపాదనే ప్రాధాన్యంగా ఆదివాసీయేతర పాలకులకు లొంగిపోతూ ఆదివాసీలకు తీరని అన్యాయం చేస్తున్నారు. రాజ్యాంగం ద్వారా వీరి రక్షకులుగా అధికారాలు కల్పించబడిన గవర్నర్లు సైతం కేంద్ర, రాష్ట్ర పాలకుల పట్ల ప్రభు భక్తిని చాటుకుంటున్నారు. ఈ ఏడాది 'ప్రపంచ ఆదివాసీ దినం' సందర్భంగా రాజ్యాంగం, చట్టాలను కాలరాచివేస్తున్న పాలకుల విధానాలను బట్టబయలు చేద్దాం.

• మంతెన సంజీవరావు
తెలంగాణ ప్రజాఫ్రంట్

(నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల సంఘీభావ సదస్సు.)

జాబ్ క్యాలెండర్ చారిత్రాత్మకం

తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువు తీరిన వారం రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించింది. ఆరోగ్యశ్రీ పథకం ఖర్చు మొత్తాన్ని పెంచింది. ప్రభుత్వ ఆర్థిక స్థితి అంతంత మాత్రంగానే ఉన్నా రైతు భరోసాను అమలు చేసింది. గతంలో రైతుబంధులో ఉన్న లోసుగులను కూడా ప్రభుత్వం ధైర్యంగా తొలగించే ప్రయత్నం చేస్తోంది. అదేవిధంగా రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీని కూడా మొక్కవోని దీక్షతో అమలుచేస్తోంది.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తన వాగ్దానాల అమలులో భాగంగా రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్‌ని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించింది. ఇది నిరుద్యోగులందరినీ సంభ్రమాశ్చర్యాలకి గురిచేసింది. ఈ జాబ్ క్యాలెండర్‌కి పెద్ద చరిత్రనే ఉంది. దాదాపు 40 సంవత్సరాల నుంచి నిరుద్యోగులను ఇది ఊరిస్తూనే ఉంది. పార్టీలతో సంబంధం లేకుండా గత ప్రభుత్వాలు జాబ్ క్యాలెండర్ గురించి ఆలోచన కూడా చేయలేదు. 1990 నుండి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైనవారు తమ హయాంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. కానీ సాధించలేకపోయారు. గత ప్రభుత్వాలు ఏళ్లకు ఏళ్లు ఎలాంటి ఉద్యోగ నియమాలు చేపట్టకుండా ఇదిగో నోటిఫికేషన్, అదిగో నోటిఫికేషన్ అంటూ కాలం గడిపాయి. చాలామంది అభ్యర్థులు కనీసం ఎలాంటి పరీక్షలకు హాజరు కాకుండానే వయోపరిమితి దాటిపోయారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేసింది. దీనివల్ల ఉద్యోగార్థులు తగిన ప్రణాళికతో చదువుకునే అవకాశం ఏర్పడింది. ఈ జాబ్ క్యాలెండర్‌కి ఇంకా మెరుగులుదిద్దాల్సిన అవసరం ఉంది.

దీనిని ప్రతి సంవత్సరానికి వర్తించే విధంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కి ఒక షెడ్యూలు చట్టబద్ధంగా ఏర్పాటు చేయాలి. టెక్నికల్ జాబులు మినహా దాదాపు అన్ని క్యాడర్ ఉద్యోగాలకు డిగ్రీ పరీక్ష ఉత్తీర్ణత అర్హతగా ఉన్నందున, గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు ఒకే పరీక్ష నిర్వహించే విధంగా చట్టం రూపొందించాలి. యూపీఎస్సీ, సివిల్స్ పరీక్ష తరహాలో ఉద్యోగాలను గ్రూప్-ఏ గ్రూప్-బి లుగా విభజించుకుని మెరిట్ ద్వారా ఉద్యోగాలను భర్తీ చేస్తే ఉద్యోగార్థులు అనేక పరీక్షలు రాసే బాధ తప్పుతుంది. ఒక నోటిఫికేషన్‌లో ఉత్తీర్ణత పొందకపోయినా నిరుత్సాహపడకుండా రాబోయే నోటిఫికేషన్‌లో పోటీపడవచ్చు. ఏది ఏమైనా దశాబ్దాల నాటి నిరుద్యోగుల ఆశలు తీర్చడానికి ఒక అడుగు ముందుకు వేసిన రేవంత్‌రెడ్డి సర్కార్‌ని అభినందించాలి. ఈ జాబ్ క్యాలెండర్‌కి చట్టబద్ధత కల్పించే విధంగా సర్కార్ చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.

– వేణుగోపాలరావు, నల్గొండ



కేయూ పాలకమండలి సమావేశంలో పాల్గొన్న వీసీ వాకాటి కరుణ, పాలకమండలి సభ్యులు

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా..

- కేయూ పాలక మండలి కీలక నిర్ణయం
- హైదరాబాద్‌లో ఇన్‌చార్జ్‌ వీసీ కరుణ ఆధ్వర్యంలో సమావేశం
- తప్పుడు సమాచారమిచ్చిన డీన్లు, హెచ్‌వోడీలపై మండిపాటు
- పకడ్బందీగా వర్సిటీ ప్రహరీ నిర్మాణం
- వీసీ సెర్చ్‌ కమిటీ మెంబర్‌కు ఈసీ సిఫార్సు

7 లో..



ఆధునికీకరణ దిశగా అడుగులు

అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్తరూపు

హనుమకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు కొత్త రూపును సంతరించుకుంటున్నాయి. ప్రస్తుతం సాదాసీదాగా నడుస్తున్న ఈ కేంద్రాలు.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునీకరణ దిశగా అడుగులు వేయబోతున్నాయి. పూర్వ ప్రాథమిక (పీ స్కూల్‌) స్థాయి నుంచే ఈ కేంద్రాల్లో చిన్నారులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పిల్లల తల్లిదండ్రులు ఇప్పుడు ఎక్కువగా తమ పిల్లలను పూర్వ ప్రాథమిక స్థాయిలోనే ప్రైవేటు స్కూళ్లలో చేర్పించడానికి మక్కువ చూపుతున్నారు. మారుమూల తండాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూలీనాలీ చేసుకొని బతికే నిరుపేదలు వారి ఆర్థిక స్థోమత దృష్ట్యా ప్రీస్కూల్‌ స్థాయిలో తమ పిల్లలకు ఆంగ్లమాధ్యమం బోధించే ప్రైవేటు ప్రీస్కూళ్లలో చేర్పించలేని స్థితి. దీనిని దృష్టిలో పెట్టుకొని అంగన్వాడీ కేంద్రాలను ఆ స్థాయిలో తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా పక్కా కార్యప్రణాళికను రూపొందించింది.

ప్రత్యేక శ్రద్ధ

అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యపై మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. మూడేళ్ల నుంచి అయిదేళ్లలోపు చిన్నారులకు ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందుకు అనుగుణంగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు ఆంగ్ల మాధ్యమ బోధనపై శిక్షణ ఇస్తోంది. బాల్యదశ నుంచే చిన్నారుల ఎదుగుదలకు ఉపకరించేలా నూతన ఆంగ్ల పాఠ్యాంశాలను ప్రభుత్వం రూపొందించింది. అంగన్‌వాడీ టీచర్లు సులభంగా చదివి, అర్థం చేసుకొని, ఆచరించగలిగేలా ప్రియదర్శిని, పూర్తి ప్రాథమిక విద్యాదీపిక పుస్తకాలు అందచేసింది. జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ), జాతీయ పాఠ్యప్రణాళిక ప్రారంభ దశ (ఎన్‌సీఎఫ్‌) అధికారులు సంయుక్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరికొత్త విద్యాప్రణాళికను అందించారు.

ఆంగ్ల బోధన

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రాథమిక (ఫౌం డేషన్‌) దశలో బలమైన పునాది వేయటం ఎంతో కీలకం. అయితే అనేక మంది అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు ఆంగ్లంపై సరైన పట్టు లేక ఇబ్బందులు పడుతున్నారు. అందుకే వీరందరూ ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తొలుత హనుమకొండ, వరంగల్‌, జనగామ, మహబూబాబాబాద్‌ ములుగు, జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాల నుంచి పదిమంది చొప్పున సూపర్‌వైజర్లను ఎంపిక చేసి హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించింది. శిక్షణ పొందిన రిసోర్స్‌ పర్సన్లు (సూపర్వైజర్లు) జిల్లాలో ప్రాజెక్టుల వారీగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులను బృందాలుగా విభజించి మెళకువలు నేర్పుతారు. ఆరు జిల్లాల్లోని అంగన్‌వాడీ టీచర్లకు ఆంగ్లమాధ్యమం బోధనపై జూన్‌నెల నుంచి దశల వారీగా శిక్షణ కొనసాగుతోంది. టీ-శాట్‌ ద్వారా ఎల్‌ఈడీ టీవీలు, సెల్‌ఫోన్ల ద్వారా ఆంగ్ల బోధనపై అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు పట్టు సాధించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పదో తరగతి విద్యార్హత కలిగిన టీచర్లు సైతం సులభంగా బోధించేలా తీర్చిదిద్దుతోంది.

ప్రీస్కూల్స్‌గా..

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను క్రమంగా పూర్వ ప్రాథమిక పాఠశాలలు (ప్రీస్కూల్స్‌)గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. జాతీయ విద్యావిధానం-2020కు అనుగుణంగా వీటిని అభివృద్ధి చేసేలా రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది. తొలి విడత కింద ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో ఉన్నవాటిని ప్రీస్కూల్స్‌గా అప్‌గ్రేడ్‌ చేసే దిశగా చర్యలు వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల సమాచారాన్ని క్రోడీకరించిన రాష్ట్ర సంక్షేమ శాఖ ఈ మేరకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ కేంద్రాల ఆధునీకరణకు అవసరమైన మౌలిక వసతులు, నిధులు, తదితర అంశాలతో ప్రతిపాదనలను ప్రాథమికంగా ఖరారు చేశారు. ఇంటర్‌ అర్హతతో త్వరలో కొత్తగా నియామకం అయ్యే టీచర్లను ఈ ప్రీస్కూళ్లలో భర్తీ చేయవచ్చునని తెలుస్తోంది.

- ప్రీస్కూల్‌గా మార్చే యోచనలో సర్కారు
- ఆంగ్ల మాధ్యమంలో బోధనకు కార్యప్రణాళిక
- టీచర్లకు శిక్షణ.. త్వరలో ఇంటర్‌ అర్హతతో నియామకం
- ఉమ్మడి జిల్లాలో 5,083 కేంద్రాలు, లక్షా 64వేల మంది విద్యార్థులు



ఇంటర్‌ అర్హతతో టీచర్ల భర్తీ

నెల రోజుల్లో ఇంటర్‌ అర్హతతో కొత్తగా అంగన్‌వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియ మొదలు కాబోతున్నది. గతంలో అంగన్‌వాడీ టీచర్‌ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత కావాలని నిబంధన ఉండేది. తాజాగా అందిన మార్గదర్శకాల ప్రకారం విద్యార్హతను ఇంటర్మీడియట్‌కు పెంచుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సాంకేతిక వినియోగం, ఆన్‌లైన్‌ రికార్డుల నమోదు, ఆండ్రాయిడ్‌ మొబైల్‌ యాప్‌ల ద్వారా రోజు వారీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. వయసు 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలి. మొత్తం ఖాళీల్లో అర్హులైన సహాయకులు ఉంటే ఉద్యోగోన్నతుల ద్వారా ఆయా ఖాళీలను భర్తీ చేస్తారు. మిగిలిన వాటిని నోటిఫికేషన్‌ ద్వారా భర్తీ చేయనున్నారు.

5,083 అంగన్‌వాడీ కేంద్రాలు

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో మొత్తం 20 ఐసీడీఎస్‌ ప్రాజెక్టులు ఉన్నాయి. 5,083 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 5,083 మంది అంగన్‌వాడీ టీచర్లు, 5,083 మంది ఆయాలు ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్ల మధ్య వయసు చిన్నారులు 1,64,503 మంది ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 3 ఐసీడీఎస్‌ ప్రాజెక్టుల పరిధిలో 788 మంది అంగన్‌వాడీ సెంటర్లు, అంతే మంది టీచర్లు, ఆయాలు ఉన్నారు. 31,230 మంది చిన్నారులు ఉన్నారు. వరంగల్‌ జిల్లాలో 3 ప్రాజెక్టుల పరిధిలో 919 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిల్లో 919 మంది అంగన్‌వాడీ టీచర్లు, అంతేమంది ఆయాలు, 34,160 మంది చిన్నారులు ఉన్నారు. జనగామ జిల్లాలో 3 ప్రాజెక్టుల పరిధిలో 695 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిల్లో 695 మంది అంగన్‌వాడీ టీచర్లు, అంతే సంఖ్యలో ఆయాలు ఉన్నారు. ఇక పిల్లలు 23,642 మంది చదువు నేర్చుకుంటున్నారు. మహబూబాబాద్‌ జిల్లాలోని 5 ప్రాజెక్టుల కింద 1,437 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, వీటిల్లో అంతేసంఖ్యలో టీచర్లు, ఆయాలు ఉన్నారు. చిన్నారులు 37,237 మంది ఉన్నారు. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలోని 2 అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలో 604 సెంటర్లు, అంతే సంఖ్యలో టీచర్లు, ఆయాలు, 20,394 మంది పిల్లలు ఉన్నారు. ములుగు జిల్లాలోని 4 ప్రాజెక్టుల కింద ఉన్న 640 అంగన్‌వాడీ సెంటర్లలో అంతే సంఖ్యలో టీచర్లు, ఆయాలు, 17,930 మంది పిల్లలు ఉన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు

- వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ ఝా

వరంగల్‌ క్రైం, ఆగస్టు 8: కాలేజీల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ ఝా ఒక ప్రకటనలో హెచ్చరించారు. జూనియర్ల పట్ల సీనియర్లు స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. జూనియర్లకు సీనియర్లు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌ అనేది అమానుష చర్య అన్నారు. తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం మంచి విద్యార్థుల లక్షణం కాదన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడి కేసులపాలై భవిష్యత్‌ పాడుచేసుకోవద్దన్నారు. అధ్యాపకులు ర్యాగింగ్‌ను వ్యతిరేకించే విధంగా నూతన విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలన్నారు. ర్యాగింగ్‌కు గురయ్యే వారు 100 డయల్‌ చేయాలని అంబర్‌ కిషోర్‌ ఝా సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్‌, ఆగస్టు8: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌ ప్రావీణ్య సూచించారు. కలెక్టర్‌ క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన అభివృద్ధి పనుల సమీక్షా సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనులు పూర్తయినవి గుర్తించి ఎంబీలో నమోదు చేయాలన్నారు. పూర్తయిన పనులను ఆప్‌ కమిటీ, ప్రధానోపాధ్యాయులతో పనులు పూర్తయినట్లు సర్టిఫై చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో ఏమైనా పనులు మిగిలి ఉంటే వాటికి త్వరగా అంచనాలు తయారుచేసి సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. అలాగే మంజూరైన పనులను త్వరగా ప్రారంభించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఆప్‌లో మంజూరైన ఎలక్ట్రిసిటీ, మైనర్‌ రిపేర్లు, తాగునీరు, టాయిలెట్లు మొదలైన పనులను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలలో కూడా ఉన్నతీకరణలో భాగంగా చేస్తున్న పెయింటింగ్‌, టాయిలెట్స్‌, ఎలక్ట్రిసిటీ పనులను త్వరగా పూర్తిచేయించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో సంబంధిత డిపార్ట్‌మెంట్‌ల అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా బ్రిడ్జి పనులు పూర్తి చేయండి

- బల్దియా కమిషనర్‌ అశ్విని తానాజీ వాకడే
- నయీంనగర్‌ బ్రిడ్జి పనుల పరిశీలన



నయీంనగర్‌ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌ అశ్విని

వరంగల్‌ కార్పొరేషన్‌, ఆగస్టు 8: నిర్దేశిత గడువులోగా నయీంనగర్‌ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని వరంగల్‌ బల్దియా కమిషనర్‌ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గురువారం నయీంనగర్‌లో జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ.. సెప్టెంబర్‌ 9న బ్రిడ్జి ప్రారంభం కానుందని, అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 20 వరకు అన్ని పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఇరిగేషన్‌ అధికారులు బ్రిడ్జి సైడ్‌ వాల్‌ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. అవుట్‌లైన్‌ పైపులు బ్రిడ్జి నిర్మాణం కింద అనుసంధానం చేయాలని సూచించారు. ఇంకా త్వరగా డివైడర్‌లను ఏర్పాటు చేసి సుందరీకరించాలన్నారు. నాలాకు చెందిన ఆక్రమణలను సిటీ ప్లానర్‌ శైలజను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఈఈ రాజయ్య, సిటీ ప్లానర్‌ శైలజ, ఎన్‌హెచ్‌ విభాగం ఈఈ మనోహర్‌, డీఈ శ్యాంమోహన్‌రెడ్డి, ఏఈలు హరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

న్యాయవాదులను కొట్టిన పోలీసులను శిక్షించాలి..

- విధులు బహిష్కరించి జిల్లా కోర్టు గేటు ఎదుట న్యాయవాదుల నిరసన

వరంగల్‌ లీగల్‌, ఆగస్టు 8: జనగామ జిల్లా కేంద్రంలోని పోలీసుస్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులపై దుర్భాషలాడి దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్‌ చేయాలని హనుమకొండ, వరంగల్‌ జిల్లాల న్యాయవాదులు డిమాండ్‌ చేశారు. గురువారం సంఘటనకు బాధ్యులైన సీఐ, ఎస్సైలతో పాటు ఇతర పోలీసు సిబ్బందిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని జిల్లా కోర్టు గేటు ఎదుట న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. వృద్ధ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయడం లేదని అడగడానికి పోలీసుస్టేషన్‌కు వెళ్లడంతో పోలీసులు అకారణంగా న్యాయవాద దంపతులపై దాడి చేయడం హేయమైన చర్య అని న్యాయవాదులు పేర్కొన్నారు. బాధ్యులైన పోలీసులను వెంటనే విధుల నుంచి తొలగించాలని, లేకుంటే నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని న్యాయవాదులు హెచ్చరించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై పోలీసులు అకారణంగా దాడులకు పాల్పడుతున్నారని, హైకోర్టు ఉత్తర్వులను సైతం ఖాతరు చేయడం లేదని వారు తెలిపారు. న్యాయవాదులకు రక్షణగా రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు.

అనంతరం కోర్టు నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి అమరవీరుల స్థూపం చేరుకొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్‌, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు టి.జీవన్‌గౌడ్‌, ఎం. రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులు ముదుసర్‌ అహ్మద్‌, ఇతర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సభ్యులు దుస్స జనార్దన్‌, సీనియర్‌, జూనియర్‌ న్యాయవాదులు ఆండాళ్‌, శ్రీలత, కవిత తదితర మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు గేటు ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

జనగామ సీఐ, ఎస్‌ఐపై బదిలీ వేటు

న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తించినందుకు చర్య

వరంగల్‌ క్రైం, ఆగస్టు 8: ఒక కేసు విషయంలో జనగామ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఇద్దరు న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తించిన సీఐ, ఎస్‌ఐలపై బదిలీ వేటు పడింది. రెండు రోజుల కిందట జరి గిన సంఘటనపై న్యాయవాదులు వెస్ట్‌జోన్‌ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల పాటు న్యాయవాదులు నిరసనకు పిలుపిచ్చారు. డీసీపీ ఆదేశాల మేరకు ఏసీపీ భీంశర్మ వి చారణ చేపట్టారు. ఆయన నివేదిక ఆధారంగా గురువారం వరంగ ల్‌ పోలీస్‌ కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ ఝా బదిలీ వేటు వేశారు. సీఐ ఎల్‌.రఘుపతిరెడ్డి, ఎస్‌ఐ పి.తిరుపతిలను పోలీస్‌ హెడ్‌ క్వార్ట ర్సకు, కానిస్టేబుల్‌ కరుణాకర్‌ను ఏఆర్‌కు అటాచ్‌ చేస్తూ సీపీ ఉత్త ర్వులు జారీ చేశారు. సీసీఎస్‌ సీఐ దామోదర్‌రెడ్డిని జనగామకు బదిలీ చేశారు.

నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జా

ముగ్గురిపై కేసు నమోదు, ఇద్దరి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్‌

వరంగల్‌ క్రైం, ఆగస్టు 8: నకిలీ పత్రాలు సృష్టించి భూకబ్జాకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసిన హసన్‌పర్తి పోలీసులు గురువారం ఇద్దరిని అరెస్టు చేశారు. సీఐ సురేష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలో నివాసం ఉంటున్న ఎర్రబోయిన లక్ష్మయ్య ఎల్లాపూర్‌ శివారులోని 4ఎకరాలు 27గుంటలు రెండేళ్ల కిందట కొనుగోలు చేశాడు. ఈ స్థలాన్ని హనుమకొండకు చెందిన మండల ఆదిరెడ్డి, కాసర్ల దేవేందర్‌రెడ్డి, చిలువేరు సురేందర్‌లు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారు. విషయమై లక్ష్మయ్య హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. గురువారం ఆదిరెడ్డి, దేవేందర్‌రెడ్డిలను అరెస్టు చేసినట్లు సీఐ సురేష్‌ తెలిపారు. సురేందర్‌ పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకుంటామని సీఐ పేర్కొన్నారు. భూ కబ్జాలకు పాల్పడిన ఎంతవారినైనా వదిలేది లేదని ఈ సందర్భంగా సీఐ సురేష్‌ హెచ్చరించారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్‌ వెంకట్‌ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ వెంకట్‌ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్‌, ఆగస్టు8: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా అధికారులతో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సాంస్కృతిక కార్యక్రమాల కోసం బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాల విషయంలో ఉత్తమ సేవలు, పారామీటర్స్‌లో సాధించిన ప్రగతిని ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. వివిధ శాఖలకు పథకాలకు సంబంధించి యూనిట్ల గ్రౌండింగ్‌ పెద్దఎత్తున చేసేలా కార్యాచరణ చేయాలని, జాబితా త్వరగా సమర్పించాలని అన్నారు. ప్రజాప్రతినిధులు, అతిథులకు ముందస్తుగా ఆహ్వానాలు అందాలని, ఆహ్వాన పత్రికను రూపొందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్‌ తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోటను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతా..

- దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ శైలజరామయ్య
- అధికారులతో కలిసి సందర్శన

ఖిలావరంగల్‌, ఆగస్టు 8: చారిత్రక, పర్యాటక ప్రాంతమైన ఖిలావరంగల్‌ కోటను ఆధ్యాత్మిక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరి శైలజరామయ్యంగార్‌ అన్నారు. గురువారం ఖిలావరంగల్‌ మధ్యకోటలోని శిల్పాల ఆవరణ, రాతికోట, మట్టికోట, ఏకశిలగుట్ట తదితర పరిసరాలలో ఉన్న దేవాలయాలను కేంద్ర, రాష్ట్రశాఖాధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. నాలుగు రోజుల కిందట మంత్రి కొండా సురేఖ ఖిలావరంగల్‌లో పర్యటించారు. మంత్రి ఆదేశాల మేరకు కోటను సందర్శించి మాట్లాడుతూ.. ఖిలావరంగల్‌ మట్టికోట, రాత్రికోట సమీపంలో సుమారు 20 దేవాలయాలున్నాయన్నారు. వాటిలో సంబంధిత దేవతావిగ్రహాలను ఏర్పాటు చేసి పర్యాటకులకు ప్రశాంతత, ఆహ్లాద వాతారణం కల్పించాలన్నారు. దేశవిదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు ఆధ్యాత్మికతను తెలియజేసేలా ఆయా విగ్రహాలను రూపొందిస్తామన్నారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర పురావస్తు, దేవాదాయశాఖాధికారులతో చర్చిస్తానన్నారు. అనంతరం మధ్యకోటలోని శ్రీ స్వయంభూశంభులింగేశ్వర స్వామి దేవాలయంలో ఆమె పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌ సత్యశారద, అదనపు కలెక్టర్‌ సంధ్యారాణి, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మడిపెల్లి మల్లేశం, రాష్ట్ర దేవాదాయశాఖ అధికారి మల్లూనాయక్‌, కుడా పీవో అజిత్‌రెడ్డి, డీఈ భీంరావు, వరంగల్‌, ఖిలావరంగల్‌ తహసీల్దార్‌లు ఇక్బాల్‌, బండి నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్లు సువర్ణసురేష్‌, బైరబోయిన ఉమా దామోదర్‌ యాదవ్‌, గౌడ్‌ రవియాదవ్‌, కాంగ్రెస్‌ నాయకులు, వివిధ ప్రభుత్వ సంస్థ అధికారులు పాల్గొన్నారు.



మధ్యకోటలోని దేవాలయాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్‌ సెక్రెటరీ శైలజరామయ్య

భద్రకాళి సన్నిధిలో...

వరంగల్‌ కల్చరల్‌: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరి శైలజ రామయ్యార్‌, దేవాదాయ కమిషనర్‌ ఎం.హన్మంతరావు, కలెక్టర్‌ సత్యశారదా దేవిలు భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి చేరుకున్న అధికారులకు ఈవో శేషు భారతి, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు పూర్ణకుంభం స్వాగతం పలికారు. గోశాలలో గోవులకు గ్రాసాన్ని అందించారు. వనమహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. తదుపరి మాఢ వీధుల నిర్మాణపు పనులను త్వరగా చేపట్టాలని, పనులు ఆగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మహదాశీర్వచనం, శేషవస్త్రాలను అందించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ స్థపతి వల్లీనాయగం, డీఎఫ్‌వో కిషన్‌ జాదవ్‌, అడిషనల్‌ కలెక్టర్‌ సంధ్యారాణి, ఎండోమెంట్‌ ఈఈ దుర్గాప్రసాద్‌, ఉప కమిషనర్‌ శ్రీకాంతారావు, డీఈఈ రమేష్‌, సహాయ కమిషనర్‌ రాయల సునిత, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, ఇంటాక్ట్‌ కన్వీనర్‌ పాండురంగారావు, గౌరీశంకర్‌, విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

రిటైర్డ్‌ అర్చక ఉద్యోగులకు పీఆర్‌సీ పింఛన్‌ వర్తింపజేయాలి

హనుమకొండ కల్చరల్‌: దేవాదాయశాఖలో పని చేస్తున్న అర్చక ఉద్యోగులకు రిటైర్‌మెంట్‌ అనంతరం పీఆర్‌సీ ప్రకారం పింఛన్‌ సౌకర్యం కల్పించాలని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మతో పాటు ఇతర నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం వరంగల్‌ నగర పర్యటనకు విచ్చేసిన దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ శైలజా రామన్‌, దేవాదాయ కమి షనర్‌ హన్మంతరావులను సమాఖ్య నేతలు హరిత హోటల్‌లో కలిసి దుశ్శాలువాతో అభినందించి వినతి పత్రం కూడా సమర్పించారు. అర్చక ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం గ్రాట్యుటీ రూ.10లక్షల వరకు అందజేయాలని అర్చక వెల్ఫేర్‌ బోర్డులో రూ. 200 కోట్ల మిగులు బడ్జెట్‌గా ఉన్నాయని, దానిని అర్చక సంక్షేమం కోసం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులను కలిసిన వారిలో జిల్లా దేవాదాయశాఖ ఏసీ రామల సునీత, మేడారం ఈవో రాజేందర్‌, అర్చక సమాఖ్య కార్యదర్శి తనుగుల రత్నాకర్‌ తదిరతులు ఉన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖలో అయోమయం

● ఏ జిల్లాకు ఎవరు డీఎంహెచ్‌వోనో తెలియని వైనం

● వరంగల్ జిల్లాలో ఒకే పోస్టులో ఇద్దరు ఉద్యోగులు

వరంగల్ మెడికల్, జూలై 8: ఉమ్మడి వరంగల్ వైద్య, ఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన బదిలీలు గందరగోళానికి దారితీస్తున్నాయి. వైద్యాధికారులు బదిలీ అయిన స్థానాలకు వెళ్లకుండా పాత స్థానంలోనే ఉండడం విస్మయానికి గురిచేస్తోంది. రాష్ట్ర వైద్య సంచాలకుల కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన బదిలీలు, పోస్టింగులపై పలువురు వైద్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బదిలీలపై నిషేధం విధించినప్పటికీ పాత తేదీలపై ఉత్తర్వులు వెలువడుతూనే ఉన్నాయి.

డీఎంహెచ్‌వో ఎవరు?

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు జిల్లాల్లో అసలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఎవరనేది అయోమయంగా ఉంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా పని చేసిన డాక్టర్ బి.సాంబశివరావు వరంగల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇంతవరకు మూమెంట్ ఆర్డర్ రాకపోవడంతో ఆయన హనుమకొండలోనే పనిచేస్తున్నారు. ఇక హనుమకొండకు రావాల్సిన ములుగు డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య మూమెంట్ ఆర్డర్ రావడం లేదని ఇంకా ములుగులోనే కొనసాగుతున్నారు. ఇక కరీంనగర్‌కు వెళ్లాల్సి ఉన్న డాక్టర్ వెంకటరమణ ఇదే సాకుతో వరంగల్‌లోనే కొనసాగుతున్నారు.

ఒకే పోస్టులో ఇద్దరు

గత నెల 27న సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సదానందంను బదిలీ చేసి ఆయనస్థానంలో హనుమకొండ జిల్లాకు చెందిన ఎం.హనుమానాయక్‌కు పోస్టింగ్ ఇచ్చారు. బదిలీ చేశారు. ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు విడుదల చేశారు. ఈ మేరకు హనుమనాయక్‌ను సంగెం పీహెచ్‌సీ వైద్యాధికారి విధుల్లో చేర్చుకున్నారు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ.. ఈ నెల 8న మరో లేఖ విడుదలైంది. బదిలీ అయిన సదానందంను మళ్లీ అదేస్థానానికి పోస్టింగ్ ఇస్తూ గత నెల 31వ తేదీన ఉత్తర్వులు విడుదల చేసినట్లు అందులో ఉంది. కాగా, ఇంత హైటెక్ సమాజంలో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు లేఖ వచ్చేందుకు 8 రోజులు పడుతుందా..? అని ఉద్యోగులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒకే పోస్టులో ఇద్దరు ఉద్యోగులను నియమించడం వైద్య, ఆరోగ్యశాఖకే చెల్లుతుందని విమర్శిస్తున్నారు. కాగా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం అధికారుల తీరు వల్లనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖలో జరిగిన బదిలీలపై జ్యుడీషియల్ విచారణ కొనసాగిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని ఉద్యోగులు అంటున్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న లయన్ క్లబ్ ప్రతినిధులు

వ్యక్తిత్వ నిర్మాణానికి 'లయన్ క్వెస్ట్' దోహదం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 8: విద్యార్థుల్లో వ్యక్తిత్వ నిర్మాణానికి లయన్‌క్వెస్ట్ శిక్షణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్మన్ లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి అన్నారు. గురువారం ఉర్సుగుట్ట వద్ద ఉన్న ఎంజేపీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ సారథ్యంలో ఉపాధ్యాయులకు లయన్ క్వెస్ట్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సక్రమ మార్గంలో నడిచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనేక జనాభా ఉన్న మన దేశంలో లయన్స్ క్వెస్ట్ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. గౌరవ అతిథి, క్వెస్ట్ ప్రోగ్రామ్ ప్రాజెక్టు మేనేజర్ లయన్ శివప్రసాద్ మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎంజేపీ ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్న ప్రతీ విషయాన్ని విద్యార్థుల్లో మానవతా విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడేలా వారికి నేర్పించాలన్నారు. ఎంజేపీ ఆర్‌సీవో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుతున్న ఈపాఠశాలల్లో వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఇలాంటి క్వెస్ట్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం గత ఏడాది ఎంజేపీ కళాశాలల్లో ర్యాంకులు సాధించిన 14 మంది విద్యార్థులను అతిథుల చేతుల మీదుగా సన్మానం చేశారు. శిక్షణ కార్యక్రమానికి శిక్షకురాలుగా కొండపల్లి రేణుక వ్యవహరించగా కార్యక్రమంలో జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ కందుకూరు వెంకట్‌రెడ్డి, ఫస్ట్ డిప్యూటీ గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, ప్రోగ్రాం అసిస్టెంట్ కోఆర్డినేటర్ లయన్ పరికిపండ్ల వేణు, లయన్ డాక్టర్ రాజలక్ష్మి, లయన్ మార్గం ప్రభాకర్, లయన్ రవీందర్‌రెడ్డితో పాటు 37 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిస్టరీలో వసంతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ విశ్వవిద్యాలయం హిస్టరీ విభాగం పరిశోధకురాలు ఇటికాల వసంత డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి వసంతకు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'తెలుగు ప్రాంతంలో మాతంగి సంస్కృతి- ఒక పరిశీలన' అనే అంశంపై కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ పర్యవేక్షణలో వసంత పరిశోధ న పూర్తి చేశారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామానికి చెందిన వసంత అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన వసంతను పలువురు అభినందించారు.







అడవిబిడ్డల అరిగోస

● అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసీ గ్రామాలు ● నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 8: అడవులే ఆదెరువుగా.. పాశ్చాత్య సంస్కృతి, జీవన విధానానికి దాసోహం కాని కట్టుబాట్లతో.. ప్రకృతినే దేవతలుగా కొలుస్తూ.. శ్రమైక జీవనమే తమ తరగని సౌందర్యమని నిరూపిస్తూ.. ఆత్మగౌరవమే తరగని ఆస్తిగా జీవిస్తున్నారు అడవిబిడ్డలు. ప్రపంచ పోకడల్లో ఎన్ని పెనుమార్పులు వచ్చినా తమ సంస్కృతీ, సంప్రదాయాలు చెక్కు చెదరవని, వనదేవతలు సమ్మక్క-సారలమ్మ పోరాట స్ఫూర్తి, యోధుడు కొమురంభీం తెగువను చాటుతూ తమ అస్తిత్వాన్ని, మనుగడను చెక్కు చెదరనివ్వడం లేదు ఆదివాసీలు. రాజ్యాంగం కల్పించిన ప్రత్యేకమైన చట్టాలు, హక్కుల సాధనకు ప్రభుత్వాలు, పాలకులతో అలుపెరగని పోరును నేటికీ కొనసాగిస్తూనే.. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్నా.. తమ తలరాతలు మారడం లేదంటూ జల్.. జంగల్.. జమీన్ నినాదాన్ని ముందుకు తీసుకుపోతూ న్యాయమైన డిమాండ్ల సాధనకు నడుం బిగిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమకు అందకపోతుండటంతో వారు నేటికీ అభివృద్ధిలో వెనుకబడే ఉన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీల బతుకుచిత్రంపై ప్రత్యేక కథనం.

హక్కులు, చట్టాల అమలుకు నిరంతరం పోరాటమే..

మన రాజ్యాంగం ఆదివాసులకు ప్రత్యేకమైన, పటిష్టమైన హక్కులు, చట్టాలను కల్పించినా అవి సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు 1/70 చట్టం రక్షణ కవచమే అయినా ఆ చట్టం అమలు ఆశాజనంగా లేదంటూ ఆదివాసులు ఆవేదన చెందుతున్నారు. 1959లో భారత ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజనుల భూములు, ఆస్తులను గిరిజనేతరులు కొనకూడదని చట్టాన్ని తీసుకువచ్చి దీన్ని 1963నుంచి అమలు చేసింది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల భూములను గిరిజనేతరులు కొనడానికి, అమ్మడానికి వీలు లేదని స్పష్టం చేసింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పెసా చట్టానికి పూర్తి అధికారులున్నాయి. 5, 6వ షెడ్యూల్‌లో పెసా గ్రామ సభ ద్వారానే ప్రభుత్వ పథకాల అమలు జరగాలి. గ్రామసభ తీర్మానం లేనిదే ఎలాంటి పనులు చేయడానికి వీలు లేదు. కానీ ఆ పెసా చట్టానికి తూట్లు పొడుస్తున్నాయని, పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆదివాసీ సంఘాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ చట్టం సరిగా అమలు జరిగితే ఆదివాసీగూడేలు అభివృద్ధిపథంలోకి వెళ్లడమే కాకుండా ఆదివాసీ సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఆదివాసీ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. 5వ, 6వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు భారత రాజ్యాంగం స్వేచ్ఛగా జీవించే అధికారాలు ఇచ్చినా ఆ పరిస్థితులు ఏజెన్సీలో లేకుండా పోయాయి.

గిరిపల్లెలకు ఐటీడీఏ అండ.. సత్ఫలితాలిస్తోందా?

ఆదివాసీ పల్లెలకు ఐటీడీఏ అండగా నిలుస్తోంది. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏల ఏర్పాటుతో ఆదివాసీల పల్లెలకు జీవం పోసినట్లయింది. కానీ అనుకున్నంతా లక్ష్యాలకు ఆమడదూరంలోనే ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐటీడీఏ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్న అనుకున్నంతా లక్ష్యాలను చేరుకోవడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 5.30లక్షల మంది ఆదివాసీలు ఉన్నారు. 1986లో ఏటూరునాగారంలో ఐటీడీఏను నెలకొల్పారు. ఐటీడీఏ పరిధిలో మొత్తం 13ఏజెన్సీ మండలాలకు విస్తరించి ఉంది. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు ఐటీడీఏ పెద్ద దిక్కుగా ఉంటుంది. కానీ ఐటీడీఏ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా అనుకున్న లక్ష్యాలను మాత్రం చేరువకాలేదు. గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సంక్షేమం తదితర శాఖలు మెరుగైన ఫలితాలు సాధించలేకపోతున్నాయి. గిరిజనులకు ఇప్పటికీ రోడ్ల సౌకర్యం లేని గ్రామాల్లో ఎన్నో ఉన్నాయి.

జీవన విధానం, పండుగలు అంతా వైవిధ్యమే

ఆదివాసీల జీవనవిధానం, పండుగలు వైవిధ్యంగా ఉంటాయి. రాష్ట్రంలో మొత్తం తొమ్మిది ఆదివాసీ తెగలున్నాయి. అంధ్, భిల్, చెంచుతో చెంచువారు, గోండ్ (నాయక్‌పోడ్, రాజ్ గొండ్, కొండరెడ్లు, కొలామ్ (మన్నెవార్లు), కోయ (బినే కోయ, రాజ్ కోయ, పర్ధాన్, తోటి వంటి తెగలు కలవు. గొండ్ ఆదివాసీ తెగ నాగోబా జాతర, జంగుబాయి పండుగను ప్రధానంగా జరుపుకుంటారు. అంధ్ తెగ వారు పూలాజీ బాబా జయంతి, సిరాల్ పండుగను జరుపు కుంటారు. కొలామ్ తెగ వారు భీమా నాయక్ జాతర, నాయక్‌పోడ్ గాంధారి మైసమ్మ జాతర, లక్ష్మీ దేవర పండుగను జరుపుకొంటారు. చెంచులు భౌరాపూర్ జాతర, సలేశ్వరం జాతర, లొద్ది జాతర, కోయలు సమ్మక్క-సారలమ్మ జాతరలను జరుపుకొంటారు. దీంతో పాటు ఆదివాసీలు పెద్దల పండుగ, భూమి పండుగ, ఇప్పపూల పండుగ, చిక్కుడు కాయ, గోంగూర, మొక్కజొన్న పండుగలే కాక కోయ తెగలలో ఇంటి పేరుతో గల ఇలవేల్పుల పండుగలు జరుపుకుంటారు.

ఆదివాసీ దినోత్సవ నేపథ్యం

ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు రక్షణకు ప్రపంచ దేశాలు నడుం కట్టి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1982 ఆగస్టు 9వ తేదీన 26మందితో స్వతంత్ర మానవ హక్కుల నిపుణులతో వర్కింగ్ గ్రూప్ సమావేశం జరిగింది. తదనంతరం 1994లో యూఎన్‌వో జనరల్ అసెంబ్లీ కమిటీ సమావేశమైన రోజునే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జరపాలని తీర్మానించింది. అప్పటి నుంచి ప్రతీ యేటా ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతోంది.

ఐటీడీఏలను బలోపేతం చేయాలి



కబ్బాక శ్రావణ్‌కుమార్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీడీఏలను ప్రభుత్వం బలోపేతం చేయాలి. గిరిజన గ్రామాలు నేటికీ నిరాదరణకు గురవుతున్నాయి. గిరిజన అభివృద్ధికి బడ్జెట్‌లో లెక్కలు చూపుతున్నా అవి కాగితాలకే పరిమితమవతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీల బతుకులు మారడం లేదు. ఐటీడీఏలను ప్రభుత్వాలు గాలికొదిశాయి. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు పటిష్ఠంగా అమలు చేయాలి.

నేడు కేయూలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో ఆగస్టు 9న శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబురాలు నిర్వహిస్తామని ఆదివాసీ విద్యార్థి సంఘం కేయూ నేతలు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కేయూ మొదటి గేటు నుంచి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు ఆదివాసీ కల్చరల్ ర్యాలీ, పతాకావిష్కరణ, జ్యోతి ప్రజ్వలన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, విశిష్ట అతి థులుగా ములుగు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.భిక్షపతిరావు, వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు, హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అప్పయ్య, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, రిటైర్డు అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సారయ్య దొరలు పాల్గొని మా ట్లాడుతారని వెల్లడించారు.

హైకోర్టు ఏజీపీగా రూహీ నబీల నియామకం



వరంగల్ లీగల్, ఆగస్టు 8: రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా (ఏజీపీ)న్యాయవాది రూహీ నబీలను నియవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురు వారం ప్రకటన వెలువరిం చింది. హనుమకొండ అడ్వకేట్స్‌కాలనీ ప్రాంతానికి చెందిన రూహీ నబీల 2016లో న్యాయవాదిగా నమో దు చేసుకొని కొంతకాలం వరంగల్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం హైకోర్టులో తన ప్రాక్టీస్ ప్రారంభించారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చే శారు. తన తండ్రి సీనియర్ న్యాయవాది మహ్మద్ మైమూద్ వద్ద న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. చిన్న వయసులోనే ఏజీపీగా నియామకం కావడం పట్ల హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.జీవన్‌గౌడ్, న్యాయవాదులు ఆనంద్‌మోహన్, జంగా స్వప్న, రమాదేవి, నరేందర్, రహెమాన్, అండాళ్ తదితరులు అభి నందనలు తెలిపారు.

మహిళా పాలిటెక్నిక్‌లో 12న స్పాట్ అడ్మిషన్లు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 8: వరంగల్ నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ కమర్షియల్ ప్రాక్టీస్ (సీసీపీ) మూడు సంవత్సరాల కోర్సులో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.రామప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 12వ తేదీన స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

కేయూ పాలక మండలి కీలక నిర్ణయం ● వీసీ సర్చ్ కమిటీ మెంబర్‌కు ఈసీ సిఫార్సు



హైదరాబాద్ సచివాలయంలో సమావేశమైన కేయూ పాలక మండలి సభ్యులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు కొత్తగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించేందుకు కేయూ అత్యున్నత పాలక మండలి పచ్చజెండా ఊపి అమోదముద్ర వేసింది. వర్సిటీ పీహెచ్‌డీ బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని నిర్ణయించారు. దీంతో వర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థులకు న్యాయం జరగనుంది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌లో కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ నేతృత్వంలో కేయూ కొత్త పాలకమండలి తొలి సమావేశం జరిగింది. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ నవీన్, సామాజిక వేత్త పుల్లూరి సుధాకర్, డాక్టర్ చిర్ర రాజు, ఏఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకుమారి, సామాజిక వేత్త చౌహన్, వర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్యలు పాల్గొన్నారు.

తొలి పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు క్యాంపస్‌లోని వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంపై దాడి చేయడం, తదనంతరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు విద్యార్థులను కొట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా కేయూ పీహెచ్‌డీల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో వర్సిటీలోని అన్ని విభాగాల్లో నూతనంగా విద్యార్థులకు యూజీసీ నిబంధనలు, విద్యార్థుల మెరిట్ మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే వర్సిటీ అధికారులతో అంతర్గతంగా పీహెచ్‌డీ అడ్మిషన్లపై సమగ్రంగా చర్చించి విధి విధానాలు రూపొందించి విద్యార్థులకు కొత్తగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే విద్యార్థులు నష్టపోయారని, తొందరగా ఒకటి, రెండు రోజుల్లోనే పీహెచ్‌డీ అడ్మిషన్లపై తుది నిర్ణయం తీసుకుని అడ్మిషన్లు చేపట్టాలని పాలక మండలి సభ్యులు నిర్ణయించారు. వర్సిటీలో వివిధ విభాగాల డీన్లు, హెచ్‌వోడీలపై పీహెచ్‌డీ అడ్మిషన్ల ఖాళీలపై తప్పుడు సమాచారం ఇచ్చారని ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ మండిపడినట్లు తెలిసింది. వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల ఖాళీలపై తప్పుడు సమాచారం ఇచ్చిన డీన్లు, హెచ్‌ఓడీలపై ఎందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయకూడదని కరుణ అన్నట్లు సమాచారం. అలాగే వర్సిటీ క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం పాలక మండలి సభ్యులు తీవ్రంగా చర్చించారు. ప్రహరీ నిర్మాణంలో క్షేత్రస్థాయిలో ఏర్పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. వర్సిటీ భూమి ఇంచు కూడా కబ్జాకు గురికాకుండా సర్వే ప్రకారం 100శాతం రక్షించాలని నిర్ణయించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు గురి కాకుండా చిత్తశుద్ధితో భూములను రక్షించాలని సమావేశంలో నిర్ణయించారు.

కాగా, వర్సిటీ క్యాంపస్ మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బ్లాక్ ఆఫ్ లేని సీసీ కెమెరాలను ఆధునీకరించాలని, డేటా బ్యాకప్ ఎక్కువగా ఉండేలా చూడాలని నిర్ణయించారు. అలాగే నూతనంగా వర్సిటీలో మూడు హాస్టళ్లలో డైనింగ్ హాళ్లు నిర్మించాలని, హాస్టళ్లకు అవసరమైన ఫర్నిచర్ కొనుగోలుకు అనుమతి ఇచ్చారు. అలాగే పార్టుటైమ్, అకడమిక్ కన్సల్టెన్స్‌గా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు పాలక మండలి సమావేశం తీపి కబురును నింపింది. వర్సిటీలో మొత్తంగా పార్టుటైమ్, కన్సల్టెన్స్ అధ్యాపకుల్లో వర్సిటీ శాంక్షన్ పోస్టుల్లో పనిచేస్తున్న అధ్యాపకులను అప్‌గ్రేడ్ చేసి కాంట్రాక్టు అధ్యాపకులుగా నియమించాలని నిర్ణయించారు. అయితే శాంక్షన్ బడ్జెట్ పోస్టులు, ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఎంత మేర బడ్జెట్ అవసరమవుతుందో చూడాలని, వారి వివరాలను తీసుకుని దాదాపుగా 40 మందిని కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి పాలక మండలి సిఫార్సు చేసింది. కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ అయితే నెల నెలా జీతం వచ్చి అధ్యాపకుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటారని పాలకమండలి సభ్యులు సిఫార్సు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తుది నిర్ణయం వెలువరించనుంది. నాన్ బడ్జెట్ పోస్టులు, ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో పూర్తి వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకుల విషయంలో తుది నిర్ణయం తీసుకోలేదు.

వీసీ కోసం..

రాష్ట్రప్రభుత్వం అన్ని వర్సిటీలకు కొత్త వైస్‌చాన్స్‌లర్లను నియమించనున్న నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీకి ఈసీ నామినీగా ఒక్కరిని ఎంపిక చేయాల్సి ఉంది. దీని కోసం ముగ్గురు అనుభవజ్ఞులైన మాజీ వైస్ చాన్స్‌లర్లను పేర్లను ఈసీ సిఫార్సు చేయాల్సి ఉంది. దీనిలో భాగంగా గురువారం పాలక మండలి ముగ్గురిని ఎంపిక చేశారు. అయితే వీరిలో ఒక్కరిని ఖరారు చేయాల్సి ఉంది. సోమవారం మరోదఫా పాలక మండలి సభ్యులు వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో సమావేశమై ఈసీ నామినీగా ముగ్గురిలో ఒక్కరిని సిఫార్సు చేయనున్నారు.

రిజిస్ట్రేషన్లపై కొత్త అధికారుల కొర్రీలు

● నిబంధనల పేరిట ఇబ్బందులు ● 2,500కు పైగా పెండింగ్‌లో మ్యుటేషన్ సర్టిఫికెట్లు

రాంనగర్, ఆగస్టు 8: నూతన సబ్ రిజిస్ట్రార్లు ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్లు చేసిన ఆస్తుల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన మ్యుటేషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని సమాచారం. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 కార్యాలయాల్లోని అటెండర్ నుంచి జిల్లా రిజిస్ట్రార్ వరకు బదిలీ అయిన విషయం తెలిసిందే. వీరి స్థానంలో నూతన సిబ్బంది బాధ్యతలు చేపట్టారు.



హనుమకొండలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

మ్యుటేషన్ సర్టిఫికెట్లలో..

రిజిస్ట్రేషన్ జరిగాక డాక్యుమెంట్ స్కాన్ చేశాక మ్యుటేషన్ సర్టిఫికెట్ సబ్ రిజిస్ట్రార్ సంతకంతో జారీ చేస్తారు. దీనికి రెండు రోజులు సమయం తీసుకుంటారు. కాగా, బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్లు రిలీవ్ అయ్యే రోజు వరకు రిజిస్ట్రేషన్‌లు చేశారు. దీంతో జారీకాని మ్యుటేషన్ సర్టిఫికెట్స్ 2500కు పైగానే పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. బదిలీ అయిన వారు చేసిన రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన మ్యుటేషన్ సర్టిఫికెట్స్‌పై తాము సంతకాలు పెట్టమని నూతన సబ్ రిజిస్ట్రార్లు మొండికేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఇక తల్లిదండ్రులు, వారి ఆస్తులను పిల్లలకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసే విషయంలో కొర్రీలు పెట్టి చేయడం లేదని సమాచారం. ఇళ్ల రిజిస్ట్రేషన్ విషయంలో లేనిపోని నిబంధనల పేరిట చేయడం లేదని తెలిసింది.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

నూతన సబ్ రిజిస్ట్రార్ల వైఖరితో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు తగ్గినట్లు సమాచారం. హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రతీ రోజు 100కు పైగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు జరుగుతుండేవి. మూడు రోజులుగా 50లోపే జరుగుతున్నట్లు అధికారికంగా తెలిసింది. నూతన సబ్ రిజిస్ట్రార్ల వైఖరితో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు చేసుకునే వారు సైతం ముందుకు రావడంలేదని సమాచారం. ప్రస్తుతం నెలకొన్న గందరగోళ వైఖరిపై ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సుభాషిణి సబ్ రిజిస్ట్రార్లతో భేటీ అయ్యి ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో స్పష్టత ఇవ్వకుంటే వరంగల్‌లో రియల్ దందా కుంటుపడే అవకాశాలున్నాయి. శాఖకు ఆదాయం తగ్గే అవకాశం ఉంది.

భార్యకు గుడికట్టి, విగ్రహం పెట్టిన భర్త



కొత్తగూడ, ఆగస్టు 8 : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామంలో భార్యకు భర్త గుడికట్టి విగ్రహం పెట్టిన సంఘటన చోటు చేసుకుంది. కొత్తగూడ మండలంలోని ఓటాయికు చెందిన కుడికాల రమేష్ భార్య సరస్వతి సంవత్సరం క్రితం మృతి చెందింది. ఆమె జ్ఞాపకార్థం భర్త రమేష్ తన భార్య పోలికలతో విగ్రహం చేయించాడు. తన కుమారులు ప్రశాంత్, రోహిత్‌తో కలిసి రమేష్ తన భార్యకు కట్టిన గుడిని, విగ్రహన్ని గురువారం ఆవిష్కరించారు.

గుండెపోటుతో వృద్ధురాలి మృతి

ఆర్టీసీ బస్సులో వస్తుండగా ఘటన ● మృతురాలు వరంగల్ జిల్లా వాసి

తొర్రూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 8 : గుండెపోటుతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికేడు గ్రామానికి చెందిన మామిండ్ల గౌరమ్మ (70) అనే వృద్ధురాలు తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఉదయం తొర్రూరు ఆస్పత్రికి చికిత్స కోసం కూతురు కొమురమ్మతో కలిసి రాయపర్తి వరకు ఆటోలో వచ్చింది. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో తొర్రూరుకు వస్తుండగా మార్గమధ్యలో ఛాతివద్ద నొప్పి రావడంతో ప్రయాణికులు కొం దరు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో బస్సు తొర్రూరు బస్టాండుకు చేరుకోగానే అంబులెన్స్‌లో గౌరమ్మను తొర్రూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించారు. కాగా, మృతురాలి భర్త గతంలో మరణించగా, ఆమె ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. తన చేతులమీదే తల్లి మృతి చెందడంతో కుమార్తె విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.



మామిండ్ల గౌరమ్మ





బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్‌ను కలిసి మొక్క అందిస్తున్న రాజేందర్‌రెడ్డి

ఏసీగా బాధ్యతలు చేపట్టిన రాజేందర్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 8: బల్దియాకు అదనపు కమిషనర్‌గా పోస్టింగ్‌పై వచ్చిన చింతకుంట్ల రాజేందర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి పూల మొక్కను అందించారు. కాగా, ప్రస్తుతం బల్దియా అదనపు కమిషనర్‌గా కాశిబుగ్గ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. కాగా, రాజేందర్ రెడ్డి హైదరాబాద్ నుంచి వరంగల్‌కు బదిలీపై వచ్చారు. అలాగే బల్దియా డిప్యూటీ సిటీ ప్లానర్‌గా రవీంద్ర రాడేకర్ సాయంత్రం బాధ్యతలు చేపట్టారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టీఎస్ఐసీ ప్రతినిధులు

'వాక్ ఫర్ ఇన్నోవేషన్' ర్యాలీ

సుబేదారి, ఆగస్టు 8: తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్‌సెల్ (టీఎస్ఐసీ)ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ అదాలత్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ఇంటింటా ఇన్నో వేటర్‌లో భాగంగా వాక్ ఫర్ ఇన్నోవేషన్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని హనుమకొండ ఏసీపీ నవీన్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎస్ఐసీ ప్రతినిధులు సింగారపు కిరణ్, బి. నవీన్‌కుమార్, డీఎస్‌వో శ్రీనివాస స్వామితోపాటు విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల్లోని సవరణలను సూచించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 8: మూడు, ఎనిమిది తరగతుల తెలుగు భాష పుస్తకాల్లో ప్రింటింగ్‌లో వచ్చిన దోషాల సవరణకు సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు సూచనలు చేయాలని డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై గురువారం ఒక ప్రకటనలో కోరారు. పుస్తకాల్లోని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి సవరణలను సూచించాలని కోరారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



గ్రామదేవత బొడ్రాయి శిలకు జలాధివాసం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

మడికొండ, ఆగస్టు 8: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లో గ్రామదేవత బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్ఠాపనోత్సవాలను స్థానిక ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. అందులో భాగంగా స్థానిక ప్రజలు, బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో గురువారం బొడ్రాయి, భూలక్ష్మి, శ్రీలక్ష్మి శిలలకు జలాధివాసం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు జాగర్లపూడి వెంకటరమణశాస్త్రి వేదమంత్రాల సాక్షిగా దేశ గురువులు సర్వేపల్లి విజయభాస్కర్‌రెడ్డి, దాసరి ధనుంజయరెడ్డి పర్యవేక్షణలో గ్రామంలోని ప్రజలంతా తమ ఇళ్ళనుంచి నీటిని తీసుకువచ్చి బొడ్రాయి, శ్రీలక్ష్మి, భూలక్ష్మి శిలలకు జలాధివాసం నిర్వహించారు. కార్యక్రమంలో బొడ్రాయి కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆకాశవాణి కేంద్రంలో వనమహోత్సవం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 8: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం హనుమకొండలోని ఆకాశవాణి రేడియో కేంద్రంలో పూలు, పండ్ల మొక్కలు నాటారు, ఆకాశవాణి సిబ్బందితో పాటు అధికారులు మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు ఒక మొక్కలను వారి వారి పేర్ల మీద నాటుకుని కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమానికి ఆకాశవాణి ప్రోగ్రామ్ హెడ్ రవికుమార్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సిబ్బంది శివశంకర్, నరేష్‌కుమార్, అనీల్‌ప్రసాద్, శ్రీనివాస రాజు, రామ్మూర్తి, విజయలక్ష్మి, చందు, రామ్మోహన్, స్వప్న, సుధాకర్, ఏలాషాతో పాటు వాఖ్యాతలు సదానందం, ఎల్లయ్య, మాలతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మడికొండ, ఆగస్టు 8: మడికొండలోని లోటర్‌వేవ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, హెక్సాడి సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పని చేస్తున్న యువతతో గురువారం స్థానిక ఇన్‌స్పెక్టర్ డి. ప్రతాప్ సమావేశమయ్యారు. మత్తుపదార్థాల వల్ల జరిగే అనార్థాలు, సైబర్ నేరాలు, 100 డయల్ ప్రాముఖ్యత, మహిళా ఉద్యోగులు తమ ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, పోలీస్ సిబ్బంది, బోగి దయాకర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, ఆగస్టు 8: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాప్ర భుత్వమని ప్రజల అభీష్టం మేరకే అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. వ్యవసాయం దండుగ కాదు. పండుగ అని ప్రభుత్వం నిరూపిస్తోందన్నారు. రైతును రాజును చేయడం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాపాలన కొనసాగుతోందని ఆయన కొనియాడారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఏక్కడా లేని విధంగా రైతులకు రెండు లక్షల రూణమాఫీ జరుగబోతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రూ.31వేల కోట్ల రైతు రుణ మాఫీ చేసి దేశ చరిత్రలోనే రికార్డును సృష్టించిందన్నారు.

వచ్చే నెలలో ఎకరానికి రూ.7,500 రైతు భరోసాను రైతులకు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం ధర్మసాగర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కడియం శ్రీహరి

107 మంది లబ్ధిదారులకు ముఖ్య మంత్రిసహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కడియం పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ కుమారస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాద్, మాజీ ఎంపీటీసీ రాజు, మాజీ సర్పంచ్ శరత్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లష్కర్ బజార్‌లోని యూఆర్‌ఎస్‌ను తనిఖీ చేస్తున్న అబ్దుల్ హై

యూఆర్‌ఎస్‌ను తనిఖీ చేసిన డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 8: హనుమకొండ లష్కర్ బజార్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూఆర్‌ఎస్)ను డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై తనిఖీ చేశారు. గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈవో అబ్దుల్‌హై హాస్టల్ నిర్వహణ తీరును, వంటగదిని, పరిశీలించారు. అలాగే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ డీడీ శ్రీనివాస్‌కుమార్, లేబర్ ఆఫీసర్ చాణక్య, ఎస్‌వోలు రాధ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



పట్టుబడిన మొరం టిప్పర్

ఐనవోలు, ఆగస్టు 8: అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వర్ధన్నపేట ఎస్సారెస్పీ కెనాల్ గట్టు నుంచి వరంగల్‌కు మొరం తరలింపునకు మొరం వ్యాపారులు మైనింగ్ శాఖ నుంచి అనుమతి పొందారు. గురువారం పున్నేలు క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాలకు తనిఖీ చేశారు. మొరంతో వెళ్తున్న రెండు టిప్పర్లను తనిఖీ చేయగా అందులో ఒక టిప్పర్‌కే అనుమతి ఉంది మరో దానికి లేదు. అనుమతి లేని టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. నాలుగు టిప్పర్ల అనుమతి ఉండగా ఏడు టిప్పర్ల ద్వారా మొరంను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

వాధ్యులపై అవగాహన కలిగి ఉండాలి

కలెక్టర్ ప్రావీణ్య

ధర్మసాగర్, ఆగస్టు 8: వర్షాకాలంలో సీజనల్ వాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వాటిపై ప్రతీ పౌరుడు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గురువారం ధర్మసాగర్ మండలం కరుణాపురం, పెద్దపెండ్యాలలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అధికారి హరితతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటికీ ఫివర్ సర్వే నిర్వహిస్తున్నామని, ఆశ, అంగన్‌వాడీ ఏఎన్ఎంలు ఫివర్ సర్వేలో ఉంటారన్నారు. వారు ఇంటికి వచ్చినప్పుడు మీకున్న లక్షణాలను తెలపాలని, వెంటనే ర్యాపిడ్ టెస్టు చేసి తగిన చికిత్స అందిస్తారని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలన్నారు. జ్వరంపై నిర్లక్ష్యం చేస్తే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యాకు దారి తీస్తాయని, ప్లేట్ లెట్ కౌంట్ పడిపోతుందన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌డీవో పీడీ నాగపద్మ, జడ్పీసీఈవో విద్యాలత, ఎంపీడీవో అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

54వ డివిజన్‌లో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

హనుమకొండ టౌన్: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నాలుగో రోజులో భాగంగా గురువారం 54వ డివిజన్‌లోని పోచమ్మకుంట, వెంకట్రామయ్య కాలనీలను ప్రత్యేకాధికారి హరితతో కలిసి కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోచమ్మకుంటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. అనంతరం వెంకట్రామయ్య కాలనీలో నీటితో



వెంకట్రామయ్య కాలనీలో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న కలెక్టర్

నిండిఉన్న కుంటలో ఆయిల్ బాల్స్ వేశారు. నీరు నిల్వ ఉన్న స్థలంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రజిత, స్థానికులు కర్ణాకర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబా ఆలయంలో మధ్యాహ్న హారతిలో పాల్గొన్న భక్తులు

సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ

బాలసముద్రం, ఆగస్టు 8: శ్రావణమాసం గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సాయిబాబా దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం కాగడహారతి అనంతరం బాబాకు అభిషేకం అలంకరణను అర్చకులు నిర్వహించారు. తదుపరి భక్తులు బాబాను దర్శించుకున్నారు. గురువారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం భక్తులతో పోటెత్తింది. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా బాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ధూపదీప నైవేద్య హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహాన్నదాన కార్యక్రమంలో భక్తులు బాబా ప్రసాదాన్ని స్వీకరించారు.

సాయంత్రం సంధ్య హారతి రాత్రి శేజ హారతికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరైయ్యారు. సాయిబాబా మందిర కమిటీ ట్రస్టు సభ్యుడు నిమ్మల శ్రీనివాస్ భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్మైల్ ఫౌండేషన్ డాక్టర్ సిద్ధార్థ ఆధ్వర్యంలో వైద్య సేవలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాబా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు రాకాం సదానందం, నిమ్మల శ్రీనివాస్, వేయిగండ్ల రమేష్, డాక్టర్ పూస సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి రామకృష్ణ సేవా సమితుల కృషి

హైదరాబాద్ రామకృష్ణ మఠ్ స్వామిజీ శితికంఠానంద మహారాజ్



రామకృష్ణ సేవా మందిర్ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న వి శిష్ట ధర్మకర్త మాతాజీ పడిదల అనిత

కాజీపేట జంక్షన్, ఆగస్టు 8: రాష్ట్రంలోని రామకృష్ణ సేవా సమితులన్నీ యువత వ్యక్తిత్వ వికాసం కోసం, స్వామి వివేకానంద భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు భవిష్యత్ తరాలను సంస్కార వంతులుగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తాయని హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠ్ స్వామిజీ శితికంఠానంద మహారాజ్ అన్నారు. గురువారం ఆయన హనుమకొండలోని కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో నిర్మిస్తున్న శ్రీరామకృష్ణ సేవామందిర్ నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి వచ్చారు. వారి వెంట ధ్యానమందిరం డిజైనర్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, నిజామాబాద్ సేవా సమితి ఇంజనీర్ సాయిబాబా హాజరయ్యారు. మందిర నిర్మాణం త్వరితగతిన సాగుతున్నందుకు నిర్వాహకులను అభినందించారు. ధ్యానమందిరం, ఎలివేషన్ తీరు తెన్నుల గురించి చర్చించారు.

ఈ సందర్భంగా శ్రీశితికంఠానంద మహారాజ్ మాట్లాడుతూ.. వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాల నడిబొడ్డున అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా సేవా మందిర్ విరాజిల్లుతోందని అన్నారు. సేవా సమితి అధ్యక్షుడు కటంగూర్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ. యేడాదికాలంలోనే నాలుగు ఫ్లోర్‌ల మందిర నిర్మాణ లక్ష్యంగా స్లాబ్‌లను పూర్తి చేశామన్నారు. ఈ నిర్మాణానికి విశేషంగా విరాళాలు అందజేసిన దాతలు, ధర్మకర్తలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్వామిజీ సమక్షంలో రూ.లక్ష ఆర్థిక సహాయం అందించిన దాత మాతాజీ పడిదల అనితకు, స్వామిజీతో హైదరాబాద్ నుంచి రూ.50వేల విరాళం పంపించిన ఆదర్శ ధర్మకర్త అనంత లక్ష్మిలకు సత్యనారాయణరెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కార్యనిర్వాహక బాధ్యులు జినుగు విష్ణువర్ధన్‌రెడ్డి, కె.శ్రీనివాసస్వామి, కేవీ రావు, మూల తిరుపతిరెడ్డి, కె.సూర్య ప్రభాకర్ యాదవ్, మాతాజీలు సరోజన, అంజలిదేవి, బోయినపల్లి పార్వతిదేవి, లక్ష్మిరావు, మూల లక్ష్మిదేవి, వీణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్‌రావు

హనుమకొండ టౌన్, ఆగస్టు 8: విద్యుత్ ప్రమాదాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ పి.మధుసూదన్‌రావు సూచించారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట సెక్షన్‌లోని ఇల్లంద గ్రామంలో పంటపొలాల వద్ద రైతులకు విద్యుత్ సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే పంట పొలాల వద్ద ఉన్న సమస్యలను పరిష్కరించుకుంటూ వస్తున్నామని, ఇంకేమైనా ఉన్న స్థానిక ఏఈ, లైన్‌మెన్, లైన్‌ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకువస్తే సమస్య సత్వరమే పరిష్కరిస్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో రైతుల విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తగా వ్యవహరించి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దన్నారు. ప్రతీ ఒక్క రైతు మోటార్ల దగ్గర కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల నష్టాలు నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా కెపాసిటర్స్ పనితీరుపై రైతులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈ టెక్నికల్ ఆనందం, వరంగల్ రూరల్ డీఈ (ఆపరేషన్) భిక్షపతి పాల్గొన్నారు.



విద్యుత్ ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేయూ క్యాంపస్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కేయూ క్యాంపస్‌లోని అంబేద్కర్ హాస్టల్ భవనంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలో 10 రోజుల సీఏటీసీ-6వ శిక్షణ క్యాంపును కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామ్ దొరై గురువారం ప్రారంభించారు. క్యాంపు ఆగస్టు 14 వరకు సాగుతోందని ఆయన తెలిపారు. మ్యాప్ రీడింగ్, లీడర్‌షిప్ క్వాలిటీస్, ఆర్మీ బేసిక్స్, ఆర్మ్‌డ్ ఫోర్స్‌పై క్యాడెట్లకు శిక్షణ ఇచ్చినట్లు దొరై పేర్కొన్నారు. ప్రతీ ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు పాయింట్, 22 రైఫిల్‌తో ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చి వాటి ప్రాధాన్యత ఆర్మీలో వాటి ఉపయోగాలపై వివరించినట్లు తెలిపారు. రిపబ్లిక్ డేలో పాల్గొనే క్యాడెట్లను ఎంపిక చేసిన కఠోరమైన పరేడ్ నిర్వహిస్తున్నట్లు దొరై తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు వ్యాయామ పద్ధతులు, ఆరోగ్య భద్రత, యోగాసనాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ పి.సతీశ్‌కుమార్, కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, సుబేదారి మేజర్ సుహాస్కదం, లెఫ్టినెంట్ గణేశ్, సెకండ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, కెప్టెన్ డాక్టర్ సబిత, ఫస్ట్ ఆఫీసర్ బాలు రెడ్డి, థర్డ్ ఆఫీసర్ శాంతి, జీసీఐ సుజిత, సీతలు, సూపరింటెండెంట్ అరుణ, కుమార స్వామి, సతీశ్, మహేశ్, ఏడుకొండలు, సౌరస్య క్యాడెట్లు పాల్గొన్నారు.



ఫైరింగ్ శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

సీపీని కలిసిన నూతన అధికారులు

వరంగల్ క్రైం, ఆగష్టు 8: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు స్టేషన్‌లలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పోలీసు అధికారులు గురువారం సీపీ అంబర్ కిషోర్ ఝాను మార్యాదపూర్వకంగా కలిశారు. సీపీని కలిసిన వారిలో ధర్మసాగర్, స్టేషన్‌ఘన్‌పూర్ సీఐలు ప్రవీణ్‌కుమార్, వేణు, ఐటీకోర్ విభాగం సీఐ శ్రీనివాస్, పర్వతగిరి ఎస్ఐ ప్రవీణ్ ఉన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని హోంగార్డుల వినతి

వరంగల్ క్రైం, ఆగష్టు 8: వరంగల్ కమిషనరేట్‌కు వచ్చిన తెలంగాణ రీజియన్ కమాండెంట్ ఆర్.వెంకటేశ్వర్లును తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘం నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సర్వీసులు రెగ్యులరైజ్ చేయాలని వారు కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. కమాండెంట్‌ను కలిసిన వారిలో సంఘం నేతలు పుప్పాల అశోక్, రాఘవరావు, నాగేశ్వర్‌రావు, శ్యామ్ తదితరులున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

వడ్డెపల్లి, ఆగస్టు 8: హనుమకొండ వడ్డెపల్లి చెరువుకట్టపై నూతనంగా నిర్మించిన రజకుల ఇలవేల్పులు మడేలయ్య - శీతాల దేవి, ఈది నాంచారమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. రుత్వికులు మణికొండ వామన్‌కుమార్‌శర్మ, మణికొండ ప్రవీణ్‌శర్మల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాల ప్రతిష్ఠాపనను నేత్రపర్వంగా నిర్వహించారు. విగ్రహదాతలు ఎదులాపురం సుగుణ- నరేందర్, పాండ్రాల శ్రీదేవి- సంపత్‌కుమార్ దంపతులు అఖండ జ్యోతిని వెలిగించి మడేలయ్యతో పాటు శీతాల దేవి, ఈది నాంచారమ్మ విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలను భక్తి ప్రపత్తులతో జరిపించారు. ఈ కార్యక్రమంలో వడ్డెపల్లి రజక సంఘం నేతలు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహాలకు పబ్బతి పట్టి, నూతన వస్త్రాలు, నైవేద్యం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రాంగణ నియామకాల్లో విద్యార్థుల ఎంపిక



ప్రాంగణ నియామకల్లో ఎంపికైన విద్యార్థులతో రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు హైదరాబాద్‌లోని జితారా-ఏఐ సంస్థ నేతృత్వంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 15 ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మహేందర్ గురువారం తెలిపారు. 2024-25 ఏడాదిలో ఇంజనీరింగ్ అన్ని బ్రాంచ్‌లలో అఖరు ఏడాది చదువుతున్న 250 మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాలకు హాజరుకాగా మొదటి రౌండ్‌లో 55 మంది ఎంపికయ్యారు. వీరికి రెండో రౌండ్‌లో టెక్నికల్, మూడో రౌండ్‌లో హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. చివరకు 15 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మహేందర్ తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.7లక్షల వరకు జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన వారు జూన్ 2025 నుంచి హైదరాబాద్ కేంద్రంగా ఉద్యోగం చేయాలని తెలిపారు. ఎంపికైన వారు నూతన స్కిల్స్ నేర్చుకోవాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బొల్లం కిరణ్‌కుమార్‌లు ఉద్యోగ పత్రాలను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రమణ బాబు, కంపెనీ ప్రతినిధులు శ్రీవిష్ణు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 36,831 మంది రైతులకు రుణమాఫీ

బాలసముద్రం, ఆగస్టు 8 : హనుమకొండ జిల్లాలో ఇప్పటి వరకు 36,831 మంది రైతులకు రుణమాఫీ నిధులు మంజూరు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారులు తెలిపారు. లక్షలోపు ఉన్న 25,055 మంది రైతులకు రూ. 140.8కోట్లను రైతుల ఖాతాలలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. రూ.లక్షా 50వేల లోపు ఉన్న 11,776 మంది రైతులకు రూ.167.8కోట్లు ప్రభుత్వం రుణమాఫీ చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

ఇంకా రుణమాఫీ కానీ రైతులు 451 మంది ఉన్నారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరించి కారణాలు తెలుసుకుంటున్నారు. రెండు లక్షల లోపు రైతు రుణమాఫీ చేసిన తర్వాత మిగత రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని, రైతులు అధైర్యపడవద్దని అధికారులు రైతులను కోరుతున్నారు. హనుమకొండ జిల్లాలో కొందరు రైతులు బ్యాంకులలో పంటపెట్టుబడికి రుణం తీసుకుని పట్టాపాస్ బుక్కులు బ్యాంకులలో ఉన్నప్పటికీ రైతుల అవసరాల కోసం భూమిని ఇతరులకు విక్రయించిన, రికార్డులలో పేరు మారిన చేసిన రుణమాఫీ కావడంలేదని అధికారులు చెబుతున్నారు. కొందరు రైతులు రుణం తీసుకోని వివిధ కారణాలతో మృతి చెందిన రైతుల అకౌంట్లు క్లోజ్ అయిన వారికి కూడా రుణమాఫీ కాలేదని, మరికొన్ని కారణాలతో జిల్లాలో రుణమాఫీ కాలేదని అధికారులు చెబుతున్నారు.

సహజయోగ

భక్తి-విశ్వాసం



భక్తి అంటే భగవంతుని మీద ప్రేమ, నమ్మకం. పుట్టిన ప్రతి బిడ్డ తల్లిని, తండ్రిని నమ్మినట్టే... సృష్టికర్త ఒకరున్నారని చాలా మంది నమ్ముతారు. ఈ మొత్తం విశ్వాన్ని ఏదో శక్తి నడిపిస్తోందని దాదాపు ప్రతి ఒక్కరూ నమ్ముతారు. భూమి వేగం పెరిగినా, గ్రహాల స్థితిగతులు మారినా అవాంఛనీయ పరిణామాలు జరుగుతాయి. అలాంటిది జరగకుండా... సృష్టి మొత్తం సవ్యంగా సాగిపోతోందంటే... దీన్ని ఏదో అదృశ్యశక్తి కాపాడుతోంది. 'ఆ శక్తే దైవం' అని ఎంతోమంది శాస్త్రవేత్తలు సైతం విశ్వసిస్తారు. ఆ దైవశక్తి స్వరూప స్వభావాలను,గుణగణాలను ప్రాచీన భారతీయ మహర్షులు తపస్సు చేసి తెలుసుకున్నారు. బుద్ధిని ఉపయోగించి దైవశక్తిని అర్థం చేసుకొనే ప్రయత్నం కన్నా... హృదయపూర్వకమైన భక్తి విశ్వాసాలతో చేరుకోవడం సులభం. దానికోసం భగవంతుడి శక్తి మీద అనన్యమైన భక్తి, అచంచలమైన విశ్వాసం ఉండాలని సహజయోగ వ్యవస్థాపకురాలు శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రసంగాలలో ఎన్నో ఉదాహరణలు చెప్పారు.



భగవంతుడి మీద భక్తుడికి అనన్యమైన భక్తి, అచంచలమైన విశ్వాసం ఉంటే... భగవంతుడు పరుగున వచ్చి భక్తుణ్ణి రక్షిస్తాడు.

ఛత్రపతి శివాజీకి ఆధ్యాత్మిక గురువైన శ్రీ సమర్థ రామదాసు ఆత్మసాక్షాత్కారం పొందిన వ్యక్తి. ఒక రోజు ఆయన తన శిష్యులను పరీక్షించాలనుకున్నాడు. జబ్బు పడినట్టుగా మంచం మీద పడుకున్నాడు. శిష్యులు వచ్చి కంగారుగా ఏమయిందని ప్రశ్నించారు. ఆయన తన కాలును చూపించారు. దానికి కట్టు కట్టి ఉంది. తన కాలుకు గాయమై చీము పట్టిందనీ, ఆ బాధ భరించలేకపోతున్నాననీ సమర్థ రామదాసు చెప్పాడు. "అదెలా తగ్గుతుంది?" అని శిష్యులు ప్రశ్నించారు. ఆ చీమును నోటితో పీల్చి బయటకు లాగితే తగ్గుతుందని ఆయన అన్నాడు. అది వినగానే, అసహ్యం, జుగుప్సతో శిష్యులు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. శివాజీ ముందుకు వచ్చి... ఆ చీమును పీల్చడానికి సిద్ధపడ్డాడు. అతను పీల్చగానే నోటిలోకి మామిడి పండు రసం వచ్చింది. అది గురువు పెట్టిన పరీక్ష అని అందరికీ అర్థమయింది. శిష్యుడికి గురువుపై ఉండే భక్తి విశ్వాసాలే... గురుకృపకు పాత్రుణ్ణి చేస్తాయి. ప్రహ్లాదుడు, ధ్రువుడు, శబరి, అలాగే నారదమహర్షి మాటలపై విశ్వాసంతో దొంగతనాలు విడిచిపెట్టి, రామభక్తుడై, మహాకవిగా మారి... రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి ఇలా ఎందరో తమ భక్తి, విశ్వాసాలతో భగవంతుడి కటాక్షాన్ని పొందారు.

భక్తి, విశ్వాసం... మానవుడికి, భగవంతుడికి మధ్య కంటికి కనిపించని వారధి లాంటివి. అవి మానవుణ్ణి భగవంతుడికి దగ్గర చేస్తాయి. మన పురాణాలలో ద్రౌపదికి శ్రీకృష్ణునిపై ఉన్న అనన్య భక్తి, అచంచల విశ్వాసమే... ఆమె మాన సంరక్షణ కోసం శ్రీకృష్ణుడు ద్వారక వదిలి హస్తినకు ఆఘమేఘాల మీద వచ్చేలా చేసింది. ఆ సమయంలో తన చీరను ఆమె తన పళ్ళ మధ్య ఉంచి... దుశ్శాసనుడితో ఆమె పెనుగులాడుతోంది. 'కృష్ణా' అనే పదంలో 'కృ' అని మాత్రమే అనగలిగింది. 'ష్ణా' అనడానికి నోరు తెరిస్తే... చీర జారిపోతుందేమోనని భయం. అలా చాలా సమయం పెనుగులాడిన తరువాత... శ్రీకృష్ణుడిని సంపూర్ణ శరణాగతి కోరుతూ... 'ష్ణా' అంది. ఆ శబ్దం బయటకు వచ్చి, ఆమె చీర తొలగిపోకముందే... శ్రీకృష్ణుడు మెరుపువేగంతో వచ్చి ఆమెను మాన సంరక్షణ చేశాడు.

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/SJAd8S2లో చదవండి.



సకల సంపత్కరం

వర్ష ఋతువులో తొలి మాసం శ్రావణం. పున్నమి రోజున శ్రవణం నక్షత్రం ఉన్న నెలను 'శ్రావణమాసం' అంటారు. ఇంటింటా ఆడపడుచులకు ఆనందాన్ని పండించే నోములు, వ్రతాల పవిత్ర మాసం ఇది. మంగళవారాల్లో గౌరీదేవిని, శుక్రవారాల్లో లక్ష్మీదేవిని ప్రత్యేకంగా ఆరాధించినా... ఇది దేవతలందరికీ ప్రియమైన మాసం. అందుకే దీన్ని 'నభోమాసం' అంటారు. 'నభం' అంటే ఆకాశం. వర్ష ఋతువులో ఆకాశం కురిపించే వర్షాలతో భూమి సస్యశ్యామలమవుతుంది. ఆకాశంలో అంటే ఊర్ధ్వలోకాలలో కొలువైన దేవతలను ఆరాధిస్తే... వరాల వర్షం కురుస్తుందనేది పెద్దలమాట.

ఈ నెలలో ప్రతిరోజూ ఒక పర్వదినమే. మంగళగౌరి, వరలక్ష్మీ పూజలతో పాటు ఏకాదశి రోజుల్లో శైవ, వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక ఆరాధనలు జరుగుతాయి. నాగచతుర్థి, గరుడ పంచమి రోజున నాగేంద్రునికి పూజలు చేస్తారు, శ్రావణ పౌర్ణమి రోజున విఖనస జయంతి, హయగ్రీవ జయంతి, బహుళాష్టమి నాడు శ్రీ కృష్ణాష్టమి పర్వదినాలను వైష్ణవ సంప్రదాయంలో ఘనంగా జరుపుకొంటారు. శ్రావణ అమావాస్యను 'పోలాల అమావాస్య' అంటారు. ఆ రోజున ప్రధానంగా శక్తిని పూజిస్తారు. ముత్తయిదువలు పూజా మంటపం మీద పోలాంబకు ప్రతీకగా కందమొక్కను ప్రతిష్ఠించి, పూజిస్తారు. తోరాలను కట్టి, వాటినీ అమ్మవారికి అర్పించి, తాము, ఇంట్లోని ఆడపిల్లలు కట్టుకుంటారు. పోలాంబను పూజించడం వల్ల కుటుంబ సౌఖ్యం, సిరిసంపదలు, సౌభాగ్యం లభిస్తాయని విశ్వాసం. నందీశ్వరుడు జన్మించిన రోజు ఇదేనని పురాణాలు చెబుతున్నాయి. కనుక ఈ రోజున గో, వృషభ పూజను కూడా నిర్వహిస్తారు.

శ్రావణ మాసంలో మహిళలు, అవివాహితలు మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. ప్రధానంగా నూతన వధువులతో పుట్టింటివారు ఈ వ్రతం చేయిస్తారు. ఈ వ్రతాన్ని అయిదేళ్ళపాటు ఆచరించడం సంప్రదాయం. దానికి అనుగుణంగా ఆడబిడ్డల పుట్టింటివారు ఆషాఢపట్టిని సంప్రదాయానుసారం వారి మెట్టినింటివారికి కానుకగా ఇచ్చి... తమ కుమార్తెలను పుట్టింటికి తీసుకువస్తారు. వారితో మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతం చేయిస్తారు. శ్రావణమాసం పూర్తవగానే మెట్టినింటివారు శ్రావణ పట్టి పేరిట వియ్యాలవారికి కానుకలిచ్చి, తమ కోడలిని తీసుకువెళ్తారు. ఇది తెలుగునాట అనాదిగా వస్తున్న ఆనవాయితీ. అలాగే శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు... మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం చేస్తారు. కోరిన వరాలను ఇచ్చే కల్పవల్లి శ్రీ వరలక్ష్మిని ప్రసన్నం చేసుకోవడానికి ఉద్దేశించిన ఈ వ్రతాన్ని కులాలకూ, వర్గాలకూ అతీతంగా... వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ ఆచరించవచ్చు. శ్రీ వరలక్ష్మీ దేవి ఆరాధనతో అభీష్టాలు సిద్ధిస్తాయనీ, సర్వ శ్రేయస్సులూ కలుగుతాయనీ, ఆరోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయనీ వ్రత గాథలు చెబుతున్నాయి.

అలాగే ఈ నెలలో అత్యంత విశిష్టమైన రోజు... పౌర్ణమి. దీన్ని 'రాఖీ పౌర్ణమి' లేదా 'రక్షాబంధన దినోత్సవం'గా దేశమంతటా నిర్వహిస్తారు. రక్షాబంధనం సోదరీ సోదరుల ఆత్మీయానుబంధానికి చిహ్నం. సోదరికి సోదరుడు రక్షకట్టి, ఆమెకు ఎల్లవేళలా రక్షణగా ఉంటానని వాగ్దానం చేసే ఈ రోజు... సోదరీ సోదరుల మధ్య పరస్పర ప్రేమ, ఆప్యాయత, బాధ్యత, త్యాగం, రక్షణలకు ప్రతీక. అలాగే ఇది ఉపనయనం అయిన వారి ఉపాకర్మ సంస్కారాలకూ, వేదాధ్యయనానికీ అనువైన రోజుగా... 'జంధ్యాల పౌర్ణమి'గా దీన్ని జరుపుకొంటారు. ఈ విధంగా... సకల సంపత్కరమైన, శుభదాయకమైన మాసంగా శ్రావణానికి ఎనలేని ప్రత్యేకత ఉంది.

రంగుటద్దాలను తొలగించుకుందాం

గీతాసారం




మనం కొన్ని పనులు చేస్తాం, నిర్ణయాలు తీసుకుంటాం. ఇతరులు కూడా అలాగే చేస్తారు. ఆ పనుల్లో కొన్నిటికి మంచివి అనీ, మరికొన్నిటికి చెడ్డవి అని పేర్లు పెట్టడం చుట్టూ మన జీవితాలు అల్లుకొని ఉంటాయి. "సమత్వ బుద్ధి కలిగినవాడు పాప పుణ్యాలు రెండిటినీ ఈ లోకంలోనే త్యజిస్తాడు" అని శ్రీకృష్ణుడు చెప్పాడు. అంటే మనం ఈ సమత్వ యోగాన్ని చేరుకున్నట్టయితే... ఆ తరువాత 'అవి మంచివి, ఇవి చెడ్డవి' అని పేర్లు పెట్టడం మానేస్తాం. అనవసరమైన అభిప్రాయాలకు చోటివ్వం. మన మనస్సు అనేక రంగుటద్దాలతో కప్పి ఉంటుంది. ఎదిగే సమయంలో మన తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు వెల్లడించే అభిప్రాయాలు, భావాల నియంత్రణలో ఉంటాం. అలాగే మనం జీవిస్తున్న దేశంలోని చట్టాల ద్వారా కూడా. ఇవన్నీ మన మనసుల్లో ముద్రవేసుకొని ఉంటాయి. మనం ఈ రంగుటద్దాల ద్వారానే అన్ని విషయాల్నీ, పనుల్నీ చూస్తూ ఉంటాం. వాటిని మంచివనీ, చెడ్డవనీ ముద్ర వేస్తాం. యోగ స్థితి... ఈ రంగులన్నీ వాటంతట అవే కరిగిపోయేలా, మనం అన్ని విషయాలనూ స్పష్టంగా చూడగలిగేలా చేస్తుంది. ఇది రెమ్మలకు బదులు మూలాలను నాశనం చేయడం లాంటిది. అంటే ప్రతి దానికీ మన సొంత రంగును (అభిప్రాయాన్ని) జోడించడానికి ప్రయత్నించకుండా... పరిస్థితులను ఉన్నవి ఉన్నట్టుగా అంగీకరించడం.

జీవితంలో ఈ రంగుటద్దాలు మనల్ని ముడుచుకుపోయేలా చేస్తాయి. తద్వారా నిర్ణయం తీసుకోడానికి అవసరమైన కీలక సమాచారాన్ని కోల్పోతాం. సరైనదికాని లేదా తప్పుగా అన్వయించిన సమాచారం ఆధారంగా తీసుకున్న నిర్ణయాలు, పనులు అనివార్యంగా విఫలమవుతాయి. తటస్థంగా ఉండడం అంటే ఒక సమస్యకు అనుకూలంగా, వ్యతిరేకంగా ఏకకాలంలో వాదించాల్సిన పరిస్థితి లాంటిది. న్యాయమూర్తి నిర్ణయాలు తీసుకొనే ముందు ఇరు పక్షాల వాదలను వినడం లాంటిది. అన్ని జీవులలో తనను, అన్ని జీవులను తనలోనూ చూడడం లాంటిది. అంతిమంగా అంతా శ్రీకృష్ణమయమే. ఒక పరిస్థితిలో మనం కూరుకుపోకుండా.. మనల్ని మనం వేరు చేసుకొని.. ఆ పరిస్థితిలోని ఇరు పార్శ్వాలనూ అర్థం చేసుకొనే సామర్థ్యం ఇది. ఈ సామర్థ్యం వికసించాక... మనల్ని మనం కేంద్రీకరించుకోవడం మొదలుపెడతాం. ఎవరైనా క్షణికమైన యోగ స్థితిని (సమతుల్యతను) పొందినప్పుడు కూడా... ఆ సమయంలో వారి ద్వారా జరిగే పని సమంజసంగా ఉంటుంది. సాధనతో ఆ స్థితి శాశ్వతమవుతుంది.



కె. శివప్రసాద్
ఐఎఎస్



కుటుంబ వ్యాపారాల్లో అంబానీ టాప్

రూ. 25.75 లక్షల కోట్లతో అగ్రస్థానం

జాబితాలో 9 తెలుగు వ్యాపార కుటుంబాలు

హురున్ ఇండియా బార్‌క్లేస్ నివేదిక వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ కుటుంబ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఈ ఏడాది మార్చి 20 నాటికి రిలయన్స్ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల ఈక్విటీల్లో అంబానీ కుటుంబ వ్యాపారాల విలువ రూ.25.75 లక్షల కోట్లకు చేరింది. దేశంలో మరే కుటుంబం వ్యాపారాల విలువ ఈ స్థాయిలో లేదని గురువారం విడుదలైన 'బార్‌క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యువబుల్ ఫ్యామిలీ బిజినెస్ నివేదిక' తెలిపింది. అంబానీ కుటుంబం వ్యాపారాల విలువ ప్రస్తుతం భారత జీడీపీలో పదో వంతు ఉంటుందని అంచనా వేసింది. అంబానీల తర్వాత రూ.7.13 లక్షల కోట్లతో బజాజ్ కుటుంబం, రూ.5.39 కోట్లతో బిర్లా కుటుంబం 2,3స్థానాల్లో నిలిచాయి.

అదానీ కుటుంబం

అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ కుటుంబ వ్యాపారాల విలువ రూ.15.44 లక్షల కోట్ల వరకు ఉన్నా తొలి తరం పారిశ్రామికవేత్త కావడంతో హురున్ ఇండియా జాబితాలో చోటు దక్కలేదు. అయితే తొలి తరానికి చెందిన అత్యంత సంపన్న పారిశ్రామిక కుటుంబాల జాబితాలో మాత్రం అదానీలకు చోటు దక్కింది. అదానీల తర్వాత రూ.2.37 లక్షల కోట్లతో సీరమ్ ఇనిస్టిట్యూట్ అధినేత అదర్ పూనావాలా కుటుంబం తొలి తరం సంపన్న పారిశ్రామిక కుటుంబాల జాబితాలో చోటు సంపాదించింది. ఈ ఏడాది మార్చి 20 నాటికి వీరి ప్రైవేట్ పెట్టుబడులు, చరాస్తులను మినహాయించి, కుటుంబ వ్యాపారాల విలువ కనీసం రూ.2,700 కోట్లు ఉన్న కుటుంబాలను మాత్రమే ఈ ఏడాది హురున్ ఇండియా సంపన్న కుటుంబాల జాబితాలోకి తీసుకున్నారు.

ముగ్గురి కుటుంబాల ఆస్తి విలువ సింగపూర్ జీడీపీకి సమానం

ఈ జాబితాలో తొలి మూడు స్థానాల్లో ఉన్న ముకేశ్ అంబానీ, బజాజ్ కుటుంబం, కుమార్ మంగళం బిర్లా ఉమ్మడి ఆస్తి విలువ46,000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.38.27 లక్షల కోట్లు)గా ఉందని, ఇది దాదాపు సింగపూర్ జీడీపీకి సమానమని హురున్ ఇండియా నివేదిక వెల్లడించింది.

బార్‌క్లేస్ హురున్ ఇండియా తాజా జాబితాలో తొమ్మిది తెలుగు పారిశ్రామికవేత్తల కుటుంబాలకూ చోటు దక్కింది. ఇందులో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు చెందిన జీవీ ప్రసాద్ కుటుంబం రూ.1,01,800 కోట్లతో అగ్రస్థానంలో ఉంది. ఇక


తెలుగు వ్యాపార కుటుంబాల జోరు

తెలుగు రాష్ట్రాలకు చెందిన అవంతి ఫీడ్స్, నవ లిమిటెడ్ కంపెనీల షేర్లు జెట్ స్పీడ్‌లో దూసుకుపోవడంతో ఆయా కంపెనీల ప్రమోటర్ల కుటుంబాల వ్యాపారాల విలువ ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. ఇందులో 1998లో రూ.2 వద్ద కోట్ అయిన నవ లిమిటెడ్ కంపెనీ షేరు ధర.. ఈ ఏడాది మార్చి 20 నాటికి 285 శాతం లాభంతో రూ.470 వద్ద, 2010లో రూ.2 వద్ద ట్రేడైన అవంతి ఫీడ్స్ కంపెనీ షేర్లు ఈ ఏడాది మార్చి 20కి 302 శాతం లాభంతో రూ.492 వద్ద ట్రేడయ్యాయి.

పారిశ్రామికవేత్త కుటుంబం	కంపెనీ పేరు	ఆస్తుల విలువ (రూ.కోట్లలో)
జీవీ ప్రసాద్	డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్	1,01,800
దివి మురళి	దివీస్ ల్యాబ్స్	91,200
ప్రతాప్ సీ రెడ్డి	అపోలో హాస్పిటల్స్	88,800
పీపీ రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	75.100
జీఎం రావు	జీఎంఆర్ గ్రూప్	47,800
బీ పార్థసారథి రెడ్డి	హెటిరో ల్యాబ్స్	22,300
బీవీఆర్ మోహన్ రెడ్డి	సైయెంట్	22,200
జే రామేశ్వర రావు	మై హోమ్ ఇండస్ట్రీస్	20,400
మహిమ దాట్ల	బయోలాజికల్స్ ఈ	15,900

బిజినెస్

వడ్డీ రేట్లు యథాతథం



- వరుసగా తొమ్మిదో సారీ అవే రేట్లు
- జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణ అంచనాల్లోనూ మార్పు లేదు..
- ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ

ముంబై: మార్కెట్ వర్గాల అంచనాలకు అనుగుణంగానే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వరుసగా తొమ్మిదోసారీ కీలక వడ్డీ (రెపో) రేట్లను యథాతథంగా కొనసాగించింది. దాంతో రెపో రేటు 6.50 శాతంగా కొనసాగనుంది. అయితే, ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షత వహించే ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ)లో నలుగురు మాత్రమే రేట్ల యథాతథ స్థితికి అనుకూలంగా ఓటు వేశారు. మిగతా ఇద్దరు సభ్యులు రేట్ల తగ్గింపునకు మొగ్గు చూపడం గమనార్హం. కాగా, ద్రవ్యోల్బణాన్ని లక్ష్యానికి అనుగుణంగా 4 శాతానికి కట్టడి చేసేందుకు వడ్డీ రేట్లపై సర్దుబాటు ధోరణిని క్రమంగా ఉపసంహరించుకునే వైఖరినే కొనసాగించాలని కమిటీ నిర్ణయించింది. ఎందుకంటే, ఆహార ధరలు గణనీయంగా పెరగడంతో జూన్ నెల ద్రవ్యోల్బణం 5.08 శాతానికి ఎగబాకింది. ఆహార ధరలు ఎంతకూ దిగిరావట్లేదని.. ధరల్లో స్థిరత్వం సాధించలేకపోతే గరిష్ఠ వృద్ధిని నిలకడగా కొనసాగించలేమని ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి వరకు రెపో రేటును వరుసగా ఆరుసార్లు పెంచిన ఆర్‌బీఐ.. ఆ తర్వాత నుంచి యథాతథంగా కొనసాగిస్తూ వస్తోంది. అలాగే ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25) 7.2% జీడీపీ వృద్ధి, 4.5% ద్రవ్యోల్బణ అంచనాలను సైతం యథాతథంగా కొనసాగిస్తున్నట్లు సమీక్షలో ఆర్‌బీఐ వెల్లడించింది.

అక్టోబరు లేదా డిసెంబరులో తగ్గింపు!?

ఈసారి ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బీఐ రెపోరేటును అంచనాలకు అనుగుణంగానే యథాతథంగా కొనసాగించిందని ఆర్థిక విశ్లేషకులు పేర్కొన్నారు. ఆహార ధరల్లో అస్థిరతే ఇందుకు కారణమని వారన్నారు. ద్రవ్యోల్బణం 4% దిగువకు తగ్గేవరకు ఆర్‌బీఐ వేచి చూడవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది చివరి త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో ఆర్‌బీఐ రెపో రేట్ల తగ్గింపునకు శ్రీకారం చుట్టవచ్చని భావిస్తున్నారు. అక్టోబరు లేదా డిసెంబరు సమీక్షలో తొలితగ్గింపు ఉండవచ్చంటున్నారు.

టాప్‌అప్ లోన్స్ సమస్య కొన్ని బ్యాంక్‌లకే

కొన్ని బ్యాంక్‌లు తమ కస్టమర్లకు ఊహాజనిత ఉపయోగాల కోసం తనఖా రుణాలపై టాప్-అప్ లోన్స్ ఆఫర్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ అన్నారు. అయితే, ఇది వ్యవస్థాగత సమస్య కాదన్నారు. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోని ఆర్థిక సంస్థలతో మేము పర్యవేక్షక స్థాయిలో ద్వైపాక్షికంగా వ్యవహరిస్తామని దాస్ స్పష్టం చేశారు.

కుటుంబ పొదుపు సాధారణ స్థాయికి..

కుటుంబాల పొదుపు తీరు మళ్లీ సాధారణ స్థాయికి చేరుకుంటోందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైకేల్ పాత్ర అన్నారు. ఈక్విటీల్లో కుటుంబ పొదుపు వాటా క్రమంగా తగ్గుతోందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కుటుంబ పొదుపు రేటు నాలుగు దశాబ్దాలకు పైగా కనిష్ఠ స్థాయి 5.3 శాతానికి పడిపోయింది.

డిపాజిట్ల వృద్ధిపై దాస్ ఆందోళన

కుటుంబ పొదుపు ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల్లోకి మళ్లుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన దాస్.. బ్యాంక్‌లు వినూత్న ఆర్థిక పథకాలు, సేవల ద్వారా డిపాజిట్ల సమీకరణను పెంచుకోవాలని సూచించారు. ఇందుకోసం తమ శాఖలను విస్తృతంగా వినియోగించుకోవాలన్నారు.

ఇండో-బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్‌కు అత్యుత్తమ పెయిన్ మేనేజ్‌మెంట్ అవార్డు



హైదరాబాద్: ప్రముఖ పెయిన్ మేనేజ్‌మెంట్ క్లినిక్ ఇండో-బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్.. జాతీయ స్థాయిలో అత్యుత్తమ పెయిన్ మేనేజ్‌మెంట్ అవార్డును గెలుచుకుంది. పెయిన్ మెడిసిన్ విభాగంలో ఇండో-బ్రిటిష్ క్లినిక్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా హెల్త్ ఈ అవార్డును అందించింది. ఈ సందర్భంగా ఇండో-బ్రిటిష్ క్లినిక్ వ్యవస్థాపకులు డాక్టర్ విజయ భాస్కర్ బండికట్ల మాట్లాడుతూ.. దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతున్న వారికి సమగ్రమైన, అత్యాధునిక చికిత్సను అందిచటంలో చేసిన కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించటం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ఇంటర్వెన్షనల్ ప్రొసీజర్స్, మెడికేషన్ మేనేజ్‌మెంట్, ఫిజికల్ థెరపీ, సైకలాజికల్ కౌన్సిలింగ్ సహా వినూత్న చికిత్సా విధానాలతో నొప్పిని నివారించటంలో తమ క్లినిక్ చాలా కీలకంగా ఉందని ఆయన తెలిపారు.

నవ లిమిటెడ్ లాభం 446 కోట్లు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి నవ లిమిటెడ్ రూ.445.9 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ఆర్జించిన రూ.342.7 కోట్ల లాభంతో పోలిస్తే 30.1 శాతం వృద్ధి కనబరిచింది. భారత్, జాంబియాలోని ఎనర్జీ వ్యాపార విభాగం బలమైన పనితీరు కనబర్చడంతో పాటు ఎఫ్ఏపీ, మైనింగ్ వ్యాపారాలు ఆదాయాల్లో పెరుగుదల ఇందుకు దోహదపడ్డాయని పేర్కొంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ మొత్తం ఆదాయం వార్షిక ప్రాతిపదికన 16.7 శాతం వృద్ధితో రూ.1,258.4 కోట్లకు ఎగబాకింది. కంపెనీకి ఇప్పటివరకిదే అత్యధిక త్రైమాసికాదాయం. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.4 మధ్యంతర డివిడెండ్ చెల్లించనుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,170 ▼	63,410 ▼	86,500 ▼
ముంబై	69,205 ▲	63,392 ▲	78,880 ▼

ఏపీ, తెలంగాణల్లో ఫెడరల్ బ్యాంక్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యాపార కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్నట్లు ప్రైవేట్ రంగంలోని ఫెడరల్ బ్యాంక్ ప్రకటించింది. హైదరాబాద్‌లో బ్యాంక్ తొలి శాఖను ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బ్యాంక్ ఎండీ, సీఈఓ శ్యామ్ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సంలో తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 10 నుంచి 12 శాఖలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయిలో కొత్త శాఖలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీ, తెలంగాణల్లో బ్యాంక్ మొత్తం 78 శాఖలను నిర్వహిస్తోంది. కాగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కోసం హైదరాబాద్‌లో పూర్తి స్థాయి జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో బ్యాంక్ లోన్ బుక్ రూ.10,500 కోట్ల వరకు ఉందన్నారు. అలాగే కస్టమర్ సపోర్ట్ కోసం విశాఖపట్నంలో 1,000 సీట్లతో ఒక కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసన్ తెలిపారు.

ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ

క్యూ1 లాభం 10,461 కోట్లు

- ఏదైనా కంపెనీ కొనుగోలు ద్వారా ప్రవేశించే యోచన

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ రూ.10,461 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.9,544 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం వృద్ధి కనబరిచింది. ఈ క్యూ1లో కంపెనీ మొత్తం ఆదాయం రూ.2,10,910 కోట్లకు పెరిగింది. గత ఏడాదిలో ఇదే సమయానికి రాబడి రూ.1,88,749 కోట్లుగా నమోదైంది. ఈ ఏప్రిల్-జూన్ కాలానికి కంపెనీ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) వార్షిక ప్రాతిపదికన 16.22 శాతం వృద్ధి చెంది రూ.53,58,781 కోట్లకు చేరుకుందని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి తెలిపారు. మొత్తం ప్రీమియం ఆదాయం 16 శాతం పెరిగి రూ.1,13,770 కోట్లుగా నమోదైంది. సాల్వెన్సీ మార్జిన్ 1.99 శాతానికి పుంజుకుంది. ఆరోగ్య బీమా విభాగంలోకి ప్రవేశించే ఆలోచనలో ఉన్నట్లు ఆర్థిక ఫలితాల విడుదల సమావేశంలో మొహంతి తెలిపారు. ఇందుకోసం ఏదైనా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో మెజారిటీ వాటా కొనుగోలు చేయాలని యోచిస్తున్నట్లు మీడియాతో ఆయన చెప్పారు.

సూచీలకు ఆర్‌బీఐ దెబ్బ

ముంబై: దేశీయ ఈక్విటీ సూచీలు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. గురువారం ఆర్‌బీఐ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచటం మార్కెట్ వర్గాలను పూర్తిగా నిరాశపరిచింది. దీంతో రోజంతా మార్కెట్లు ఆటుపోట్లలో సాగాయి. చివరకు బీఎస్ఈ సెన్సెక్స్ 581.79 పాయింట్లు నష్టపోయి 78,886.22 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో ఒక దశలో సూచీ 669.07 పాయింట్లు నష్టంతో 78,798.94 పాయింట్ల స్థాయికి పడిపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 180.05 పాయింట్లు నష్టంతో 24,117 పాయింట్ల వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	430
వరంగల్	397	గోదావరి	426
చిత్తూరు	493	విశాఖపట్నం	430
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	88
వరంగల్	80	గుంటూరు	88
కరీంనగర్	80	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	83
కర్నూలు	80	నెల్లూరు	83
విశాఖపట్నం	84	అనంతపురం	88
గోదావరి	88		

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శుక్రవారం • 9 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com

ఒకప్పుడు అడవులను రక్షించే పాత్రల్లో హీరోలు ఇప్పుడు అటవీ సంపద దోచుకోవడమే హీరోయిజం



- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
- అల్లు అర్జున్‌ను ఉద్దేశించేనా?

ఒకప్పుడు అడవులను రక్షించే కథాంశాలతో వచ్చిన సినిమాలలో హీరోలు నటించేవారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఇందుకు ఉదాహరణగా కన్నడ సినిమా 'గంధదగుడి' చిత్రాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ ఈనాడు అటవీ సంపదను దోచుకోవడమే హీరోయిజంగా సినిమాలు వస్తున్నాయని ఆయన విచారం వ్యక్తంచేశారు. రీల్‌కు, రియాలిటీకి తేడా ఉంటుందన్నారు. పుష్ప సినిమాలో అడవుల్లోని ఎర్రచందనం కొల్లగొట్టే పాత్రలో హీరో అల్లు అర్జున్ నటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను ఉద్దేశించే పవన్‌కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారా అంటూ ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

మానవత్వం చూపాల్సిన తరుణం ఇది

ఇటీవల కురిసిన భారీ వర్షాలు కేరళలోని వయనాడ్‌లో విషాదాన్ని మిగిల్చాయి. కొండ చరియలు విరిగి పడడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. బాధితులను ఆదుకోవడానికి సినీ ప్రముఖులు ముందుకు వచ్చారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్ చరణ్ కోటి రూపాయల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం కేరళ వెళ్లి నేరుగా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలసి విరాళం చెక్కును అందజేశారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మానవత్వం చూపాల్సిన తరుణం ఇది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ వంతుగా కేరళకు సాయం అందించాలి. ఈ దుర్ఘటనను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలి' అని కోరారు.





నాగచైతన్య శోభిత నిశ్చితార్థం

టాలీవుడ్ కథానాయకుడు అక్కినేని నాగచైతన్య తన అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. కొన్నాళ్లుగా వినిపిస్తున్న ఊహాగానాలను నిజం చేస్తూ కథానాయిక శోభితా దూళిపాళ్లతో ఆయన ఏడడుగులు వేయనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం గురువారం ఉదయం హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇరువైపులా కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితులు హాజరయ్యారు. నిశ్చితార్థం ఫొటోలను నాగార్జున సోషల్ మీడియాలో షేర్ చేసి, కాబోయే దంపతులను ఆశీర్వదించాలని కోరారు. 'ఈ రోజు ఉదయం మా అబ్బాయి నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. ఈ మధుర క్షణాలను మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. చాలా సంతోషంగా శోభితను మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాం. మీ ఇద్దరూ ప్రేమ, సంతోషంతో కలకాలం జీవించాలని కోరుకుంటున్నాను' అని నాగార్జున పేర్కొన్నారు. నిశ్చితార్థ వేడుకలో శోభిత ఉప్పాడ పట్టు చీర ధరించగా, నాగచైతన్య పంచెకట్టు, పైన కండువా ధరించి సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు. పలువురు సినీ ప్రముఖులు నాగచైతన్య, శోభితకు అభినందనలు తెలిపారు. మరికొద్ది రోజుల్లో వీరి వివాహం జరగనుంది. సమంతతో విడాకులు తీసుకున్నాక నాగచైతన్య శోభితతో ప్రేమలో పడ్డారనీ, ఇద్దరూ తరచూ కలుసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. పలు సందర్భాల్లో నాగచైతన్య, శోభితా జంటగా కనిపించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. కానీ నిశ్చితార్థం వరకూ వారు ఎక్కడా దీనిపై స్పందించలేదు. నాగచైతన్య, శోభిత కలసి ఒక్క సినిమా కూడా చేయలేదు. స్నేహితుల ద్వారా ఇద్దరికీ పరిచయం అయ్యి అది ప్రేమగా మారిందని సమాచారం. చూసేందుకు ఇంటర్నేషనల్ మోడల్‌లా కనిపించే శోభిత తెలుగమ్మాయే. తెనాలిలో జన్మించారు. కొన్నాళ్లు కుటుంబంతో విశాఖలో ఉన్నారు. ముంబైలో ఉన్నత విద్యను అభ్యసించారు. మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టారు. 2013 ఫెమీనా మిస్ ఇండియా ఎర్త్ టైటిల్ గెలుచుకున్నారు. 2016లో వచ్చిన బాలీవుడ్ చిత్రం 'రామన్ రాఘవన్'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగులో 'గూఢచారి, మేజర్' చిత్రాల్లో నటించారు.

నాడు ప్రేమ ప్రకటన

'ఏ మాయ చేశావే' చిత్రంలో జంటగా నటించిన నాగచైతన్య, సమంత ఏడేళ్ల డేటింగ్ తర్వాత 2017లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 2021లో పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 8న నాగచైతన్యకు తన ప్రేమ ప్రతిపాదన చేశానని సమంత ఓ సందర్భంలో చెప్పారనీ, ఇప్పుడు అదే తేదీన నాగచైతన్య శోభితల నిశ్చితార్థం జరగడం కాకతాళీయమేనా, కావాలనే అలా చేశారా? అనే చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. శోభిత హిందీలో 'సితార' చిత్రం చేస్తున్నారు.

ముందస్తు బెయిల్



నటుడు రాజ్‌తరుణ్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రాజ్‌తరుణ్ తనను ప్రేమించి మోసం చేశాడంటూ లావణ్య అనే మహిళ ఫిర్యాదుపై అతనిపై నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. రాజ్‌తరుణ్ రెండు వారాల్లో నార్సింగ్ ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరుకావాలని, రూ.20 వేల బాండు, రెండు పూచీకత్తులు ఇవ్వాలని జస్టిస్ శ్రీదేవి ధర్మాసనం ఆదేశించింది. 8 వారాల పాటు ప్రతి శనివారం పిటిషనర్ పోలీసుల ఎదుట హాజరుకావాలని షరతు విధించింది. మరోవైపు రాజ్‌తరుణ్ స్నేహితుడు శేఖర్ బాషాతో తనకు ప్రాణహాని ఉందని లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సెట్స్‌లోకి...



పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'హరి హర వీరమల్లు'. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఏ.ఎమ్.రత్నం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆఖరి దశ షూటింగ్‌లో ఉన్న ఈ సినిమా సెట్స్‌లోకి బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఆహ్వానిస్తూ చిత్ర బృందం ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. "పవన్, అనుపమ్ ఖేర్ కలయికలో వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలైట్‌గా ఉండనున్నాయి. అభిమానులకి జీవితాంతం గుర్తుండిపోయే సినిమా ఇది" అని మేకర్స్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

షెకావత్ సాబ్



అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న 'పుష్ప 2' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో హీరోతో పాటు కీలక పాత్రలు పోషిస్తున్న ఆర్టిస్టులు పాల్గొనగా పతాక సన్నివేశాలు తీస్తున్నారు. బన్వర్‌సింగ్ షెకావత్‌గా నటిస్తున్న ఫహాద్ ఫాజిల్ లుక్ పోస్టర్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా గురువారం విడుదల చేశారు. గళ్ల లుంగీ, ఒక చేతిలో గన్, మరో చేతిలో గొడ్డలితో ఫహాద్ కనిపిస్తున్నారు. డిసెంబర్ 6న 'పుష్ప 2' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మిస్తున్నారు.

నిర్మాతగా సంతృప్తినిచ్చింది



'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో నిహారిక కొణిదెల నిర్మాతగా మారారు. యదు వంశీ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిహారిక మీడియాతో ముచ్చటించారు. "కథ విన్న వెంటనే ఈ సినిమాలో భాగం అవ్వాలనుకున్నాను. ఒక ఊరిలో జాతర నేపథ్యంలో మూడు తరాలకు చెందిన కథగా దర్శకుడు తెరకెక్కించారు. అందరికీ సినిమా విపరీతంగా నచ్చుతుంది. ఇందులో ఎన్నో క్యారెక్టర్లు ఉన్నా.. ప్రతీ పాత్రకూ విలువ ఉంటుంది. ప్రేక్షకులు ఏదో ఒక పాత్రతో కచ్చితంగా ట్రావెల్ అవుతారు. ఒక నిర్మాతగా ఈ సినిమా నాకెంతో సంతృప్తినిచ్చింది" అని చెప్పారు.

రజత నీరాజనం

భారత త్రోయర్ చోప్రాకు టైటిల్ మిస్
ఒలింపిక్ రికార్డుతో పాక్ ఆటగాడు నదీమ్‌కు స్వర్ణం


నదీమ్

కోట్లాది మంది భారతీయులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూసిన ఘట్టం ముగిసింది. ఇప్పటిదాకా పారిస్ గేమ్స్‌లో భారత్‌కు దక్కని స్వర్ణ పతకాన్ని ఖాయం చేస్తాడనుకున్న నీరజ్ చోప్రా రజతంతో సరిపెట్టాడు. ఈసారి అతడి బల్లెం వేగం కాస్త నెమ్మదించింది. రెండో ప్రయత్నంలో 89.45మీ. దూరం విసరడంతో రెండో స్థానంతో సంతృప్తి పడాల్సి వచ్చింది. అటు అతడి ఆరు ప్రయత్నాల్లో ఐదు ఫాల్స్ కావడం అభిమానులను నిరాశపర్చింది. అయితే ఎవరూ ఊహించని విధంగా నీరజ్ ప్రధాన ప్రత్యర్థి నదీమ్ అర్షద్ 92.97మీ. దూరంతో ఒలింపిక్ రికార్డు నెలకొల్పడంతో స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

పారిస్: భారత పతకాల పట్టికలో తొలిసారిగా రజతం చేరింది. గురువారం అర్ధరాత్రి జరిగిన జావెలిన్ త్రో ఫైనల్లో స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. క్వాలిఫయింగ్‌లో టాప్ షోతో స్వర్ణంపై అంచనాలు పెంచినా.. కీలక పోరులో కాస్త వెనుకబడ్డాడు. మొత్తం ఆరు ప్రయత్నాల్లో కేవలం ఒక్కదాన్ని మాత్రమే సరిగ్గా వినియోగించుకున్నాడు. అయితే రెండో ప్రయత్నంలో 89.45మీ. దూరం విసిరి రజతం అందుకున్నాడు. భారత్ ఖాతాలో ఇది ఐదో పతకం. పాక్ త్రోయర్ నదీమ్ అర్షద్ 92.97మీ.తో స్వర్ణం, ఆండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) 88.54 మీ. దూరంతో కాంస్యం దక్కించుకున్నారు.

అర్షద్ అదుర్స్.. నీరజ్ సెకండ్: క్వాలిఫికేషన్‌లో అందరికన్నా బెస్ట్‌గా నీరజ్ చోప్రా 89.34మీ. దూరం జావెలిన్ విసిరాడు. దీంతో క్రీడాభిమానులంతా నీరజ్‌పై మరింత అంచనాలు పెంచేసుకున్నారు. అయితే చోప్రాకు పాక్ నుంచి అర్షద్ నదీమ్, జాకూబ్ వాలెచ్ (చెక్), వెబెర్ (జర్మనీ), ఆండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) నుంచి గట్టి పోటీ ఎదురవుతుందనే అంచనాలు నెలకొన్నాయి. దీంతో నీరజ్ స్వర్ణంపై అందరికీ ఉత్కంఠ కొనసాగింది. ఫైనల్లో 12 మంది పోటీపడగా చోప్రా తన మూడు ప్రయత్నాల్లో తొలిదాన్ని ఫౌల్‌గా మలిచాడు. అయితే రెండోసారి మాత్రం 89.45మీ.తో తన క్వాలిఫికేషన్ దూరాన్ని సైతం అధిగమించి ఫ్యాన్స్‌ను ఖుషీ చేశాడు. అలాగే అతడికిది సీజన్ బెస్ట్. అయితే నీరజ్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న నదీమ్ అర్షద్ కూడా తొలి ప్రయత్నం ఫౌల్‌గా ముగిసింది. కానీ రెండోసారి బల్లెం చేత పట్టిన తను నమ్మశక్యంకాని రీతిలో ఏకంగా 92.97మీ. దూరం విసిరి ఒలింపిక్ రికార్డుతో అదరగొట్టాడు. ఈ ఫీట్‌తో 2008లో 90.57మీ. దూరంతో ఆండ్రీస్ (డెన్మార్క్) నెలకొల్పిన రికార్డు గల్లంతైంది. దీంతో ఈసారి స్వర్ణ విజేత ఎవరో అందరికీ అర్థమైపోయింది. అర్షద్ మొత్తంగా రెండుసార్లు 90 మీటర్లకుపైగా విసరడం విశేషం.

చివరి 8లోనూ..: తొలి మూడు ప్రయత్నాల తర్వాత పోటీల నుంచి నలుగురు ఎలిమినేట్ కాగా మెడల్ కోసం ఎనిమిది మంది మిగిలారు. ఇక ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య తిరిగి జావెలిన్ తీసుకున్న నీరజ్ ఈసారి కూడా ఆత్మవిశ్వాసంతో కనిపించలేదు. దీంతో చివరి మూడు త్రోలను కూడా ఫౌల్‌గా వేసి నిరుత్సాహపరిచాడు.



ఎందుకిలా ?

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఈసారి ఒలింపిక్స్‌లో మనకు పక్కా పతకం..అది కూడా స్వర్ణం అని భారతీయులంతా నొక్కిచెప్పిన ఒకే ఒక ఈవెంట్ పురుషుల జావెలిన్‌త్రో. కానీ అనూహ్యంగా స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా విఫలమయ్యాడు. క్వాలిఫికేషన్‌లో అదరగొట్టిన నీరజ్..అసలుసిసలు సమరంలో తడబాటుకు లోనయ్యాడు. దాంతో రజత పతకంతోనే అతడు సంతృప్తి చెందాల్సి వచ్చింది. ఈసారి ఒలింపిక్స్‌లో పసిడి పతకం కోసం కోట్లాదిమంది భారతీయులు ఆశగా ఎదురు చూస్తున్న వేళ నీరజ్ ఫైనల్ బరిలో దిగాడు. పెద్ద సంఖ్యలో హాజరైన ఫ్యాన్స్ చప్పట్లతో ఉత్సాహపరుస్తుండగా..బల్లెం చేపట్టిన నీరజ్ తొలి యత్నంలో ఫౌల్ చేయడంతో అంతా నిరుత్సాహపడ్డారు. అయితే గత కొన్ని సీజన్లుగా అంతర్జాతీయ వేదికలపై అమోఘంగా రాణిస్తుండడంతో మిగిలిన ఐదు త్రోలలో నీరజ్ అద్భుతం చేస్తాడని ఆశించారు. ఇక రెండో యత్నంలో 89.45 మీ. దూరం జావెలిన్‌ను విసిరిన నీరజ్ మళ్లీ రేసులోకి వచ్చినట్టే కనిపించాడు. కానీ ఆపై అతడి ఫామ్ మరింత దిగజారింది. సరైన రనప్ అందుకోవడంలో విఫలమైన అతడు మిగిలిన ఐదు ప్రయత్నాలలో ఫౌల్స్ చేశాడు. దాంతో భారతీయులంతా నిరాశలో మునిగారు. అయితే నాలుగు కాంస్యాలకే పరిమితమైన భారత్‌ను రజతంతో పట్టికలో ఒకింత మెరుగైన స్థితిలో నిలిపాడు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో కేవలం ఒక్కటంటే ఒక్కటే త్రోలో ఏకంగా 89.34 మీ. దూరం బల్లెం విసిరిన నీరజ్ ఫైనల్‌కు చేరాడు. ఫైనల్‌కు చేరేందుకు జావెలిన్‌ను విసరాల్సిన కనీస దూరం 84 మీటర్లే కావడం గమనార్హం. ఫైనల్లో తలపడే మేటి 12 మంది జావెలిన్ త్రోయర్లకు అందనంత దూరంలో చోప్రా నిలవడం విశేషం. ఈ నేపథ్యంలో ఫైనల్లోనూ అంతకంటే మెరుగైన ప్రదర్శనతో స్వర్ణ పతకంతో నీరజ్ మరోసారి చరిత్ర లిఖిస్తాడని అంచనా వేశారు. కానీ ఫైనల్ అందుకు పూర్తి విరుద్ధంగా సాగింది. రెజ్లర్ వినేశ్ ఫొగట్ డిస్‌క్వాలిఫికేషన్ వివాదం పారిస్‌లో తలపడుతున్న భారత అథ్లెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. అది సద్దుమణగకముందే అంతిమ్ పంఘల్ వివాదం తెరపైకి వచ్చింది. ఈ రెండు ఘటనలు నీరజ్ చోప్రా ప్రదర్శనపై ప్రభావం చూపినట్టు కనిపిస్తోంది.



హాకీ వీరులు మురిపించారు. 44 ఏళ్ల తర్వాత ఫైనల్ పోరుకు అర్హత సాధించే అవకాశం కాస్తలో చేజార్చుకున్నా.. కోట్లాది మంది భారతీయుల మదిని పులకిస్తూ కాంస్య పతకాన్ని నిలబెట్టుకున్నారు. 52 ఏళ్ల తర్వాత జట్టు వరుసగా రెండు పతకాలను సాధించి తమ నిలకడను కూడా చాటుకుంది. అంతేనా.. వినేశ్ ఫొగట్ వ్యవహారంతో బరువెక్కిన భారత హృదయాలకు ఈ గెలుపుతో కాస్త సాంత్వన చేకూర్చినట్టయ్యింది. భారత హాకీకి గ్రేట్ వాల్‌గా నిలిచిన కీపర్ శ్రీజేశ్ తన చివరి మ్యాచ్‌లోనూ ఆపద్బాంధవ పాత్ర పోషించగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ సూపర్ ఫామ్‌తో అదుర్స్ అనిపించుకున్నాడు.

హాకీకి.. పతక హారతి

హాకీ అంటే ఆట మాత్రమే కాదు.. అదో భావోద్వేగం. అందుకే గతంలో ఏకంగా ఎనిమిదిసార్లు భారత్‌కు ఒలింపిక్ పసిడి పతకాలు అందించిన హాకీ దిగ్గజాలను మనమంతా ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. వాళ్ల జ్ఞాపకాలను మదిలో దాచుకున్నాం. ఆ తర్వాత నాలుగు దశాబ్దాలుగా ఒలింపిక్స్‌లో ఒక్క పతకమూ రాకపోవడంతో ఎంతో ఆవేదనకు గురయ్యాం. ఇంకెన్నాళ్లీ మనోవ్యథ అనుకుంటున్న తరుణంలో.. మూడేళ్ల క్రితం టోక్యోలో మన్‌ప్రీత్‌సింగ్ సారథ్యంలోని జట్టు కాంస్య పతకంతో చరిత్ర సృష్టించి చిద్విలాసం చేసింది. హాకీ అభిమానులకు అంతులేని ఆనందాన్ని అందించింది. ఇదిలో మళ్లీ వెంటనే పారిస్‌లోనూ ఆ తరహా ప్రదర్శనను పునరావృతం చేసి ఆ సంతోషాన్ని రెట్టింపు చేసింది. హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో జట్టు అద్భుతంగా ఆడి వరుసగా రెండోసారి ఒలింపిక్ పతకంతో పూర్వవైభవానికి గట్టి పునాదులు వేసింది. ఒకప్పుడు గొప్పగా వెలిగి ఆపై మసకబారిన టీమిండియాకు ఇకనుంచి అన్నీ మంచి శకునములే!

ఒలింపిక్స్‌లో వరుసగా రెండోసారి పతకంతో చరిత్ర సృష్టించిన భారత పురుషుల హాకీ జట్టు ఈసారి సమష్టిగా పోరాడి ఫలితాన్ని రాబట్టింది. అనుభవజ్ఞులు, యువకులతో సమతూకమైన జట్టుగా బరిలోకి దిగిన భారత్ టోర్నమెంట్ ఆద్యంతం పోరాటతత్వాన్ని ప్రదర్శిస్తూ ముందుకెళ్లింది. కఠినమైన ప్రత్యర్థులు ఎదురైనా ఏమాత్రం వెరవని హర్మన్‌సేన.. ప్రతి మ్యాచ్‌లోనూ చావోరేవో అన్నట్టుగా పోరాడింది. ఆరంభ పోరులో న్యూజిలాండ్‌ను ఓడించి పారిస్ క్రీడలను ఘనంగా ప్రారంభించిన టీమిండియా.. రెండోమ్యాచ్‌ను అర్జెంటీనాతో డ్రాగా ముగించింది. ఆ తర్వాత ఐర్లాండ్‌పై గెలిచి, డిఫెండింగ్ చాంపియన్ బెల్జియంతో ఓడినా.. ప్రీ క్వార్టర్స్‌లో టోక్యో ఒలింపిక్స్ రన్నరప్ ఆస్ట్రేలియాను చిత్తుచేసిన తీరు అమోఘం. విశ్వక్రీడల్లో 52 ఏళ్ల తర్వాత కంగారూలపై తొలి విజయాన్ని నమోదుచేసిన భారత్.. అదే జోరులో క్వార్టర్స్‌లో గ్రేట్ బ్రిటన్‌పై మరపురాని ప్రదర్శనతో అభిమానులను అలరించింది. స్కోర్లు సమమైనా, పెనాల్టీ షూటౌట్‌లో ఫలితాన్ని రాబట్టిన తీరును మరచిపోగలమా! సెమీఫైనల్లో జర్మనీ చేతిలో పరాజయం ఎదురైనా, కాంస్య పోరులో స్పెయిన్‌పై విజృంభించి పతకం దక్కించుకుంది. ప్రధానంగా సారథి హర్మన్‌ప్రీత్, గోల్‌కీపర్ శ్రీజేష్ జట్టును ముందుండి నడిపించిన తీరు సర్వదా ప్రశంసనీయం. సహచరుల్లో స్ఫూర్తి నింపుతూ, పోరాటమే ఆయుధంగా ముందుకు సాగుతూ, జట్టు ను విజయాల బాట నడిపించాడు హర్మన్‌ప్రీత్. టోక్యోలో పతకం సాధించడంలోనూ కీలకపాత్ర పోషించిన 28 ఏళ్ల హర్మన్.. పారిస్‌లో అంతకుమించిన ఆటతీరుతో చెలరేగాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ డ్రాగ్‌ఫ్లికర్లలో ఒకడిగా పేరుగాంచిన హర్మన్.. జట్టు ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ గోల్ చేశాడు. ఓవరాల్‌గా టోర్నీలో పది గోల్స్‌తో విజృంభించి జట్టు పతకం దక్కించుకోవడంలో కీలక భాగస్వామయ్యాడు. ఇక, గోల్‌కీపర్ శ్రీజేష్ గతేడాది ప్రపంచకప్ క్వార్టర్స్‌లో న్యూజిలాండ్ చేతిలో పెనాల్టీ షూటౌట్‌లో ఓడిన టీమిండియా.. ఆ తర్వాత కొత్త కోచ్ క్రెగ్ ఫుల్టన్ శిక్షణలో క్రమంగా మెరుగుపడింది. ఆసియా క్రీడల ఫైనల్లో జపాన్‌పై ఆరంభంలో ప్రశాంతంగా ఆడి ఆపై దూకుడు పెంచి పైచేయి సాధించింది. ఇటీవలికాలంలో ఆటలో డిఫెన్స్ పరంగానూ మెరుగుపడింది. పారిస్‌లో ఒత్తిడిని దాటుకొని వరుసగా రెండో పతకాన్ని ముద్దాడింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఒలింపిక్స్ హాకీలో భారత్

1928	స్వర్ణం
1932	స్వర్ణం
1936	స్వర్ణం
1948	స్వర్ణం
1952	స్వర్ణం
1956	స్వర్ణం
1960	రజతం
1964	స్వర్ణం
1968	కాంస్యం
1972	కాంస్యం
1980	స్వర్ణం
2020	కాంస్యం
2024	కాంస్యం



హాకీ వీరుల గర్జన

స్పెయిన్‌పై 2-1తో విజయం

అదరగొట్టిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ • ఫేర్‌వెల్ మ్యాచ్‌లోనూ కీపర్ శ్రీజేశ్ సూపర్ షో



పారిస్: భారత హాకీ జట్టు వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ పతకంతో మెరిసింది. గురువారం స్పెయిన్‌తో ఆఖరి సెకను వరకు ఉత్కంఠభరితంగా సాగిన కాంస్య పతక పోరులో భారత్ 2-1 తేడాతో గెలిచింది. తాజా ఒలింపిక్స్‌లో దేశానికిది నాలుగో పతకం. అయితే ప్రత్యర్థికే తొలి ఆధిక్యం దక్కినా.. బెదిరిపోకుండా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 30, 33వ నిమిషాల్లో చేసిన రెండు గోల్స్ జట్టుకు విజయాన్నందించాయి. స్పెయిన్‌కు 18వ నిమిషంలోనే మార్క్ మిరల్లెస్ గోల్ అందించాడు. స్పెయిన్‌కు ఏకంగా 9 పెనాల్టీ కార్నర్‌లు లభించినా ఒక్క గోల్ కూడా ఇవ్వకుండా భారత్ అడ్డుకోగలిగింది. అటు మన జట్టు మాత్రం ఆరింట్లో రెండింటిని సఫలం చేసుకుంది. గతంలో భారత హాకీ జట్టు 1968, 1972 ఒలింపిక్స్‌లోనూ కాంస్యాలు సాధించింది.

వెనుకబడినా.. పుంజుకుని

తొలి క్వార్టర్‌లో భారత్-స్పెయిన్‌ల నుంచి గోల్స్ నమోదు కాలేదు. కానీ రెండో క్వార్టర్ ఆరంభంలో 18వ నిమిషంలో స్పెయిన్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీన్ని మిరల్లెస్ టాప్ లెఫ్ట్ కార్నర్‌లో గోల్ పోస్టులోకి పంపడంతో భారత్ షాక్‌లో మునిగింది. ఆ తర్వాత 25వ నిమిషంలో స్పెయిన్‌కు వెనువెంటనే రెండు పెనాల్టీ కార్నర్‌లు లభించినా భారత డిఫెన్స్ వమ్ము చేసింది. 29వ నిమిషంలో భారత్‌కు తొలి పీసీ లభించినా వినియోగించుకోలేకపోయింది. అయితే రెండో క్వార్టర్ ఆఖరి సెకన్లలో లభించిన రెండో పీసీని హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలచడంతో ప్రథమార్ధం 1-1తో ముగిసింది. ఇక మూడో క్వార్టర్ ఆరంభమైన కాసేపటికే వీడియో రిఫరల్ ద్వారా లభించిన పీసీని హర్మన్ మరో గోల్‌గా మలిచాడు. దీంతో 2-1తో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. తదనంతరం ఇరు జట్లు గోల్స్ కోసం హోరాహోరీగా తలపడ్డాయి. అలాగే 40వ నిమిషంలో స్పెయిన్‌కు గోల్ ప్రకటించినా.. భారత్ రిఫరల్‌కు వెళ్లింది. దీంట్లో బంతి నెట్‌లోకి వెళ్లకముందే స్పెయిన్ ప్లేయర్ బాడీని తాకినట్టు తేలింది. అటు గోల్ కోసం స్పెయిన్ మరింత కసిగా ఎదురుదాడికి దిగడంతో ఆఖర్లో హైడ్రామా నెలకొంది. 59, 60వ నిమిషాల్లోనే కాకుండా మ్యాచ్ మరో 44 సెకన్లలో ముగుస్తుందనగా స్పెయిన్‌కు పీసీ లభించడంతో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. అయితే కీపర్ శ్రీజేశ్‌తో సూపర్‌మ్యాన్ తరహాలో వీటన్నింటిని నుంచి జట్టును కాపాడడంతో భారత్ కాంస్య సంబరాల్లో మునిగింది.

ఏ జట్టునైనా జయించగలం

'వరుసగా రెండు కాంస్య పతకాలు సాధించడం గొప్ప విషయం. ప్రపంచ హాకీలో భారత్ పురోగతికి ఈ విజయం నిదర్శనం. ఏ జట్టునైనా ఓడించగలమని నిరూపించాం. ఇది జట్టుకు దేశానికి ఎంతో గొప్ప విషయం'

- కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్

పర్‌ఫెక్ట్ ఫేర్‌వెల్

విజయానంతరం భారత ఆటగాళ్లు శ్రీజేష్‌కు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. తమ భుజాలపై ఎత్తుకొని గోల్‌పోస్ట్‌పై కూర్చోబెట్టారు. హాకీ స్టిక్‌తో జేజేలు పలికి ఘనమైన వీడ్కోలు పలికారు.

మీ పట్టుదల అమోఘం. ఈ విజయం తరతరాలు గుర్తుండిపోతుంది. ఒలింపిక్స్‌లో వరుసగా రెండో పతకం సాధించిన సందర్భం ఎంతో ప్రత్యేకం. హాకీ జట్టుకు శుభాకాంక్షలు.

-ప్రధాని మోదీ

స్పెయిన్‌పై విజయం మన హాకీ జట్టు నిబద్ధతకు తార్కాణం. అత్యుత్తమ ప్రదర్శనతో దేశానికి గర్వ కారణంగా నిలిచారు.

-క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య

సెమీఫైనల్ ఓటమిని జీర్ణించుకోవడం ఆషామాషీ కాదు. అయినా చాంపియన్లవలే పుంజుకొని కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. ఈ విజయానికి మీరు పూర్తిగా అర్హులు.

-సచిన్ టెండూల్కర్

హాకీ ఇండియా నజరానా

కాంస్య పతకం సాధించిన హర్మన్‌ప్రీత్ సేనకు హాకీ ఇండియా నజరానా ప్రకటించింది. జట్టులోని ఒక్కో సభ్యుడికి రూ. 15 లక్షలు, సహాయ సిబ్బందిలో ఒక్కొక్కరికీ రూ. 7.5 లక్షల రూపాయల ప్రైజ్‌మనీని అందజేయనున్నట్టు తెలిపింది. కాగా ఒలింపిక్ క్రీడల చరిత్రలో భారత్‌కిది 13వ పతకం.

ది గ్రేట్ వాల్



భారత హాకీ జట్టు వరుసగా రెండో ఒలింపిక్ పతకం సాధించడంలో గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్‌ది ప్రత్యేకమైన పాత్ర. పరాజయానికి, పతకానికి మధ్య అడ్డుగోడలా నిలబడి భారత హాకీ జట్టుకు ఎన్నోసార్లు ఆనందాన్ని పంచిన గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ ఆఖరి మ్యాచ్‌లోనూ తనదైన మార్క్ చూపించాడు. టోక్యో క్రీడల తరహాలోనే పారిస్‌లోనూ తనదైన ముద్ర వేచి ఆఖరి మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకున్నాడు.

కేరళలోని ఎర్నాకులం జిల్లా కిజక్కంబలం గ్రామానికి చెం దిన 36 ఏళ్ల శ్రీజేష్.. మొదట రన్నింగ్, లాంగ్ జంప్, వాలీబాల్ క్రీడలు ఆడాడు. పన్నెండేళ్ల వయసులో తన పాఠశాల పీఈటీ సూచనతో హాకీని ఎంచుకున్నాడు. పేద రైతు కుటుంబం నుంచి వచ్చిన శ్రీజేష్‌కు మొదట్లో గోల్‌కీపింగ్ కిట్‌ను కొనేందుకు కూడా డబ్బులు లేవు. తన తండ్రి ఆవును అమ్మి సమకూర్చిన డబ్బులతో కిట్‌ను కొనుకున్నాడు. 2006లో తొలిసారి సీనియర్ జట్టులో చోటు దక్కించుకున్న శ్రీజేష్.. 2011 నుంచి జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగాడు. శ్రీజేష్ వచ్చేనాటికి గోల్‌కీపర్లుగా అడ్రియన్ డిసౌజా, భరత్ ఛెత్రి జట్టులో పాతుకుపోయి ఉన్నారు. దీంతో అప్పుడప్పుడు మాత్రమే జట్టులో చోటు దక్కించుకున్న శ్రీజేష్. 2011లో చైనా వేదికగా జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ రూపంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. పాకిస్థాన్‌తో జరిగిన ఆ తుదిపోరులో రెండు పెనాల్టీ స్ట్రోక్‌లను నిలువరించి జట్టును గెలిపించడంతో అందరి దృష్టి శ్రీజేష్‌పై పడింది. అతని గోల్‌కీపింగ్ నైపుణ్యాన్ని చూసి దిగ్గజ ఆటగాళ్లు సైతం అబ్బురపడ్డారు. అప్పటినుంచి వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాని శ్రీజేష్.. తర్వాత ప్రతి మ్యాచ్‌లోనూ భారత జట్టుకు ప్రాధాన్య గోల్‌కీపర్‌గా మారాడు. తనదైన ప్రతిభతో ప్రపంచ హాకీ అత్యుత్తమ గోల్‌కీపర్లలో ఒకడిగా తన పేరు సార్థకం చేసుకున్నాడు. శ్రీజేష్.. తన 18 ఏళ్ల కెరీర్‌లో 336 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి నాలుగు ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించాడు. రెండు ఒలింపిక్ కాంస్యాలు, చాంపియన్స్ ట్రోఫీలో రెండు రజతాలు.. ఆసియా కప్‌లో రజతం.. ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు ఓ కాంస్యం, కామన్వెల్త్ క్రీడల్లో రెండు రజతాలు గెలుచుకున్న జట్టులో సభ్యుడైన శ్రీజేష్. భారత హాకీ చరిత్రలో 'ది గ్రేట్ వాల్'గా చిరస్థాయిగా నిలిచిపోతాడు. 2017లో పద్మశ్రీ అందుకున్న శ్రీజేష్.. 2021లో ఖేల్‌రత్న పురస్కారాన్ని దక్కించుకున్నాడు. 2022లో వరల్డ్ గేమ్స్ అథ్లెట్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

హాకీ విజేత నెదర్లాండ్స్



పురుషుల హాకీ ఒలింపిక్ చాంపియన్‌గా నెదర్లాండ్స్ అవతరించింది. గురువారం రాత్రి జరిగిన ఫైనల్లో నెదర్లాండ్స్ షూటౌట్‌లో 3-1తో పటిష్ఠ జర్మనీపై విజయం సాధించి స్వర్ణ పతకం అందుకుంది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. దీంతో అనివార్యమైన షూటౌట్‌లో నెదర్లాండ్స్ జట్టు పురుషుల ఒలింపిక్ టైటిల్‌ను గెలవడం 2000 తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం.

లైల్స్‌కు షాక్

200 మీ. చాంపియన్ టెబోగో



పారిస్: 200 మీటర్ల రేసులో అతడు తిరుగులేని రన్నర్. టోక్యో ఒలింపిక్స్ ఫైనల్ తర్వాత జరిగిన రేసుల్లో అతడికి ఓటమన్నదే లేదు. పైగా..పారిస్ ఒలింపిక్స్‌లో 100 మీటర్ల స్ప్రింట్‌లో పసిడి పతకం గెలుపొందాడు. ఆపై 200 మీటర్ల రేసుతో అరుదైన 'డబుల్'పై కన్నేశాడు. కానీ హాట్‌ఫేవరెట్‌గా 200 మీటర్ల బరిలో దిగిన అమెరికా స్టార్ నోవా లైల్స్‌కు ఊహించని షాక్ తగిలింది. గురువారం అర్ధరాత్రి జరిగిన పురుషుల 200 మీటర్ల స్ప్రింట్ ఫైనల్లో బోట్స్‌వానాకు చెందిన లెసిల్ టెబోగో..ప్రపంచ చాంపియన్ లైల్స్ టైటిల్ ఆశలకు గండికొట్టి సంచలనం సృష్టించాడు. 19.46 సెకన్ల సీజన్ అత్యుత్తమ సమయంతో గమ్యం చేరిన టెబోగో స్వర్ణ పతకం ఎగరేసుకుపోయాడు. 19.62 సెకన్ల టైమింగ్‌తో అమెరికాకు చెందిన బెడ్నెరెక్ రజతం దక్కించుకోగా.. 19.72 సెకన్లతో లైల్స్ కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. గత టోక్యో విశ్వక్రీడల్లోనూ లైల్స్ కాంస్య పతకానికే పరిమితమైన సంగతి తెలిసిందే.

పారిస్ ఒలింపిక్స్ (జూలై 26 - ఆగస్టు 11)


పారిస్‌లో నేటి భారతం



గోల్ఫ్: మహిళల వ్యక్తిగత విభాగం (అదితీ అశోక్, దీక్షా డాగర్) - మ.12.30 గం.
అథ్లెటిక్స్: మహిళల 4x400 మీ. రిలే రౌండ్-1 (భారత జట్టు)- మ.2.10 గం.; పురుషుల 4x400మీ. రిలే రౌండ్ 1 (భారత జట్టు) - మ.2.35 గం.
రెజ్లింగ్: పురుషుల 57కి. ఫ్రీస్టయిల్ కాంస్య పతకపోరు (అమన్ సెహ్రావత్xడారియన్) - రాత్రి 9.45 గం.

ఇతర పతకాంశాలు

టేబుల్ టెన్నిస్: పురుషుల టీమ్ కాంస్య పోరు (ఫ్రాన్స్ x జపాన్) -మ.1.30 గం.; స్వర్ణ పతక మ్యాచ్ (చైనాxస్వీడన్)-సా.6.30 గం.
హాకీ: మహిళల కాంస్య పోరు (అర్జెంటీనాxబెల్జియం) - సా.5.30 గం.; స్వర్ణ పోరు: (నెదర్లాండ్స్ x చైనా) - రా.11.30 గం.
ఫుట్‌బాల్: పురుషుల స్వర్ణ పోరు (ఫ్రాన్స్xస్పెయిన్) - రా.9.30 గం.
అథ్లెటిక్స్: మహిళల, పురుషుల 4x100 రిలే ఫైనల్స్-రాత్రి 11 గం; 11.17 గం.లకు; మహిళల షాట్‌పుట్ ఫైనల్ - రా. 11.07 గం.; మహిళల 400 మీ. ఫైనల్ - 11.30 గం.; పురుషుల ట్రిపుల్ జంప్ ఫైనల్-రాత్రి 11.43 గం.



అమ్మా.. నన్ను క్షమించు

నాకిక పోరాడే శక్తిలేదు

కెరీర్‌కు రెజ్లర్ వినేశ్ ఫొగట్ వీడ్కోలు

పారిస్: విధి ఆడిన క్రూరమైన ఆటలో.. ఘోరంగా ఓడిన రెజ్లర్ వినేశ్ ఫొగట్ (29).. ఏకంగా తన కెరీర్‌కే వీడ్కోలు పలికింది. ఒలింపిక్ పతకం సాధించాలనే జీవితకాలపు కల కల్లలవడంతో.. అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెబుతున్నట్టు గురువారం సోషల్ మీడియాలో ప్రకటించింది. 50 కిలోల విభాగంలో ఫైనల్ చేరి పతకం ఖాయం చేసుకొన్న వినేశ్‌కు బుధవారం జరగాల్సిన బౌట్ ముందు భారీ షాక్ తగిలింది. నిర్దేశించిన బరువుకన్నా 100 గ్రాములు ఎక్కువగా ఉందనే కారణంతో ఆమెపై అనర్హత వేటు పడింది. వంద గ్రాముల కింద.. తన రెండు దశాబ్దాల స్వప్నం శిథిలం కావడంతో తీవ్ర నిర్వేదానికి గురైన ఫొగట్.. కెరీర్‌ను వీడాలనే కఠిన నిర్ణయం తీసుకొంది. ఈ ప్రయాణంలో తనకు మద్దతుగా నిలిచిన అందరినీ క్షమాపణలు కోరింది. తన తల్లి ప్రేమలతను తలచుకొని ఎంతో భావోద్వేగానికి గురైంది. 'అమ్మా.. రెజ్లింగ్ గెలిచింది.. నేను ఓడిపోయా. దయచేసి నన్ను క్షమించు. నీ కల.. నా ధైర్యం, అన్నీ సర్వనాశనమయ్యాయి. ఇక నాకు పోరాడే శక్తి లేదు. గుడ్‌బై రెజ్లింగ్ 2001-2024. మీ అందరికీ ఎంతో రుణపడి ఉంటా' అని పోస్టు చేసింది. బరువు తగ్గించుకోవడం కోసం కనీసం నీటిని కూడా తీసుకోకుండా తీవ్రంగా కసరత్తులు చేయడంతో నీరసపడిన వినేశ్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉంది.



వినేశ్‌ను కలిసిన అభినవ్ బింద్రా

ఎప్పటికీ విజేతవే..

ఫొగట్‌కు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. 'నువ్వెప్పుడూ విజేతవే. నువ్వు ఓడలేదు.. కానీ ఓడిపోయావు' అని టోక్యో పతక రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా ఎక్స్‌లో పోస్టు చేశాడు. అయితే, ఆమె శ్రేయోభిలాషులు, బంధువులు మాత్రం రిటైర్మెంట్ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 2028 లాస్ ఏంజిల్స్ క్రీడలపై దృష్టిపెట్టాలని ద్రోణాచార్య అవార్డు గ్రహీత మహావీర్ ఫొగట్ కోరాడు. ఆవేశంగా నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికాడు. మాజీ షూటర్ రాజ్యవర్ధన్ రాథోడ్ కూడా సవాళ్లను ఎదుర్కొని ధైర్యంగా నిలబడమని సూచించాడు. సినీనటులు ధర్మేంద్ర, ఆలియా భట్, కరీనా కపూర్ కూడా ఫొగట్‌కు మద్దతుగా ఎక్స్‌లో పోస్టులు చేశారు.


భారమైన జ్ఞాపకాలు


విశ్వక్రీడలు అనగానే ఏ అథ్లెట్ జీవితంలోనైనా గొప్ప మైలురాళ్లు కనిపిస్తాయి. కానీ, వినేశ్ కెరీర్‌లో మాత్రం అత్యంత బాధాకరమైన జ్ఞాపకాలు. 2016లో తొలిసారి రియో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగగా.. క్వార్టర్స్‌లో కాలి లిగమెంట్ గాయంతో విలవిల్లాడుతూ స్ట్రెచర్‌పై నిష్క్రమించింది. అప్పుడు ఆమె వయసు 21 ఏళ్లే కావడంతో కోలుకొని మళ్లీ మ్యాట్‌పైకి అడుగుపెట్టింది. టోక్యో క్రీడలను కొవిడ్ వెంటాడడంతో సరైన సన్నాహకాలు లేకుండా బరిలోకి దిగి.. క్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది. అయితే, పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొడానికి ఓ యుద్ధమే చేసింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఏడాదిపైగా ధర్నాలు, నిరసనలు చేసిన ఫొగట్.. విశ్వక్రీడల బెర్త్ కోసం తన వెయిట్ కేటగిరీని కూడా తగ్గించుకొంది. అలుపెరుగని పోరాటం చేసినా.. చివరకు గుండె కోతే మిగిలింది.

సెమీస్‌లో ఓడిన అమన్

నేడు కాంస్యపోరుకు సై

పురుషుల 57 కిలోల కేటగిరీలో అమన్ సెహ్రావత్ ఫైనల్ చేరడంలో విఫలమయ్యాడు. సెమీస్‌లో అమన్ 0-10తో రిహిగూచి (జపాన్) చేతిలో చిత్తయ్యాడు. దీంతో శుక్రవారం జరిగే కాంస్య పోరులో డారియన్ క్రూజ్ (ప్యూర్టోరికో)తో తలపడనున్నాడు. క్వార్టర్స్‌లో మాజీ వరల్డ్ చాంపియన్ జెలింఖాన్ అబ్‌అకరోవ్ (అల్బేనియా)పై 12-0తో గెలిచాడు. మహిళల 57 కిలోల బౌట్ ప్రీక్వార్టర్స్‌లో అన్షు మాలిక్ 2-7తో హెలెన్ లూయిస్ (అమెరికా) చేతిలో పరాజయం పాలైంది.






స్టేడియంలోనే పెళ్లి ప్రతిపాదన

పారిస్: ఫ్రెంచ్ రన్నర్ అలిస్ ఫింటో స్టేడియంలోనే తన బాయ్ ఫ్రెండ్‌కు రొమాంటిక్‌గా ప్రపోజ్ చేసి ఆశ్చర్యపర్చింది. తన స్టీపుల్ చేజ్ రేస్ ముగిసిన తర్వాత 'లవ్ ఇన్ పారిస్' పిన్‌ను అతడి టీషర్ట్‌కు గుచ్చింది. 'నా లక్కీ నెంబర్ 9. ఇద్దరం తొమ్మిదేళ్లుగా సహజీవనం చేస్తున్నాం. రేస్‌ను 9 నిమిషాలలోపు పూర్తి చేస్తే పెళ్లి ప్రపోజల్ చేయాలని ముందుగానే నిర్ణయించుకొన్నా'నని 33 ఏళ్ల ఫింటో చెప్పింది. అలిస్ రేస్‌ను 8 నిమిషాల 58.67 సెకన్ల టైమింగ్‌తో ముగించింది. ఆ వెంటనే స్టాండ్స్‌లో ఉన్న తన ప్రేమికుడు, స్పెయిన్ ట్రై అథ్లెట్ బ్రూనో మార్టినెజ్ దగ్గరకు పరిగెత్తుకుంటూ వెళ్లి.. మోకాళ్లపై కూర్చొని పెళ్లాడమని కోరింది. మార్టినెజ్ సిగ్గుపడుతూనే అందుకు అంగీకరించాడు.



రెజ్లర్ అంతిమ్‌పై నిషేధం తప్పదా?



పారిస్: భారత యువ రెజ్లర్ అంతిమ్ ఒలింపిక్స్ క్రీడా గ్రామంలోకి తన సోదరిని పంపి వివాదంలో ఇరుక్కుంది. దీంతో క్రమశిక్షణా చర్యల కింద ఆమెపై మూడేళ్ల నిషేధం విధించే యోచనలో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఉన్నట్టు సమాచారం. అసలేం జరిగిందంటే.. మహిళల 53 కిలోల తొలి రౌండ్‌లో ఓడాక అంతిమ్ తన సోదరి ఉంటున్న హోటల్‌కు వెళ్లింది. ఆ తర్వాత క్రీడా గ్రామంలో ఉన్న తన వస్తువులను తేవాల్సిందిగా అక్రెడిటేషన్ కార్డును ఇచ్చి సోదరిని పంపింది. కానీ అక్కడి సెక్యూరిటీ స్టాఫ్ గుర్తించి అంతిమ్ సోదరిని విచారణ కోసం పోలీసులకు అప్పగించారు. అనంతరం అంతిమ్ అక్రెడిటేషన్‌ను రద్దు చేశారు. 'అందరినీ ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టిన అంతిమ్‌పై ఐఓఏ అధికారులు ఇప్పటికే చర్చించారు. ఇందులో భాగస్వామ్యమైన కోచ్‌లతో పాటు అంతిమ్‌పై మూడేళ్ల నిషేధం విధించే అవకాశం ఉంది. తను భారత్‌కు వచ్చాక నిర్ణయం తీసుకుంటాం' అని ఐఓఏ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఈ వివాదంలో తన తప్పేమీలేదని అంతిమ్ విడుదల చేసిన ఓ వీడియోలో పేర్కొంది. తన సోదరి క్రీడా గ్రామంలోకి ప్రవేశించలేదని, ఆ అక్రిడిటేషన్ కార్డు తనదికాదని చెప్పి, లోపలికి వెళ్లేందుకు అక్కడి సెక్యూరిటీ వారిని అనుమతి మాత్రమే కోరిందని తెలిపింది. వారు వినకుండా ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లారని చెప్పింది.

నిరాశపర్చిన జ్యోతి



పారిస్: తెలుగు అథ్లెట్ జ్యోతి యర్రాజి 100 మీటర్ల హర్డిల్స్ సెమీస్‌కు చేరుకోలేకపోయింది. గురువారం జరిగిన రెపిచేజ్ రౌండ్‌లో హీట్-1లో జ్యోతి 13.17 సెకన్ల టైమింగ్‌తో నాలుగో స్థానంలో నిలిచింది. టాప్-2లో నిలిచిన వారికే సెమీస్ అవకాశాలు. జ్యోతి జాతీయ రికార్డు 12.78 సెకన్లు కాగా.. రెపిచేజ్‌లో దాని కంటే ఘోరమైన టైమింగ్‌ను నమోదు చేసింది.

ఢిల్లీ వస్తే.. బీఆర్ఎస్ విలీనం కోసమేనా?

- ఊహాజనిత కథనాలు సరికాదు: శ్రీనివాస్‌గౌడ్

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): "మేం ఢిల్లీ రాకూడదా? ఢిల్లీ వస్తే పార్టీ విలీనం కోసమేనా?" అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఊహాజనిత కథనాలు రాయడం జర్నలిజానికి మంచిది కాదన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం కోర్టులో పోరాడేందుకే ఢిల్లీకి వచ్చామని తెలిపారు. కొందరు నేతలు డబ్బుకు ఆశపడి పార్టీలు మారారని, అంతమాత్రాన తమ పార్టీ పని అయిపోయినట్టు కాదని అన్నారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ గెలిచిందని, ఏ పార్టీకీ అధికారం శాశ్వతం కాదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ బలంగా ఉందని, 39 అసెంబ్లీ సీట్లు రావడం ఆషామాషీ విషయం కాదన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలు మోదీ, రాహుల్ ప్రాతిపదికనే జరిగాయని, అందుకే దేశంలోని అనేక ప్రాంతీయ పార్టీలకు ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదని చెప్పారు. ఎన్డీఏ, ఇండియా కూటముల్లో ఏదో ఒకవైపు ఉంటే తప్పకుండా తాము 10-15 సీట్లు గెలిచేవాళ్లమన్నారు.

పెట్టుబడులపై రాజకీయాలెందుకు?!

- ఓర్వలేక విషం కక్కుతున్న బీఆర్ఎస్: సంపత్ కుమార్
- కేటీఆర్ ఎన్ని వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారు?: చామల

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అమెరికాలో స్వచ్ బయోకంపెనీ నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకువస్తే.. బీఆర్ఎస్ నేతలు దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మండిపడ్డారు. గాంధీభవన్‌లో గురువారం సంపత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగానే వారు అమెరికా పర్యటనకు వెళ్లారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుండడం చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు సీఎం, ఆయన కుటుంబసభ్యులపై విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి ఆస్ట్రేలియా వెళ్తే.. అధికారిక పర్యటన ఎలా అవుతుందని ప్రశ్నించారు. గతంలో అనేక సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లిన కేటీఆర్ రాష్ట్రానికి ఎన్ని వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కుటుంబ రాజకీయాలంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడడం.. హాస్యాస్పదంగా ఉందన్నారు. తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునేందుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఏనాడైనా ప్రపంచ బ్యాంకు తలుపు తట్టారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అధికారులు, మంత్రులను తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా వెళితే బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆలోచించాలని హితబోధ చేశారు. రోజుల తరబడి కేటీఆర్, హరీశ్‌రావు ఢిల్లీలో ఉండడాన్ని ప్రస్తావిస్తూ.. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే దిశగా చర్చలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయని చెప్పారు.

రైతుల అభిప్రాయాల మేరకే కొత్త ఆర్వోఆర్ చట్టం

- కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజల అభిప్రాయాలకనుగుణంగానే కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొస్తున్నట్లు కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో కోదండరెడ్డి మీడియాతో మాట్లాడారు. గత పదేళ్లలో తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పొరపాట్లు చేసిందన్నారు. కొత్త రెవెన్యూ చట్టంపై ధరణి అధ్యయన కమిటీ కన్వీనర్‌గా తాను గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించానని, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం మినహా ఇతరపార్టీల నేతలందరూ అభిప్రాయాలు చెప్పారన్నారు. సమావేశానికి హాజరు కాని నేతలు అధికారులకు రాతపూర్వకంగానైనా అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. అఖిల పక్ష సమావేశంలో కాంగ్రెస్ నేత రామ్మోహన్ రెడ్డి, సీపీఎం నేత సారంపల్లి మల్లారెడ్డి, పశ్య పద్మ, దొంతి నర్సింహారెడ్డి తదితరులు అభిప్రాయాలు వ్యక్తం చేసినట్టు తెలిపారు.

నెలాఖరులో కొత్త పీసీసీ!

కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు.. టీపీసీసీ చీఫ్‌గా బీసీ లేదా లంబాడా?

- మధుయాష్కీ, బలరాం పేర్ల పరిశీలన
- ఎస్సీ వర్గం నుంచి రేసులో సంపత్
- నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు?
- ప్రచార కమిటీ చైర్మన్‌గా జగ్గారెడ్డి!

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర నూతన 'ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)'ని పంద్రాగస్టు తర్వాత ప్రకటించనున్నారు. ఆ దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తును ముమ్మరం చేసింది. ఈ నెల చివరి వారంలో పీసీసీ అధ్యక్షుడు, నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు, ప్రచార కమిటీ చైర్మన్‌లతో నూతన టీపీసీసీని ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అలాగే మరికొన్ని కార్పొరేషన్లు, సంస్థలకూ చైర్మన్ల పేర్లను అధిష్ఠానం ఆమోదించనున్నట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణకు మాత్రం మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఏఐసీసీని విస్తరించే పనిలో ఉన్న అధిష్ఠానం.. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాతే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై దృష్టి సారించే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నాయి. టీపీసీసీ, ఏఐసీసీల్లో నియామకాలను పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గ విస్తరణపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందంటున్నాయి. శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నప్పుడే నూతన టీపీసీసీపై చర్చల కోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కానీ, శాసనసభలో కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ ఉండడం, సమావేశాలు ముగియగానే సీఎం అమెరికా పర్యటన షెడ్యూల్ ఖరారవడంతో ఢిల్లీ భేటీ వాయిదా పడింది. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ వచ్చిన తర్వాత ఈ సమావేశం జరగనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 15 తర్వాత సీఎం, భట్టి, ఉత్తమ్‌ను ఢిల్లీకి పిలిపించుకుని తుది సంప్రదింపులు జరుపుతారని, చివరి వారంలో కొత్త టీపీసీసీని ప్రకటిస్తారని పేర్కొంటున్నాయి.



బీసీ లేదా లంబాడా!?

ఏ సామాజిక వర్గం నుంచి టీపీసీసీకి కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాలన్నది ఖరారు చేశాక.. ఎవరిని నియమించాలన్న దానిపై అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. బీసీ లేదా లంబాడాల నుంచి అధ్యక్షుడిని ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీసీల్లో గౌడ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీ గౌడ్ పేర్లను పరిశీలించిన అధిష్ఠానం.. యాష్కీ వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అలాగే లంబాడాల నుంచి ఎంపీ బలరాంనాయక్ పేరును ప్రధానంగా పరిశీలిస్తోంది. ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఎంపిక చేయాలనుకుంటే ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరునే ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటారని చెబుతున్నారు. ప్రభుత్వాన్ని, పార్టీని జోడెద్దుల బండిలా నడపాలని అధిష్ఠానం భావిస్తే.. తెరపైకి కొత్త సమీకరణాలు వచ్చేందుకూ ఆస్కారం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షుల్లో ఒకటి రెడ్డి సామాజిక వర్గం, రెండోది మైనారిటీలకు కేటాయించనున్నట్లు చెబుతున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఏ సామాజిక వర్గం నుంచి టీపీసీసీ చీఫ్‌ను ఎంపిక చేస్తే ఆ సామాజిక వర్గానికి కార్యనిర్వాహక అధ్యక్షుడి పోస్టు ఉండదంటున్నారు. మిగిలిన రెండు వర్గాల వారికి ఆ పదవి దక్కనున్నట్లు చెబుతున్నారు.

జగ్గారెడ్డికి ప్రచార కమిటీ..!

రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించినప్పుడే మధుయాష్కీని ప్రచార కమిటీ చైర్మన్‌గా అధిష్ఠానం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సంప్రదాయాన్నే కొనసాగించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ప్రచార కమిటీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. భారత్ జోడో యాత్రను సంగారెడ్డిలో విజయవంతం చేసిన జగ్గారెడ్డి.. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ దృష్టిలో పడ్డారు. జగ్గారెడ్డి మంచి ఆర్గనైజర్ అంటూ అప్పట్లో రాహుల్ కితాబిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డిలో స్వల్ప తేడాతో ఓటమిపాలైన జగ్గారెడ్డి.. లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి కాంగ్రెస్ అభ్యర్థికి తన నియోజకవర్గంలో మెజారిటీని తెచ్చి పెట్టారు.

ఏఐసీసీ విస్తరణ తర్వాతే మంత్రివర్గ విస్తరణ!?

ఏఐసీసీని విస్తరించిన తర్వాతే మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. టీపీసీసీ, ఏఐసీసీల్లో తెలంగాణ నేతలకు ప్రాతినిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గాన్ని విస్తరించనున్నట్లు చెబుతున్నారు. మంత్రివర్గ విస్తరణలో కొత్తగా ఆరుగురికి చోటు దక్కే అవకాశం ఉంది. ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి వాకిటి శ్రీహరి పేర్లు దాదాపుగా ఖరారైన సంగతి తెలిసిందే. ఉమ్మడి నల్లగొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలూ నాయక్‌లు పోటీ పడుతున్నారు. టీపీసీసీ చీఫ్‌గా లంబాడాకు అవకాశం ఇస్తే.. బాలూ నాయక్ డిప్యూటీ స్పీకర్ పదవితో సర్దుకోవాల్సి ఉంటుంది. ఇక సీఎం ఢిల్లీ పర్యటనలో మరికొన్ని కార్పొరేషన్లకు చైర్మన్లు, ఇతర నామినేటెడ్ నియామకాలకు అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ తీసుకుంటారని చెబుతున్నారు.

16న రాష్ట్రానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్

- 20 రోజుల పాటు హైదరాబాద్‌లో మకాం
- కాళేశ్వరం అవకతవకలపై విచారణ
- ఆయన వేతన చెల్లింపుల ఫైలు కదలని వైనం

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విచారణలో భాగంగా ఈనెల 16వ తేదీన జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు రానున్నారు. దాదాపు 20 రోజుల పాటు హైదరాబాద్‌లోనే మకాం వేసి, విచారణ ప్రక్రియను చేపట్టనున్నారు. విచారణలో ఇప్పటికే పలు కీలక దశలు పూర్తయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నిర్మాణాలు, సబ్ కాంట్రాక్టులు, డిజైన్‌లు, క్వాలిటీ కంట్రోల్, నిర్మాణంపై విచారణ ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. ప్రస్తుతం కీలకమైన ఆర్థికంగా అవకతవకలు ఏమైనా జరిగాయా? వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. దీనికోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్‌తో సంబంధం లేని చార్టర్డ్ అకౌంటెంట్(సీఏ)ను సమకూర్చాలని ఆయన ప్రభుత్వాన్ని ఇదివరకే కోరారు. దీనిపై ఇప్పటిదాకా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే ఐఏఎస్‌లతో పాటు మాజీ ఐఏఎస్‌లు, మాజీ సీఎస్‌లను కమిషన్ విచారించింది. వారితో పాటు ఇంజనీర్లు/నిపుణులు దాఖలు చేసిన అఫిడవిట్లను కోల్‌కతాకు తెప్పించుకొని, అధ్యయనం చేసిన ఆయన...తదుపరి సమన్ల జారీ, క్రాస్ ఎగ్జామినేషన్‌పై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. క్రాస్ ఎగ్జామినేషన్ కోసం ఎవరెవరినీ పిలవాలనే దానిపై ఆయన ఈ దఫా నిర్ణయం తీసుకోనున్నారు. తెలుగు రాష్ట్రాలు, బెంగాల్‌తో సంబంధం లేని న్యాయవాదులను సమకూర్చాలని కోరినా...ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. కాగా జస్టిస్ పినాకి చంద్ర ఘోష్‌కు మూడునెలల వేతనాల చెల్లింపుల ఫైలు అడుగు ముందుకు కదల్లేదు. ఈ ఫైలును ఆమోదించే విషయంలో ఆర్థిక శాఖ ఏ నిర్ణయం తీసుకోలేదు. గురువారం నీటిపారుదల శాఖ అధికారులు పలు దఫాలుగా ఆర్థిక శాఖతో సంప్రదింపులు జరిపినా ప్రయోజనం లేకుండా పోయింది. మూడునెలలుగా కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తోపాటు ఆయన కార్యదర్శి, కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేట్లకు వేతనాలు ఇవ్వలేదు. ఈనెల 16న జస్టిస్ చంద్రఘోష్ రానుండటంతో ఈలోగా వేతనాల ఫైలుకు ఆమోదం తీసుకొని, చెల్లింపులు చేయడానికి నీటిపారుదల శాఖ ప్రయత్నాలు చేస్తోంది.

అవయవదాతల పార్థివ దేహాలకు

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

- ఆ కుటుంబానికి 10 వేల ఆర్థిక సాయం
- అంత్యక్రియల్లో జిల్లా కలెక్టర్ పాల్గొనాలి
- ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ సర్కారు

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అవయవదానంతో పలువురికి జీవదాతలుగా నిలిచిన వారి పార్థివ దేహాలకు గౌరవప్రదమైన వీడ్కోలు తెలిపాలని, వారి అంతియ యాత్రను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులకు గురువారం ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు జారీ చేశారు. అవయవదానం చేసిన వారి కుటుంబాలకు రూ.10 వేల సహాయం అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అవయవదానం దినోత్సవంలో పాల్గొన్న ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, అవయవ దాతల భౌతికకాయాలకు అంతిమ సంస్కారాన్ని గౌరవప్రదంగా నిర్వహించేలా సీఎంతో మాట్లాడి ఉత్తర్వులు వెలువడేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రి చొరవతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. అవయవదాతల కుటుంబ సభ్యుల్ని గౌరవిస్తూ వారిని శాలువా, ప్రశంసా పత్రం, పుష్పగుచ్ఛాలతో సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం లాంఛనాలతో నిర్వహించే అంతిమ సంస్కారాలకు జిల్లా కలెక్టర్ లేదా జిల్లా స్థాయి సీనియర్ అధికారికి వెళ్లాల్సి ఉంటుంది. అవయవ సేకరణ అనంతరం ఆస్పత్రి నుంచి దాత నివాసం లేదా స్మశాన వాటికకు భౌతికకాయాన్ని ఉచితంగా తరలించే ఏర్పాటు చేయాలి. జీవదాత భౌతిక దేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి ముందు ప్రభుత్వం తరఫున కార్యక్రమానికి హాజరైన ఉన్నతాధికారి, స్థానిక ప్రజాప్రతినిధి వారికి గౌరవ వందనంతో అంతిమ వీడ్కోలు పలకాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనంతరం దాతకు సంబంధించిన ఫొటోతో జిల్లా కలెక్టర్ పత్రికా ప్రకటన జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా, అవయవదానం చేసిన వారి అంత్యక్రియలు ప్రభుత్వం లాంఛనాలతో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని అఖిల భారత శరీర అవయవదాతల సంఘం అధ్యక్షురాలు గూడూరు సీతామహాలక్ష్మి కొనియాడారు. తమిళనాడు, ఒడిసా మాదిరిగా ఏపీలో జీవో విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు.

భూసేకరణ తర్వాతే ఆర్ఆర్ఆర్ నిర్మాణం

» ఇప్పటికే రూ.17 వేల కోట్లు మంజూరు: నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఆర్ఆర్ఆర్ కోసం ఇప్పటికే రూ.17వేల కోట్లు మంజూరు చేశామని ఆయన వెల్లడించారు. గురువారం లోక్‌సభలో ఎంపీ ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరిస్తామని చెప్పిందని గుర్తు చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత కొత్త సీఎం భూసేకరణను త్వరగా పూర్తి చేస్తామన్నారని తెలిపారు. హైదరాబాద్- విజయవాడ రహదారి నిర్మాణంపై అనేక వివాదాలు ఉన్నాయని, దానిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండడం దురదృష్టకరమని అన్నారు. ఆ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీఇచ్చారు. జాతీయ రహదారి- 65 ఆధునికీకరణ కోసం టెండర్లను పిలిచామని వెల్లడించారు. ఒకటి రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని నితిన్ గడ్కరీ తెలిపారు.

ఐదుగురు ఐపీఎస్‌లకు డీజీపీలుగా పదోన్నతి

» ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, హైదరాబాద్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సహా ఐదుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం డీజీపీలుగా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 1994 బ్యాచ్‌కు చెందిన శివధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు ముగ్గురు మహిళా ఐపీఎస్‌లు డీజీపీలుగా పదోన్నతి పొందారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, సీఐడీ చీఫ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, పోలీస్ శిక్షణ కేంద్రం డైరెక్టర్ అభిలాష బిస్త్ డీజీపీలుగా పదోన్నతి పొందారు. ఇప్పటి వరకు అదనపు డీజీపీ స్థాయిలో వారు నిర్వహించిన బాధ్యతల్లోనే ఇకపై డీజీపీ హోదాలో బాధ్యతలు కొనసాగించాల్సిందిగా ప్రభుత్వం పేర్కొంది. పదోన్నతి పొందిన అధికారులు డీజీపీ జితేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులను జితేందర్ అభినందించారు. కాగా, తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి భేటీ అయ్యారు. డీజీపీగా పదోన్నతి పొందిన శివధర్ రెడ్డి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

గోదావరి-కావేరీ అనుసంధానంపై నేడు భేటీ

హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ నీటి అభివృద్ధి సంస్థ శుక్రవారం హైదరాబాద్ జలసౌధలో రాష్ట్ర అధికారులతో సమావేశం కానుంది. గోదావరి-కావేరీ అనుసంధానం విషయంలో తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. నదుల అనుసంధానంలో ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణాన్ని తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ కడితే కేవలం 24కిలోమీటర్ల దిగువన తుపాకులగూడెం బ్యారేజీ ఉందని, పైనుంచి ఆకస్మికంగా వరద వస్తే నియంత్రించే పరిస్థితి ఉండదని తెలంగాణ ఇదివరకే తెలిపింది. అనుసంధానంలో తరలించే నీటిలో 50శాతం వాటా ఇవ్వాలని కోరింది. అయితే, తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించే అవకాశం లేకున్నా నామ్‌కే వాస్తేగా సమావేశం నిర్వహించనున్నారని తెలుస్తోంది.

ప్రాజెక్టుల్లో పూడికపై నేడు ఉప సంఘం భేటీ

నీటి పారుదల ప్రాజెక్టుల్లో పూడిక అంశంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం తొలి సమావేశం శుక్రవారం సచివాలయంలో ఆ సంఘం చైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఈ ఉప సంఘం ప్రాజెక్టుల్లో శరవేగంగా చేరుతున్న పూడికను కట్టడి చేయడానికి, దాన్ని వాణిజ్య అవసరాలకు విక్రయించే అంశంపై చర్చించి, ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. ఇందులో సభ్యులుగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, మెంబర్ కన్వీనర్‌గా నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉన్నారు. పూడికలో ఇసుకను విక్రయించాలని, మట్టిని ఎరువుగా వాడుకోవడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్రాలకు సూచించింది. రాజస్థాన్‌లో రెండు రిజర్వాయర్లలో అమలు చేస్తున్న విధానాన్ని తెలంగాణ అధికారులు ఇప్పటికే అధ్యయనం చేశారు.

సివిల్స్ అభయ హస్తం దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులతో చేపట్టిన 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం' పథకం దరఖాస్తు గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించారు. సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన తెలంగాణ యువతకు మెయిన్ పరీక్ష రాసేందుకు సింగరేణి తరఫున రూ.లక్ష ఆర్థిక సహాయం అందించేలా ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం విదితమే. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 6వ తేదీతో ముగిసింది. అయితే అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు దరఖాస్తు గడువును 12వ తేదీ దాకా పొడిగించినట్లు సింగరేణి కాలరీస్ సంస్థ సీఎండీ బలరామ్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు http://scclmines.comలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆరుకు పెరిగిన హెచ్ఎండీఏ జోన్లు

» శంకర్‌పల్లి, మేడ్చల్ జోన్ల విభజన

హైదరాబాద్ సిటీ, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) జోన్ల సంఖ్యను నాలుగు నుంచి ఆరుకు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అతిపెద్దజోన్లుగా ఉన్న శంకర్‌పల్లి, మేడ్చల్ జోన్లను విభజించి.. రెండు కొత్త జోన్లను ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా పీవో, ఏపీవో, జేపీవోలను నియమించింది. హెచ్ఎండీఏ ఏర్పాటైనప్పటి నుంచి దాదాపు 16 ఏళ్లుగా శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ జోన్లు కొనసాగాయి. తాజాగా.. మేడ్చల్, శంకర్‌పల్లిని అవే పేర్లతో జోన్-1, జోన్-2గా విభజించారు. ఘట్‌కేసర్ జోన్ పీవోగా కె.యశ్వంత్‌రావు, శంషాబాద్‌కు రవీందర్‌రెడ్డి, మేడ్చల్-1కు గోపిక రమ్య, మేడ్చల్-2కు కె.శాలిని, శంకర్‌పల్లి-1కు బి.ప్రసాదరావు, శంకర్‌పల్లి-2కు వి.మల్లికార్జునరావుతోపాటు.. మండలాల వారీగా ఏపీవో, జేపీవోలను నియమించారు.

ప్రపంచబ్యాంకు ఒప్పందాలేంటో చెప్పాలి: సీపీఎం

హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా ప్రపంచబ్యాంకు అధ్యక్షుడితో జరిపిన ఒప్పందాల వివరాలను ప్రజల ముందు పెట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పెట్టుబడుల కోసం సీఎం విదేశీ పర్యటన విషయం తెలిసినప్పటికీ ప్రపంచ బ్యాంకుతో ఒప్పందాలు పత్రికల్లో చూసేవరకు ప్రజలకు తెలియదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య పేర్కొన్నారు. ప్రపంచబ్యాంకు అప్పుల స్వభావం, షరతులు ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమన్నారు. కాగా, సీపీఎం నేత బుద్ధదేవ్ మరణం పట్ల ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. ఎంబీ భవన్‌లో బుద్ధదేవ్ చిత్రపటానికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు.

కొత్త ఏఈఈలు వచ్చేదాకా
34 మంది సర్వీసుల కొనసాగింపు

» నీటిపారుదల శాఖ ఉత్తర్వులు

నీటి పారుదల శాఖలో టీజీపీఎస్సీ ద్వారా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (ఏఈఈ) నియామక ప్రక్రియ చేపడుతుండటంతో వారు సర్వీసులో చేరేదాకా వివిధ శ్రేణుల్లో పనిచేస్తున్న 34 మంది ఉద్యోగుల సర్వీసును కొనసాగించాలని సంబంధిత శాఖను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఏఈఈలు చేరిన వెంటనే వారిని తొలగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అనంతరం నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం జీవో జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే దాకా కొనసాగుతారనే వెసులుబాటుతో గత కొంతకాలంగా పనిచేస్తున్న అధికారులను కూడా తాజా ఉత్తర్వులతో తొలగించారు. మొత్తం 72 మంది అధికారులు నీటిపారుదలశాఖలో పదవీ విరమణ చేసినప్పటికీ వివిధ రకాల ఉత్తర్వులతో కొనసాగుతున్నారని ప్రభుత్వం తాజాగా గుర్తించింది. ఇందులో ఈఎన్‌సీ(జనరల్)గా పనిచేసిన సి.మురళీధర్ రాజీనామా చేయగా రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును ప్రభుత్వం తొలగించింది. ఇక చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న హమీద్‌ఖాన్ పొడిగింపు పదవీ కాలం పూర్తయింది. వీరితో పాటు చాలా మంది పొడిగింపు ఉత్తర్వులతో కొనసాగుతున్నవారి పదవీ కాలం పూర్తికావడంతో వారంతా సర్వీసు నుంచి రిలీవ్ అయ్యారు. ఎత్తిపోతల పథకాల సలహాదారుడు పెంటారెడ్డిని మరికొన్ని నెలల పాటు సర్వీసు పొడిగించారు. కాగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఏఈఈ)ల నియామక ప్రక్రియను టీజీపీఎస్సీ ఇప్పటికే చేపట్టి, మెరిట్ లిస్టును విడుదల చేసింది. వీరు నీటిపారుదల శాఖలో చేరిన తర్వాత 34 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈ), టెక్నికల్ అధికారులు(టీవో), వర్క్ ఇన్‌స్పెక్టర్లను తొలగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో పరిశ్రమలు స్థాపించండి

ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం

బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్‌తో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల వసతులున్న హైదరాబాద్‌లో పరిశ్రమలను స్థాపించాలని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గ్యారెట్ విన్ ఓవెన్‌ను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. అందుకు ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. గురువారం ప్రజాభవన్‌లో భట్టితో గ్యారెట్ విన్ ఓవెన్, బ్రిటిష్ హైకమిషన్‌లోని రాజకీయ, ఆర్థిక సలహాదారు నళినీ రఘురామన్‌లు భేటీ అయ్యారు. మౌలిక సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీ, పట్టణాభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనకు హైదరాబాద్ స్వర్గధామమన్నారు. ఇక్కడ అందరికీ అనుకూలమైన వాతావరణం, తక్కువ వేతనాలకే అందుబాటులో మానవ వనరులు, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు సరఫరా, తాగునీటి సరఫరా వంటి సదుపాయాలున్నాయని వివరించారు. వీటికి తోడు రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధికి కార్యాచరణను చేపడుతున్నామని తెలిపారు.



డిప్యూటీ సీఎం భట్టితో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్

వైద్య సేవలకు ఆటంకం లేకుండా బదిలీలు

ఉస్మానియా, గాంధీల్లో వైద్యుల కొరత లేదు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకునే వైద్యులు, సిబ్బంది బదిలీలు చేపట్టామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ స్పష్టం చేశారు. జూలై 3న జారీ చేసిన జీఓ నెంబర్ 80 ప్రకారం బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది సరిపడా ఉన్నారని తెలిపారు. బదిలీల కారణంగా ఆయా ఆస్పత్రుల్లో వైద్య సేవలపై ఎలాంటి ప్రభావం పడలేదని వివరించారు. మార్చి నెలలో వైద్యులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులను కాంట్రాక్టు పద్ధతిన నియమించామని, మరికొంత మంది నియామకానికి త్వరలోనే నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని వివరించారు.

హైదరాబాద్ నగరంలో 'చార్లెస్ స్క్వాబ్ సెంటర్'!

భారత్‌లో నెలకొల్పే తొలి కేంద్రమిదే.. డాలస్‌లో సీఎంతో కంపెనీ ప్రతినిధుల చర్చలు

» మహాత్మాగాంధీ విగ్రహానికి రేవంత్ నివాళులు

» కాలిఫోర్నియాలో సీఎంకు ఎన్నారైల ఘనస్వాగతం

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): ఆర్థికపరమైన సేవల్లో పేరొందిన అమెరికా బహుళ జాతి సంస్థ చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అమెరికా పర్యటనలో భాగంగా డాలస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హోవార్డ్, రామ బొక్కా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కంపెనీ భారత్‌లో తన తొలి కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ప్రకటించింది. సెంటర్ ఏర్పాటుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు మార్గదర్శనం చేస్తామన్నారు. కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలో హైదరాబాద్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బుద్ధదేవ్ మృతికి సీఎం సంతాపం

పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, సీపీఎం నేత బుద్ధదేవ్ భట్టాచార్య మరణం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా, ఐదు దశాబ్దాలు సుదీర్ఘ ప్రజాసేవలో గడిపిన బుద్ధదేవ్ సేవలు మరువలేనివన్నారు. నిజాయతీకి మారుపేరుగా నిలిచిన భట్టాచార్య మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, సీపీఎం కార్యకర్తలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహాత్ముడికి సీఎం నివాళులు

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం డాలస్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. మంత్రివర్గ సహచరులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఉన్నారు. సీఎం నేతృత్వంలోని బృందం గురువారం రాత్రి కాలిఫోర్నియా చేరుకోగా.. విమానాశ్రయంలో స్థానిక ఎన్నారైలు ఘనంగా స్వాగతం పలికారు.



చార్లెస్ స్క్వాబ్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

రాష్ట్ర ప్రయోజనాలు తప్ప మరేమీ లేదు: జయేశ్ రంజన్

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమెరికా పర్యటన విజయవంతంగా సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు వీడియో సందేశం పంపారు. అమెరికా పర్యటనలో ప్రతి పెట్టుబడి వెనక రాష్ట్ర ప్రయోజనాలు తప్ప మరో అంశమే లేదన్నారు. పెట్టుబడులు కచ్చితంగా వస్తాయన్న పారిశ్రామికవేత్తలతోనే తాము సమావేశం అవుతున్నామని, ఆషామాషీగా భావించడం లేదని తెలిపారు. ప్రతి సమావేశాన్ని సీఎం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని వివరించారు. అమెరికా పర్యటనలో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీ సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడిదన్న కేటీఆర్ వ్యాఖ్యల నేపథ్యంలో.. తమ పర్యటన గురించి జయేశ్ రంజన్ వీడియో సందేశం పంపారు. ఇక ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో జరిగిన సమావేశం విజయవంతమైందని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కూడా వీడియో సందేశం పంపారు.

ఆదివాసీలకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని (ఆగస్టు 9) పురస్కరించుకొని గిరిజనులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మూలవాసులుగా, అమ్మలాంటి అడవికి తోడుండే భూమిపుత్రులుగా ఆదివాసులు నిలుస్తారని, వాళ్ల కల్మషం లేని అనుబంధాలకు ప్రతీకలని అభినందించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ గురువారం విడుదల చేసిన సందేశంలో పేర్కొన్నారు. గిరిజన సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ. 17,056 కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రతి గిరిజన గూడానికి రోడ్లు, విద్యుత్, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.



కాళేశ్వరం కింద 98,570 ఎకరాలకు సాగునీరు

» సాగర్ కింద 6.45 లక్షల ఎకరాలకు..

» స్కైవమ్ భేటీ మినట్స్ విడుదల

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ (వానాకాలం) సీజన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు కింద 98,570 ఎకరాలకు సాగు నీటిని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 71,600 ఎకరాల్లో వరి, 26,970 ఎకరాల్లో ఆరుతడి పంటలకు సాగు నీటిని అందించనున్నారు. దాదాపు రూ.లక్ష కోట్ల దాకా ఈ ప్రాజెక్టుకు ఖర్చుచేసినా.. ఆయకట్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో 98,570 ఎకరాలకే పరిమితమైంది. వానాకాలంలో ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగు నీటిపై ఈనెల 3వ తేదీన స్కైవమ్ (రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ) చైర్మన్ ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలో భేటీ జరగ్గా.. సమావేశపు మినట్స్ తాజాగా విడుదలయ్యాయి. నాగార్జున సాగర్ కింద ఈ దఫా 6.45 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించాలని నిర్ణయం తీసుకున్నారు. గతేడాది రబీలో ప్రాజెక్టులో నీరు లేక సాగర్ కింద రైతులు 'పంట విరామం' ప్రకటించారు. కానీ ఈసారి రెండు పంటలకు నీరివ్వడానికి వీలుగా సాగర్‌లో నిల్వలున్నాయి. ఇక కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల నుంచి 125 టీఎంసీల నీటిని 14.5 లక్షల ఎకరాలకు.. గోదావరి బేసిన్ ప్రాజెక్టుల నుంచి 188 టీఎంసీల నీటిని 17.95 లక్షల ఎకరాలకు నీటిని అందించాలని ఇప్పటికే నిర్ణయించారు.

సంగారెడ్డిలో 500 పడకలతో ప్రభుత్వ ఆస్పత్రి

మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర

» అక్కడిక్కడే మంజూరు చేసిన మంత్రి

» నెలాఖరులో లేదా వచ్చే నెలలో శంకుస్థాపనకు హామీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8: సంగారెడ్డిలో ఐదు వందల పడకలతో ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రం, ప్రభుత్వ మెడికల్ కాలేజీని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి గురువారం ఆయన సందర్శించారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా మరో 500 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విన్నవించగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. అక్కడిక్కడే ఆస్పత్రిని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో శంకుస్థాపన చేసుకుందామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులను వినియోగదారుల్లా భావించాలని, ఆస్పత్రి నాది అనుకొని వైద్యులు సేవలందించాలని సూచించారు. అప్పుడే సర్కారు వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణ కేంద్రంలోని చిన్నపిల్లల వార్డులో మరిన్ని వార్మర్లు కావాలని, అదనంగా సీటీ స్కాన్‌తో పాటు ఎంఆర్ఐ మిషన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై కూడా మంత్రి దామోదర సానుకూలంగా స్పందించారు. నాలుగు నెలల్లో మెడికల్ కాలేజీ భవన నిర్మాణం పూర్తి చేసి.. విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్అండ్‌బీ అధికారులను మంత్రి ఆదేశించారు. అంతకు ముందు మెడికల్ కాలేజీ విద్యార్థులతో మాట్లాడిన మంత్రి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, డీఎంఈ వాణి, ఆర్అండ్‌బీ, టీజీఎంఎస్ఐడీసీ అధికారులు ఉన్నారు.



సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చిన్నపిల్లల వార్డును పరిశీలిస్తున్న మంత్రి దామోదర, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సమీకృత గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు..
9 జిల్లాలు.. 20 వేల ఎకరాలు

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులు, ఫార్మా పరిశ్రమలతో కాలుష్య సమస్యలపై స్థానికుల అభ్యంతరాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రత్యామ్నాయంగా వేర్వేరుచోట్ల సమీకృత గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. జనవరిలో జరిగిన బయో ఏసియా అంతర్జాతీయ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికను ప్రకటించారు. గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేసేందుకు వికారాబాద్, మెదక్, నల్లగొండ జిల్లాలను ఎంపిక చేసింది. ఒక్కో క్లస్టర్‌లో మూడు నుంచి నాలుగు ఫార్మా విలేజ్‌లు ఉంటాయి. ఇప్పుడు దీనికి సంబంధించిన భూ సేకరణ ప్రక్రియకు సీఎం నియోజకవర్గం కొడంగల్ నుంచి తొలి అడుగులు పడ్డాయి. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి గ్రామాల్లో 1,373 ఎకరాల్లో ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. తొలుత లగచర్లలో 632.26 ఎకరాల సేకరణకు గురువారం నోటిఫికేషన్ జారీ అయింది. ఈ భూములను 580 మంది రైతుల నుంచి సేకరించనున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వికారాబాద్ జిల్లా 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారులకు అతి సమీపంలో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తే పారిశ్రామికవేత్తలు ముందుకువస్తారని, తద్వారా ఆ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఒక్కో జిల్లాలో 2వేల ఎకరాల్లో

ప్రభుత్వం పేర్కొన్న పది ఫార్మా క్లస్టర్లు ఔటర్ రింగు రోడ్డుకు 50-60 కి.మీ. లోపల ఏర్పాటు కానున్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉంటే ఫార్మా కంపెనీలకు రవాణాకు అత్యంత అనుకూలంగా ఉంటుందని సర్కారు ఆలోచిస్తోంది. ప్రతి జిల్లాలోని ప్రతి క్లస్టర్ 1000-2000 ఎకరాల్లో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మొత్తం 10 క్లస్టర్లను 20వేల ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. గుర్తించిన జిల్లాల్లో వికారాబాద్‌తో పాటు రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండలు ఉన్నాయి. వికారాబాద్ అనంతరం మెదక్, నల్లగొండలలో భూసేకరణ ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. భూములు ఇచ్చిన రైతులకు నివాసానికి 125 చదరపు అడుగుల స్థలంతో పాటు పరిశ్రమల్లో ఇంటికో ఉద్యోగం ఇవ్వనున్నారు. భూమి ధరను ప్రభుత్వం నిర్ణయించనుంది.

కొత్త రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులపై కమిటీ

ఉత్తమ్ చైర్మన్‌గా, దామోదర, పొంగులేటి సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

ఈ నెలఖారుకు మార్గదర్శకాల రూపకల్పన

సెప్టెంబరులో కొత్త రేషన్ కార్డుల జారీకి చాన్స్

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు కొత్త రేషన్ (ఆహార భద్రత) కార్డులు, హెల్త్ కార్డుల జారీకి అవసరమైన విధివిధానాలు, అర్హతల రూపకల్పనపై ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సాగునీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా ఈ క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సభ్యులుగా నియమించింది. పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపింది. ఈనెలాఖరు వరకు విధి విధానాలను ఖరారు చేసి సెప్టెంబరులో కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి కూడా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల ముందు కాంగ్రెస్ కొత్త రేషన్ రేషన్ కార్డులు జారీ చేస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 90 లక్షల ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. కొత్త కార్డుల కోసం మరో 10 లక్షల కుటుంబాల నుంచి దరఖాస్తులు వస్తాయనే అంచనాలు ఉన్నాయి. ఇవి కాకుండా రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లు చేర్చాలంటూ వచ్చిన మరో 11 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా, పేదలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులకు లింకు తీసేయాలని నిర్ణయించింది.

జీఐఎస్ సర్వేతో చెత్త సేకరణ సమస్యలకు చెక్!

» మా ఇంట్లో కూడా చెత్త తీసుకెళ్లరు.. : ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ చేస్తోన్న జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) సర్వేతో చెత్త సేకరణలో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. ఈ జీఐఎస్ సర్వే కోసం వివరిస్తూ ఒక్కోసారి తమ ఇంట్లోని చెత్తను కూడా సిబ్బంది సేకరించడం లేదని ఆమె చెప్పారు. 'జీహెచ్ఎంసీ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని అందరికీ తెలుసు. ఒక్కోసారి మా ఇంట్లో చెత్త కూడా తీసుకెళ్లరు. చాలా ఇబ్బంది పడతాం' అని కమిషనర్ అన్నారు. ఇంటింటి చెత్త సేకరణకు స్వచ్ఛ ట్రాలీలు ఇచ్చినా, ఒక్కో కార్మికుడు 400-500 ఇళ్ల నుంచి రోజూ చెత్త సేకరించాల్సి ఉన్నా సగం ఇళ్లలో కూడా చెత్త తీసుకెళ్లడం లేదని అన్నారు. జీఐఎస్ సర్వే పూర్తయితే.. ఇలాంటి ఇబ్బందులకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. జీఐఎస్ సర్వే ద్వారా ప్రతీ ఇంటికి ఓ ప్రత్యేకమైన డిజిటల్ ఐడీ (డిజిటల్ అడ్రస్) ఇస్తామని.. చెత్త తీసుకెళ్లలేదని ఫిర్యాదు చేస్తే ఆ ఐడీ ద్వారా ఇంటి వివరాలు తెలుసుకుని సంబంధిత శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను అప్రమత్తం చేస్తామన్నారు. మెరుగైన పౌర సేవలు, సమస్యల పరిష్కారం వంటివి త్వరితగతిన జరిగేందుకు జీఐఎస్ సర్వే దోహదపడుతుందన్నారు. 18 నెలల్లో సర్వే పూర్తి చేయాలని కాంట్రాక్టు ఒప్పందంలో ఉందని, అప్పటి వరకు తాను ఉంటానో.. లేదో.. అనే ఉద్దేశ్యంతో మార్చి లేదా మే వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమ్రపాలి చెప్పారు.

భూమి ధరణిలో ఎక్కలేదు.. అప్పు తీర్చే దారి లేదు..!

మనస్తాపంతో రైతు ఆత్మహత్య.. నిజామాబాద్ జిల్లాలో ఘటన

జక్రాన్‌పల్లి, ఆగస్టు 8: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కుంట రాజేశ్(42).. ఇటుకల తయారీతో పాటు వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఇటుక బట్టీల వ్యాపారంలో సుమారు రూ.12 లక్షల అప్పులు అయ్యాయి. వ్యవసాయం కూడా అంతంతమాత్రంగానే సాగుతోంది. చేసిన అప్పులకు నెలనెలా వడ్డీలు కడుతున్నాడు. అయితే డబ్బులు ఇచ్చేయాలంటూ రుణదాతలు ఇబ్బందులు పెట్టారు. రెండెకరాల భూమిని అమ్మి అప్పులు తీర్చేద్దామంటే ధరణిలో రాజేశ్ పేరిట మారలేదు. అప్పులు ఇచ్చినవారు ఇబ్బంది పెడుతున్నారని, భూమి అమ్ముదామంటే ధరణిలో ఎక్కలేదని రోదిస్తూ.. రాజేశ్ అర్గుల్ వాట్సాప్ గ్రూపులో వాయిస్ రికార్డు పెట్టాడు. తన మాదిరిగానే ధరణిలో భూములు ఎక్కని రైతులు చాలా మంది ఉన్నారని, భూములు ధరణిలో ఎక్కించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను అభ్యర్థించాడు. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరాడు. అప్పులు తీర్చే దారి లేక, మనస్తాపం చెందిన రాజేశ్.. గురువారం సాయంత్రం తన పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

బైక్ కొనివ్వలేదని తండ్రిని కర్రతో కొట్టి చంపాడు

» ఓ జులాయి నిర్వాకం.. కామారెడ్డి జిల్లాలో ఘటన

మద్నూర్, ఆగస్టు 8: వృద్ధాప్యంలోనూ కూలీ పనులకు వెళుతూ కష్టపడుతున్న కన్నతండ్రికి ఆసరాగా ఉండకపోగా ఊర్లో జులాయిగా తిరుగుతున్న యువకుడు దారుణానికి ఒడిగట్టాడు. ద్విచక్రవాహనం కొనివ్వాలంటూ కొన్నాళ్లుగా తండ్రిని వేధిస్తున్న యువకుడు, తనకు అంత స్థోమత లేదని తండ్రి చెప్పడంతో కర్రతో తలమీద కొట్టి తండ్రిని చంపాడు. కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో ఈ ఘటన జరిగింది. మృతుడు అదే గ్రామానికి చెందిన నార్లవార్ అర్జున్ (64). ఆయనకు భార్య ఎల్లవ్వ, కుమారుడు వెంకట్ ఉన్నారు. వెంకట్ చదువును మధ్యలోనే ఆపేసి, ఊర్లో ఆవారాగా తిరుగుతున్నాడు. కుటుంబ పోషణ కోసం అర్జున్ రోజూ కూలీ పనులకు వెళుతున్నాడు. బుధవారం అర్ధరాత్రి.. తనకు బైక్ కొనివ్వాలని తండ్రితో వెంకట్ ఘర్షణకు దిగాడు. తాను కొనివ్వలేనంటూ అర్జున్ అశక్తత వ్యక్తం చేయడంతో వెంకట్ ఆగ్రహంతో ఊగిపోయాడు. కర్రతో తండ్రి తలపై బలంగా కొట్టాడు. ఈ ఘటనలో అర్జున్ అక్కడికక్కడే మృతిచెందాడు.

ఇద్దరు నిందితులు.. 23 సైబర్ నేరాలు

» రాజస్థాన్‌లో అరెస్టు చేసిన సైబర్ పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు కీలక నిందితులు పోలీసులకు చిక్కారు. రాజస్థాన్‌కు చెందిన నంద కిషోర్, దీపక్ వైష్ణవ్‌ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ పోలీసులు అక్కడికెళ్లి అరెస్టు చేసి తీసుకొచ్చారు. నంద కిషోర్ గత ఏప్రిల్‌లో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో సల్సార్ ట్రేడింగ్ కంపెనీ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేసి సంస్థ పేరుతో ఎస్ఆర్ నగర్‌లోని బంధన్ బ్యాంకులో ఖాతా తెరిచి సైబర్ నేరాలకు ఉపయోగిస్తున్నాడు. అయితే కరీంనగర్‌కు చెందిన సత్తయ్యను స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల పేరిట వాట్సాప్ మెసేజ్‌లతో ఆకర్షించి గత మేలో పలు దఫాల్లో రూ.46.11 లక్షలు వసూలు చేశాడు. బాధితుడు కరీంనగర్ సైబర్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఇద్దరు నిందితుల్ని రాజస్థాన్‌లో అరెస్టు చేశారు. తెలంగాణ, ఏపీ, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడులో మొత్తం 23 నేరాల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

స్టాఫ్ నర్సు పట్ల వైద్యుడి అసభ్య ప్రవర్తన?

» మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో ఘటన

నెహ్రూసెంటర్ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 8: మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ స్టాఫ్‌నర్సు పట్ల విధుల్లో ఉన్న వైద్యుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. నర్సుపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న ఓ వైద్యుడు బుధవారం రాత్రి విధులు నిర్వహించాడు. ఈ క్రమంలో చికిత్స పేరుతో ఓ విభాగానికి వెళ్లి.. అక్కడ స్టాఫ్‌నర్సుగా పని చేస్తున్న మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని గురువారం తన కుటుంబసభ్యులకు చెప్పిన సదరు నర్సు.. ఆస్పత్రి సూపరింటెండెంట్ బత్తుల శ్రీనివాసరావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు.

భూదాన్ యజ్ఞ బోర్డు రద్దు సబబే: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చట్టంలో పేర్కొన్న ప్రక్రియను పాటిస్తూ భూదాన్ యజ్ఞ బోర్డును రద్దు చేసిందని, అది సబబేనని హైకోర్టు సమర్థించింది. ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. 2015 మే 13న బోర్డును రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 59ను సమర్థిస్తూ చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం తుది తీర్పు ఇచ్చింది. బోర్డును రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ అప్పటి చైర్మన్ జీ రాజేందర్‌రెడ్డి, సభ్యులు కేవీ సుబ్బారావు, వీ సుబ్రమణ్యం హైకోర్టులో పిటిషన్ వేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది పొట్టిగారి శ్రీధర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ చైర్మన్, సభ్యులు అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని, అనర్హులకు విలువైన భూములు ధారాదత్తం చేశారన్నారు. వారిపై అనేక క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ఉన్నత విద్య అభ్యసనలో తెలంగాణ టాప్!

ఉన్నత విద్యను అభ్యసించే విషయంలో దేశంలోనే తెలంగాణ ముందుంది. ఉన్నత విద్య గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి(జీఈఆర్)లో జాతీయ నిష్పత్తి కంటే రాష్ట్రం మెరుగైన పరిస్థితిలో ఉందని గవర్నర్ జిష్ణుదేవ్‌కు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. రాష్ట్రంలో ఉన్నత విద్యా అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను గురువారం ఆయన గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యలో జీఈఆర్‌పై వారు చర్చించినట్టు తెలిసింది. సాధారణంగా 18 నుంచి 23 ఏళ్ల వయసు కలిగిన వారిలో చదువుకుంటున్న వారి శాతాన్ని జీఈఆర్ అంటారు. అంటే ఈ వయసు గల వారిలో ఎంత మంది ఉన్నత విద్యను చదువుతున్నారనే విషయాన్ని ఈ జీఈఆర్‌ను బట్టి అంచనా వేస్తారు. ఉన్నత విద్యలో జీఈఆర్ జాతీయ స్థాయిలో 28.4 శాతం ఉండగా, తెలంగాణలో 40 శాతం వరకు ఉందని గవర్నర్‌కు లింబాద్రి తెలిపారు. మహిళల విషయంలో తెలంగాణలో ఈ శాతం 41.6గా నమోదైందని తెలిపారు.

పీజీఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు

ఇంజనీరింగ్ పీజీ కోర్సుల భర్తీకి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేశారు. ముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉండగా ఆ గడువును తాజాగా ఈనెల 24వ తేదీ వరకు పొడిగించారు. 12, 13 తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకోవాల్సి ఉండగా, వెబ్ ఆప్షన్ల నమోదును 27, 28 తేదీలకు మార్చారు. అలాగే ముందుగా నిర్ణయించినట్లు ఈనెల 17న కాకుండా తాజా షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 1న సీట్లు కేటాయించనున్నారు.

డ్రగ్స్ నియంత్రణ చర్యలపై 17న కీలక భేటీ !

డ్రగ్స్ నియంత్రణకు ఉన్నత విద్యాసంస్థల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్ ర్యాగింగ్ వంటి వాటిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఈనెల 17న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయాలు, కళాశాలల డీన్‌లు, ప్రిన్సిపల్స్, డీజీపీ, విద్యాశాఖ కార్యదర్శి వంటి వారు పాల్గొననున్నారు.

టీజింగ్‌పై రోజుకు 14 ఫిర్యాదులు

» వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా వస్తున్నవే ఎక్కువ

» వేధిస్తున్న పోకిరీల్లో 19-25 ఏళ్ల వారే ఎక్కువ

» 50 ఏళ్లు పైబడిన వ్యక్తులు 45 మంది

» షీటీమ్స్ పనితీరుపై డీజీ గోయల్ అర్ధవార్షిక సమీక్ష

షీ టీమ్స్ ఎన్నో చర్యలు తీసుకుంటున్నా.. మహిళలపై వేధింపులు ఆగడంలేదు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా అమ్మాయిల పట్ల అనుచితంగా ప్రవరించారన్న ఆరోపణలపై రాష్ట్ర వ్యాప్తంగా 2,661 ఫిర్యాదులందాయి. అంటే.. పోకిరీల వేధింపులపై రోజుకు 14 ఫిర్యాదులు వస్తున్నట్లు లెక్క! షీ టీమ్స్ పనితీరుపై మహిళా భద్రత విభాగం డీజీ షిఖా గోయల్ అర్ధవార్షిక సమావేశం నిర్వహించారు. అయితే గతంతో పోలిస్తే పరిస్థితి ఎంతగానో మెరుగుపడిందని, ప్రజల్లో విస్తృత అవగాహనతోనే కేసుల సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కాగా ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 2314 పెట్టీ కేసులు నమోదు చేశారు. వీటిలో 449 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 1085 మంది పోకిరీలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. మొత్తంగా ఆరు నెలల్లో 6,129 కేసులు షీ టీమ్స్ నమోదు చేశాయి. జనవరి నుంచి జూన్ చివరి నాటికి 4823 మంది పోకిరీలు షీ టీమ్స్‌కు పట్టుబడ్డారు. వీరిలో 19-25 ఏళ్ల వయస్కులు 2,630 మంది, మైనర్లు 936 మంది, 50 ఏళ్లు పైబడ్డ వారు 45 మంది ఉన్నారు. కాగా బాధితులు షీ టీమ్స్‌కు వాట్సాప్, ఫేస్‌బుక్‌లోనే అత్యధికంగా ఫిర్యాదు చేస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా 1216 ఫిర్యాదులు అందాయి. 3,366 మంది పోకిరీలు షీ టీమ్స్‌కు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా 331 షీ టీమ్స్ పనిచేస్తున్నాయని సమీక్ష సందర్భంగా గోయల్ చెప్పారు.

బస్సుపైకి బీర్ బాటిల్.. కండక్టర్‌పైకి పాము

తీవ్ర ఆగ్రహంతో విసిరిన ప్రయాణికురాలు.. తాను చెయ్యి అడ్డుపెట్టినా అపలేదన్న ఆగ్రహంతోనే

భయంతో వణికిపోయిన మహిళా కండక్టర్

బీరు బాటిల్ ధాటికి పగిలిన బస్సు అద్దాలు

విద్యానగర్ బస్‌స్టాప్ వద్ద ఘటన

రాంనగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బస్‌స్టాపులో నిల్చుని చేయి అడ్డుపెట్టినా బస్సు ఆపకపోతే సాధారణంగానైతే ప్రయాణికులు ఏం చేస్తారు? పెదవి విరుస్తారు.. మరో బస్సు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తారు. కానీ ఆ ప్రయాణికురాలు ఏం చేసిందో తెలుసా? తాను చెయ్యి పెట్టినా ఆపలేదన్న ఆగ్రహంతో బస్సు వెనుక అద్దాలపైకి బీరు బాటిల్‌ను విసిరింది. ఆపై తన సంచీలోంచి పాము తీసి.. మహిళా కండక్టర్‌పైకి విసిరి భయోత్పాతం సృష్టించింది. నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్‌లో గురువారం ఈ ఘటన జరిగింది. సీఐ జగదీశ్వర్‌రావు కథనం ప్రకారం.. జవహర్‌నగర్‌లోని దమ్మాయిగూడకు చెందిన బేగం (60) అనే ప్రయాణికురాలు గురువారం సాయంత్రం విద్యానగర్‌లో బస్సు కోసం ఎదురుచూస్తోంది. సికింద్రాబాద్ నుంచి ఎల్బీనగర్‌కు వెళ్లే బస్సు రావడంతో దాన్ని ఆపేందుకు ప్రయత్నించింది. డ్రైవర్ పట్టించుకోకుండా బస్సును ముందుకు ఉరికించడంతో ఆగ్రహించిన బేగం తన బ్యాగులోంచి బీర్ బాటిల్‌ను తీసుకొని బస్సు వెనుక అద్దాలపైకి విసిరింది. సీసతగిలి బస్సు అద్దాలు పగిలిపోయాయి. ప్రయాణికులు ఈ విషయాన్ని కండక్టర్.. డ్రైవర్‌కు చెప్పారు. వెంటనే డ్రైవర్, కండక్టర్‌లు బస్సును రోడ్డుకు ఓ పక్కన ఆపేసి, సదరు ప్రయాణికురాలిని పట్టుకునేందుకు కిందకు దిగారు. అప్పటికే ఆగ్రహంతో ఊగిపోతున్న బేగం.. 'నేను చేయ్యెత్తినా బస్సు ఆపనంటావా? నీకు ఎంత ధైర్యం' అంటూ తనవైపు వస్తున్న మహిళా కండక్టర్ స్వప్నను ప్రశ్నించింది. ఆపై తన బ్యాగులోంచి జెర్రిగొడ్డు పామును తీసి కండక్టర్ స్వప్నపైకి విసిరి.. 'ఈ బేగం అంటే ఏమనుకుంటున్నావ్?' అంటూ కన్నెర్ర చేసింది. స్వప్న చెయ్యి అడ్డుపెట్టడంతో పాము చేతులకు తగిలి కింద పడిపోయింది. అయితే ఊహించని ఈ పరిణామంతో స్వప్న తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఘటనపై స్వప్న నల్లకుంట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని బేగంను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం నాగులపంచమి సందర్భంగా బేగం పామును తీసుకెళుతున్నట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. కాగా, కండక్టర్‌పై విసిరిన పాము రోడ్డు పక్కన ఉన్న కిళ్లీకొట్టు డబ్బా వెనకనుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. కాగా విద్యానగర్ బస్‌స్టాప్‌లో బస్సు ఆపకపోవడం వల్లే ప్రయాణికురాలు ఈ దాడికి పాల్పడిందని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని టీజీఎస్ ఆర్టీసీ పేర్కొంది. విద్యానగర్ సిగ్నల్ ఫ్రీ లెఫ్ట్ వద్ద ఆర్టీసీ బస్టాప్ లేదని వెల్లడించింది. ఇలాంటి దాడులను టీజీఎస్ఆర్టీసీ ఏమాత్రం ఉపేక్షించదని.. పోలీసు శాఖ సహాయంతో బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రకటన విడుదల చేసింది.


సాగర్ గేట్లన్నీ ఓపెన్..

26గేట్లు ఎత్తి 4లక్షల క్యూసెక్కుల విడుదల

ప్రస్తుతం 3.74 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కడలి దిశగా గోదావరి, కృష్ణమ్మ పరుగులు

సముద్రంలో కలిసిన 1,756 టీఎంసీలు



నాగార్జునసాగర్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

హైదరాబాద్/నాగార్జునసాగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులన్నీ నిండుగా ఉండటంతో వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదిలేస్తున్నారు. శుక్రవారం నాగార్జునసాగర్‌కు వరద పోటెత్తింది. ప్రాజెక్టులోకి 3,74,304 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. మొత్తం 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి, కుడి, ఎడమ కాల్వలు, అన్ని మార్గాల ద్వారా జలాశయం నుంచి మొత్తం 4,02,098 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. ఎగువన ఉన్న శ్రీశైలానికి 3,54,761 క్యూసెక్కుల వరద చేరుతోంది. ఇటు ఎగువ గోదావరిలో మహారాష్ట్రలోని జైక్వాడి నుంచి శ్రీపాద ఎల్లంపల్లి దాకా ప్రాజెక్టులకు నాలుగు అంకెల వరదే కొనసాగుతోంది. 102.732 టీఎంసీల సామర్థ్యమున్న జైక్వాడిలో ప్రస్తుతం 45.45 టీఎంసీలే ఉండగా.. ప్రస్తుతం ప్రాజెక్టుకు 8,044 క్యూసెక్కుల వరద వస్తోంది. మంజీరా నదిపై ఉన్న సింగూరుకు 1,445 క్యూసెక్కులు, నిజాంసాగర్‌కు 400 క్యూసెక్కులు, ప్రధాన గోదావరిపై ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ)కు 6,150 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 6,150 క్యూసెక్కులు, ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 8,816 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఇక దిగువ గోదావరిలో ఉన్న మేడిగడ్డ (ప్రాణహిత)కు 2,99,850 క్యూసెక్కులు, సమ్మక్కసాగర్‌కు 5,86,400 క్యూసెక్కులు, సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం)కు 7,20,426 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. వచ్చిన వరద వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. ఎగువ గోదావరిలో వరద లేక జలాశయాలన్నీ అంతంత మాత్రమే నిల్వలు కలిగి ఉండగా.. దిగువ గోదావరిలో భారీ వరదలు రావడంతో ఆ నీటిని ఒడిసి పట్టే అవకాశాలు లేక భారీగా సముద్రంలో కలసిపోతోంది. జూన్ 1 వాటర్ ఇయర్ ప్రారంభమైన నాటి నుంచి శుక్రవారం దాకా 1,741 టీఎంసీల వరద సముద్రంలో కలిసింది. గోదావరిలో చివరిదైన ధవళేశ్వరం బ్యారేజీకి శుక్రవారం 5,68,946 క్యూసెక్కులు రాగా.. 5,67,131 క్యూసెక్కులు సముద్రంలోకి వదిలేశారు. ఇక కృష్ణా బేసిన్‌లో ఎగువన ఆల్మట్టి, ఉజ్జయిని నుంచి చివరిలో ఉన్న ప్రకాశం బ్యారేజీ దాకా అన్నీ నిండు కుండలా ఉన్నాయి. దాంతో ప్రాజెక్టుల్లోకి వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదిలేయాల్సిన పరిస్థితి. కృష్ణాలో ఇప్పటిదాకా 15.04 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. శుక్రవారం ప్రకాశం బ్యారేజీకి 3.05లక్షల క్యూసెక్కుల వరద రాగా.. వచ్చింది వచ్చినట్లే వదిలేశారు.

వివిధ ప్రాజెక్టుల పరిస్థితి.. (నిల్వలు-టీఎంసీల్లో, ఫ్లోలు-క్యూసెక్కుల్లో)

ప్రాజెక్టు	పూర్తి నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
ఆల్మట్టి	129.72	105.89	2,61,000	2,00,000
నారాయణపూర్	37.64	31.56	2,00,000	2,00,490
తుంగభద్ర	105.79	103.58	59,013	50,912
జూరాల	9.66	8.49	3,00,000	2,89,169
శ్రీశైలం	215.81	202.51	3,54,761	4,02,098
నాగార్జునసాగర్	312.05	298.59	3,74,304	4,02,098
పులిచింతల	45.77	35.42	2,46,320	2,46,519
సింగూరు	29.91	14.80	1,445	391
శ్రీరాంసాగర్	80.5	47.25	6,150	3,883
కడెం	7.6	6.89	1,537	969
ఎల్లంపల్లి	20.18	13.89	8,816	6,725

ఎంపీడీవోలను వీడని 'కోడ్'

» నిబంధనల్లో పేర్కొనకున్నా.. ఎన్నికల సమయంలో బదిలీలు

» కోడ్ ముగిసినా.. వెనక్కి పంపని సర్కారు

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సమయంలో కొందరు ఉన్నతాధికారుల అత్యుత్సాహం మండల పరిషత్ అభివృద్ధి అధికారుల(ఎంపీడీవోలు)కు శాపంగా మారింది. ఎన్నికల కోడ్ సమయంలో ఎంపీడీవోలను బదిలీ చేయాలని నిబంధనల్లో లేకున్నా.. రాష్ట్రంలో పలువురికి స్థానచలనం కలిగించారు. ఈసీ అధికారులకు ఈ విషయం తెలిసినా.. తిప్పి పంపకపోవడంతో.. సుదూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 11న అధికారులు హడావుడిగా 300ని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి.. 12వ తేదీన విధుల్లో చేరాలని ఆదేశించారని ఎంపీడీవోల సంఘం నేతలు చెబుతున్నారు. వీరిలో 200 మంది ఎంపీడీవోలను సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారని.. కొందరైతే 350-400 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. నిబంధనల్లో ఎక్కడా ఎంపీడీవోలను బదిలీ చేయాలని లేదని ఎన్నికల కమిషన్ అధికారులకు విన్నవించినా.. వారు పట్టించుకోలేదని వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసినా.. 300 మంది ఎంపీడీవోలను పాత స్థానాలకు పంపలేదని చెప్పారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

విత్తన సేకరణకు టెండర్లు

యాసంగిలో రైతులకు విత్తనాలు సరఫరా చేయటానికి గాను అర్హత కలిగిన సరఫరాదారుల నుంచి విత్తనాలు సేకరణకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ గురువారం టెండరు నోటిఫికేషన్ జారీచేసింది. కొత్తగా పండించిన విత్తనాలను సేకరించి.. 2024- 25 యాసంగి సీజన్‌లో రైతులకు విత్తనాలు సరఫరా చేయాలని నిర్ణయించింది. టెండరు మార్గదర్శకాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు సీడ్ కార్పొరేషన్ ఎండీ ఉదయ్ కుమార్ తెలిపారు. ఈనెల 14 తేదీ సాయంత్రం 4 గంటల వరకు బిడ్డింగులు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు.

చేనేత.. తేలిన లెక్క!

» రూ.180 కోట్ల విలువైన నిల్వలు

» ప్రభుత్వానికి చేనేత, జౌళీ శాఖ నివేదిక

» ఏం చేయాలనే అంశంపై చర్చ

హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ చేనేత సహకార సొసైటీ (టీజీసీవో) గోదాముల్లో ఏళ్ల తరబడి మూలుగుతున్న వస్త్రం లెక్క తేలింది. హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోదాలో రూ.180 కోట్ల విలువైన నిల్వలున్నట్లు శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో చేనేత సహకార సంఘాలకు ఆర్డర్లు ఇచ్చి నేయించిన వస్త్రాన్ని కుట్టుకు ఇవ్వకుండా గోదాముల్లో ఉంచినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటికే కొంత వస్త్రం ఎలుకలు, పందికొక్కుల పాలైనట్లు గుర్తించారు. పూర్తి నష్టం జరగకుండా.. వినియోగంలోకి తేవాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ బాధ్యతలను సికింద్రాబాద్ డివిజన్ మార్కెటింగ్ అధికారికి అప్పగించారు. ప్రభుత్వం ఇచ్చిన ఇండెంట్ కు అనుగుణంగా చేనేత ప్రాథమిక సహకార సంఘాల్లో కార్మికులతో వస్త్రాన్ని నేయించారు. స్కూల్ యూనిఫామ్‌లు, జంపఖానాలు, బ్లాంకెట్లు, స్త్రీ-పురుషులకు ఉపయోగపడే కుర్తా పైజామాలు, పంజాబీ డ్రెస్సులు, డ్రెస్ మెటీరియల్, టాప్స్, బాటమ్స్, ఎంబ్రాయిడరీ దుస్తులు, ప్రభుత్వ హాస్పిటళ్లు, కార్యాలయాలకు క్లాత్ మెటీరియల్ తయారీ కోసం కుట్టుకు ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది. దీనికి టెండర్లు పిలవడం, ఏజెన్సీలకు స్టిచ్చింగ్ ఆర్డర్ ఇవ్వడం చేయలేదు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడం, లోక్‌సభ ఎన్నికలు రావడంతో దృష్టిసారించలేదు. చేనేత, జౌళీశాఖ అధికారులు సైతం సమాచారం ఇవ్వలేదు. ఇటీవల ఈ అంశం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి వెళ్లగా తక్షణమే విచారణకు ఆదేశించారు. సమగ్ర నివేదికకు ఆదేశించారు. విచారణ జరిపిన అధికారులు.. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోదాముల్లో నిల్వ గురించి చెప్పారు. రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు రూ.220కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. నేసిన వస్త్రాన్ని వినియోగంలోకి తేకుంటే ప్రభుత్వంపై రూ.400కోట్లు భారం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. తక్కువ నష్టంతో పోయేందుకు టెండర్లు పిలిచి, స్టిచ్చింగ్ ఆర్డర్లు ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. టెండర్లు ఎప్పుడు? ఎలా నిర్వహించాలి? అనే మార్గదర్శకాలపై మంత్రి తుమ్మల, చేనేత, జౌళీశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ సమావేశమై నిర్ణయం తీసుకోనున్నారు.

బీసీ నిరుద్యోగులకు శిక్షణ

నిరుద్యోగులైన బీసీ యువతకు నాన్ రెసిడెన్షియల్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు టీజీ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ కుషాయిగూడలోని ఎల్బీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీలో 90రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన వాళ్లు శిక్షణకు అర్హులని, పూర్తయిన తర్వాత ఉద్యోగవకాశాలు కల్పిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9 నుంచి 24వరకు టీజీబీసీ.ఇబుట్టబుయిజీట చిజ్ఞా.చిజజౌటి.జీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి కలిసి నడుద్దాం

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

» బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యంతోనే ఆర్ఆర్ఆర్ జాప్యం:కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయం ఎన్నికల వరకే పరిమితమని, ఆ తర్వాత అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ యూనిట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎంపీలతో తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధిపై చర్చ జరిగింది. ఇందులో కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, రఘువీర్‌రెడ్డి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఒకరి ముఖాలు మరొకరు చూసుకునే పరిస్థితి ఉండేది కాదని, ఇప్పుడు మాత్రం అలాంటి పరిస్థితులు లేవని అన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, ఆ తర్వాత రాష్ట్రాభివృద్ధే అజెండాగా కలిసి పనిచేయాలని చెప్పారు. 'గాడిద గుడ్డు' అంటూ నాయకులు మాట్లాడడం మంచి సంస్కృతి కాదన్నారు. తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందో లెక్కలతో సహా వివరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వీలైనంత త్వరగా వరంగల్ ఎయిర్ పోర్టు నిర్మాణం చేపడతామన్నారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ వేగంగా అభివృద్ధి చెందుతోందని.. పర్యాటకం, ఐటీ, వినోదరంగాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామని స్పష్టం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) ముందుకు సాగలేదని తెలిపారు. బయ్యారం ఉక్కు కర్మాగారం లాభదాయకం కాదని 3 కమిటీలు చెప్పాయని గుర్తు చేశారు. కేంద్రం నిర్మించకపోతే తామే కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తామని కేటీఆర్ ప్రకటించారని.. పదేళ్ల అధికారంలో ఉండి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. బయ్యారం ఫ్యాక్టరీ లాభదాయకమైతే తానే కేంద్రాన్ని ఒప్పించి డబ్బులు తీసుకువచ్చేవాడినని తెలిపారు.



పార్టీలకతీతంగా పనిచేద్దాం..

రాష్ట్రాభివృద్ధి కోసం పార్టీలకతీతంగా కలిసి నడుద్దామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. కేంద్రంతో ఘర్షణ వాతావరణం లేకుండా పనిచేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కేంద్రం సహకరించాలని కోరారు. ఐఐఎం ఏర్పాటు చేస్తే తెలంగాణ యువతకు మేలు జరుగుతుందని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని, లేదంటే మరే రకంగానైనా నిధులు విడుదల చేసేలా చూడాలని కోరారు. తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులపై ఒక పుస్తకం తయారు చేయించామని, బీజేపీ ఎంపీలకు కూడా ఇస్తామని పేర్కొన్నారు.

ఖనిజాభివృద్ధిలో ప్రైవేట్ రంగానిది కీలక పాత్ర: కిషన్‌రెడ్డి

ఖనిజరంగాభివృద్ధిలో ప్రైవేటు రంగం పాత్ర కీలకమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. వికసిత భారత్-2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో ఖనిజ రంగానిది ముఖ్య పాత్ర అని చెప్పారు. గురువారం ఢిల్లీలోని ఎమ్‌జీఎమ్ఐ(మైనింగ్ జియలాజికల్, మెటలర్జికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో గనుల రంగంపై జరిగిన జాతీయ సదస్సులో కిషన్ రెడ్డి మాట్లాడారు. గనుల రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, వాటిని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల గురించి వివరించారు. భారతదేశంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఖనిజాల అన్వేషణ కోసం కంపెనీలు ముందుకు రావడం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఖనిజాల అన్వేషణ ప్రక్రియలో 50% ఖర్చును భరించేందుకు కేంద్రం ముందుకొచ్చిందని తెలిపారు. గనుల రంగంలో ఆత్మనిర్భరత సాధించేందుకు ఇలాంటి నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. యూపీఏ హయాంలో గనుల కుంభకోణాలు వెలుగుచూసిన నేపథ్యంలో పారదర్శకత కోసం వేలం విధానాన్ని తీసుకొచ్చినట్టు స్పష్టం చేశారు.

పెళ్లయిన రోజే నరికేశాడు!

» కొడవలితో భార్యను కడతేర్చిన భర్త

» తానూ ఆత్మహత్యకు పాల్పడిన వైనం

» మిస్టరీగా నవ దంపతుల మృతి

» కర్ణాటకలోని కోలార్ జిల్లాలో ఘటన

రామకుప్పం/శాంతిపురం/బెంగళూరు(ఆంధ్రజ్యోతి), ఆగస్టు 8: అనుమానమే పెనుభూతంగా మారి నవదంపతుల ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన కర్ణాటకలోని కోలార్ జిల్లాలో కేజీఎఫ్ తాలూకా చంబరసనహళ్లిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం సంతూరుకు చెందిన జయమ్మ, మునెప్ప దంపతులకు కుమారుడు నవీన్(30), ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు చంబరసనహళ్లికి చెందిన వ్యక్తితో వివాహమైంది. నవీన్ రామకుప్పం, శాంతిపురం మండలాల మధ్యన కర్ణాటక సరిహద్దు గ్రామం రాజుపేట క్రాస్‌లో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. కర్ణాటకలో బైనహళ్లికి చెందిన శ్రీనివాసులు, లక్ష్మీ దంపతుల కుమార్తె నిఖితశ్రీతో అతనికి బుధవారం ఉదయం చంబరసనహళ్లిలో వివాహమైంది. నిఖితతో పాటు ఆమె తల్లిదండ్రులను నవీన్ గ్రామంలోని తన అక్క ఇంటికి తీసుకెళ్లాడు. సాయంత్రం వరకూ బంధువులతో ఆహ్లాదంగా గడిపిన అనంతరం నవ దంపతులు ఓ గదిలోకి వెళ్లారు. కొద్దిసేపటికే గది లోపలి నుంచి కేకలు వినిపించాయి. నవీన్ మేనకోడలు కిటికీలో నుంచి చూడగా భార్య నిఖితపై నవీన్ కొడవలితో దాడి చేయడం కనిపించింది. గది తలుపులు తీసేందుకు నిఖిత తల్లితండ్రులు, బంధువులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. చివరకు తలుపులు బద్దలు కొట్టి లోపలకి వెళ్లి చూడగా నిఖిత రక్తపు మడుగులోనూ, పక్కనే నవీన్ తీవ్ర గాయాలతో పడి ఉన్నారు. బంధువులు వారిద్దరినీ హుటాహుటిన కోలారులోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నిఖిత మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నవీన్ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. కాగా కొంతకాలంగా నవీన్ మానసిక పరిస్థితి సరిగ్గా లేదని, ఈ కారణంగానే నిఖితను చంపి, తానూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వివాహమైన కొద్దిసేపటికే నిఖిత సెల్‌ఫోన్‌ను నవీన్ చూశాడని తెలిసింది. అందులో నిఖిత వేరొక యువకుడితో చాటింగ్ చేసినట్లు ఉండడంతో దాడి చేసి హతమార్చి ఉండొచ్చని భావిస్తున్నారు. దాడి ఎలా జరిగిందో మిస్టరీగా మారడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన నవదంపతులు (ఫైల్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శుక్రవారం 9 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- వ్యవసాయ సంబంధిత డిప్లొమా ప్రోగ్రామ్‌లలో స్పాట్ కౌన్సెలింగ్ తరవాత మిగిలిన సీట్ల భర్తీ కోసం వాక్-ఇన్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తోంది. టీఎస్ పాలిసెట్ 2024(అగ్రికల్చర్/ఇంజనీరింగ్ స్ట్రీమ్) ర్యాంక్ లేదా పదోతరగతి మెరిట్ ఆధారంగా రాష్ట్రంలోని వర్సిటీ పాలిటెక్నిక్‌లు, అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. అగ్రికల్చర్ స్ట్రీమ్ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. తరవాత ఇంజనీరింగ్ స్ట్రీమ్ అభ్యర్థులకు; ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో పదోతరగతి మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మొదటి కౌన్సెలింగ్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరల అప్లయ్ చేయనవసరం లేదు. వీరు కౌన్సెలింగ్‌కు హాజరైతే చాలు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు 60 శాతం సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

జయశంకర్ వర్సిటీలో డిప్లొమా కౌన్సెలింగ్



రెండేళ్ల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్: జోగిపేట బాలికల పాలిటెక్నిక్; జమ్మికుంట, బసంత్‌పూర్, మల్‌తుమ్మెద బాలుర పాలిటెక్నిక్ కాలేజీలు; కంపసాగర్, మధిర, నారాయణ్‌పేట్, పొలాస, రుద్రూర్, సిరిసిల్లా కో ఎడ్యుకేషన్ పాలిటెక్నిక్‌లలో 33 రెగ్యులర్ సీట్లు, 18 ఈడబ్ల్యూఎస్ సీట్లు చొప్పున మొత్తం 51 సీట్లు ఉన్నాయి. యూనివర్సిటీ అనుబంధ కాలేజీల్లో 182 రెగ్యులర్ సీట్లు, 27 ఈడబ్ల్యూఎస్ సీట్లు చొప్పున మొత్తం 209 సీట్లు మిగిలాయి.

మూడేళ్ల డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్: సంగారెడ్డి-కందిలోని అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్‌లో రెగ్యులర్, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల్లో ఒక్కోదానిలో ఒక సీటు చొప్పున రెండు సీట్లు ఉన్నాయి. మెదక్ జిల్లా-తునికిలోని డా.డి.రామానాయుడు విజ్ఞాన జ్యోతి అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్(అనుబంధ కళాశాల)లో 23 రెగ్యులర్, 3 ఈడబ్ల్యూఎస్ సీట్లు చొప్పున మొత్తం 26 సీట్లు మిగిలాయి.

రెండేళ్ల డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్: వికారాబాద్-గింగుర్తిలోని ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్(అనుబంధ కళాశాల)లో 44 రెగ్యులర్, 6 ఈడబ్ల్యూఎస్ సీట్లు చొప్పున మొత్తం 50 సీట్లు మిగిలాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. టీఎస్ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్/ఇంజనీరింగ్ స్ట్రీమ్) అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 12
- **వేదిక:** ఎగ్జామినేషన్ సెంటర్, వాటర్ టెక్నాలజీ సెంటర్ ఎదురుగా, పీజేటీఎస్ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయి. ఇంటర్/ఓపెన్ ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆగస్టు 18లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆసక్తిగలవారు నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ కళాశాల అభ్యాసకుల సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.ఎం.విజయ్ కుమార్ తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సహాయ కేంద్రానికి వచ్చి డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ అనంతరం ఆన్‌లైన్‌లో నిర్దేశిత ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చు. అలాగే రెండో సంవత్సరం, మూడో సంవత్సరం చదువుతున్నవారు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించవచ్చు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నెం.7382929630ను సంప్రదించాలి.

జేఎన్‌టీయూకేలో ఎంబీఏ(సీఎంయూ)

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- అమెరికాలోని 'సెంట్రల్ మిచిగన్ యూనివర్సిటీ(సీఎంయూ)' సహకారంతో ఎంబీఏ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఇందులో 18 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొదటి ఏడాది కాకినాడ జేఎన్‌టీయూలో, రెండో ఏడాది సీఎంయూలో చదవాల్సి ఉంటుంది. ఐసెట్ 2024 ర్యాంక్, అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇది సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ప్రోగ్రామ్. అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో నాలుగేళ్ల ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐసెట్ 2024 అర్హత పొంది ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** మొదటి ఏడాది రూ.1,50,000; రెండో ఏడాది 12000ల యూఎస్ డాలర్లు
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 19
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి నుంచి డిగ్రీ వరకు సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఐసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డ్
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ-533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in



నేషనల్ లా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం(ప్రొఫెషనల్)

ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ)- ఎల్ఎల్ఎం(ప్రొఫెషనల్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇది ఎగ్జిక్యూటివ్ డిప్లొమా ప్రోగ్రామ్. దీనిని పీజీ డిప్లొమాకు సమానంగా పరిగణిస్తారు. దీనికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో కోర్ పేపర్లు, రెండో సెమిస్టర్‌లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన పేపర్లు చదవాల్సి ఉంటుంది. సెమిస్టర్‌కు నాలుగు పేపర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌ను డిస్టెన్స్ ఎడ్యుకేషన్, కాంటాక్ట్ లెర్నింగ్ విధానాల్లో నిర్వహిస్తారు. కాంటాక్ట్ తరగతులు ఢిల్లీ క్యాంపస్‌లో ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. సెమిస్టర్ చివరలో ఎండ్ ఎగ్జామ్ ఉంటుంది. ఇంటర్నల్ అసైన్‌మెంట్‌కు 30 మార్కులు, ఎండ్ ఎగ్జామ్‌నకు 70 మార్కుల వెయిటేజీ నిర్దేశించారు.

స్పెషలైజేషన్‌లు: క్రిమినల్ లా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ స్టడీస్, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, కమర్షియల్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా అండ్ జస్టిస్, కన్జూమర్ లా అండ్ ప్రాక్టీస్, హెల్త్ లా అండ్ పాలసీ, ట్యాక్సేషన్ లా

అర్హత: గుర్తింపు పొందిన కాలేజ్/యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ/పీజీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్నవారు లేదా కనీసం మూడేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు రిజిస్టర్ చేసుకొన్న అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. వయోపరిమితి నిబంధనలు లేవు.

కోర్ పేపర్లు

- బేసిక్ ఇంట్రడక్షన్ టు లా అండ్ లీగల్ సిస్టమ్
- కాన్‌స్టిట్యూషనల్ లా-ఇంట్రడక్షన్
- ఫండమెంటల్స్ ఆఫ్ లా(క్రిమినల్, కమర్షియల్, సివిల్)
- లిటిగేషన్ ప్రాక్టికం

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.1,25,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 15
- **వెబ్‌సైట్:** www.nludelhi.ac.in



జాబ్ కార్నర్

ఐఓసీఎల్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు 400

చెన్నైలోని భారత ప్రభుత్వ రంగ సంస్థ - ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, సదరన్ డివిజన్ పరిధిలోని ఆరు రీజియన్లలో కింద పేర్కొన్న విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

రీజియన్లు: తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఖాళీల వివరాలు:

1. ట్రేడ్ అప్రెంటిస్: 95 ఖాళీలు
2. టెక్నీషియన్ అప్రెంటిస్: 105 ఖాళీలు
3. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్/అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్: 200 ఖాళీలు

విభాగాలు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ తదితరాలు

అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీబీఏ, బీఏ, బీకాం, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 31 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, వైద్య పరీక్ష, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 19

వెబ్‌సైట్: iocl.com/apprenticeships

'సమీర్'లో ప్రాజెక్ట్ స్టాఫ్

ఖాళీలు 43

భారత ప్రభుత్వరంగ సంస్థకు చెందిన కోల్‌కతాలోని సొసైటీ ఫర్ అప్లయిడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చ్(సమీర్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. రీసెర్చ్ సైంటిస్ట్: 21 పోస్టులు
2. ప్రాజెక్ట్ అసిస్టెంట్: 10
3. ప్రాజెక్ట్ అసిస్టెంట్-బి: 1
4. ప్రాజెక్ట్ టెక్నీషియన్-ఏ: 8
5. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-బి: 2
6. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-సి: 1

విభాగాలు: ఎలక్ట్రానిక్స్/కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్, మెకానికల్(ఫిట్టర్/మెషినిస్ట్), కంప్యూటర్/ఐటీ, ఫిజిక్స్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, బీఏ/బీఎస్సీ/బీకాం, బీబీఏ/బీఎంఎస్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్/ఎంఈ/బీకాం, ఎంటెక్, బీఎంఎస్‌తోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు సీనియర్ సైంటిస్ట్ పోస్టుకు రూ.30,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.17,000; ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-బికు రూ.20,000; ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-సికు రూ.26,000.

వయోపరిమితి: సీనియర్ సైంటిస్ట్ పోస్టు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-బికు 30 ఏళ్లు; ప్రాజెక్ట్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ టెక్నీషియన్-ఏకు 25 ఏళ్లు; ప్రాజెక్ట్ అసిస్టెంట్-బీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-సికు 35 ఏళ్లు.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి, రాత పరీక్ష/స్క్రీనింగ్ టెస్ట్/స్కిల్ టెస్ట్, దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25

రాత పరీక్ష/స్క్రీనింగ్ టెస్ట్/ఇంటర్వ్యూ: సెప్టెంబరు 5

వెబ్‌సైట్: https://sameer.gov.in/



ఢిల్లీ ఎయిమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖాళీలు 233

ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: అనస్తీషియాలజీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ, డెర్మటాలజీ, ఎండోక్రినాలజీ, సర్జరీ, మెడిసిన్, న్యూరాలజీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, సైకియాట్రి, రేడియాలజీ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, ఎమ్మెస్సీ, డీఎన్‌బీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధనానుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.1,42,506

వయోపరిమితి: 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3000; ఈడబ్ల్యూఎస్/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.2400, దివ్యాంగులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10

వెబ్‌సైట్: rrp.aiimsexams.ac.in/

ఎన్‌హెచ్ఏఐలో ఇంజనీరింగ్ ఉద్యోగాలు

ఖాళీలు 11

ఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ బ్రిడ్జ్/స్ట్రక్చరల్ ఇంజనీర్: 1 పోస్టు
2. బ్రిడ్జి డిజైన్ ఇంజనీర్: 2
3. జియోటెక్నికల్ ఇంజనీర్: 1
4. హైడ్రాలజీ అండ్ హైడ్రాలిక్ ఎక్స్‌పర్ట్: 1
5. సీనియర్ టన్నెల్ ఇంజనీర్: 1
6. టన్నెల్ ఇంజనీర్: 1
7. జియాలజిస్ట్: 1
8. క్వాంటిటీ సర్వేయర్: 1
9. డ్రాఫ్ట్‌మన్: 2

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(సివిల్), డిగ్రీ(సివిల్), పీజీ(జియాలజీ/స్ట్రక్చరల్/టన్నెల్/మైనింగ్), పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: స్ట్రక్చరల్ ఇంజనీర్, సీనియర్ టన్నెల్ ఇంజనీర్ పోస్టులకు 60 ఏళ్లు, క్వాంటిటీ సర్వేయర్, డ్రాఫ్ట్‌మన్ పోస్టులకు 45 ఏళ్లు, మిగతా పోస్టులకు 55 ఏళ్లు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ: ధ్రువపత్రాల పరిశీలన, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 30

వెబ్‌సైట్: https://nhai.gov.in

టీహెచ్ఎస్‌టీఐలో క్లినికల్ రీసెర్చ్ ఆఫీసర్లు

ఖాళీలు 6

హరియాణాలోని ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్.. కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. క్లినికల్ రీసెర్చ్ ఆఫీసర్: 1 పోస్టు
2. అసిస్టెంట్ డేటా మేనేజర్: 1 పోస్టు
3. టెక్నికల్ అసిస్టెంట్: 1 పోస్టు
4. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-2: 1 పోస్టు
5. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-1: 1 పోస్టు
6. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: 1 పోస్టు

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఎండీ/డీఎన్‌బీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: క్లినికల్ రీసెర్చ్ ఆఫీసర్, అసిస్టెంట్ డేటా మేనేజర్‌కు 4 ఏళ్లు, టెక్నికల్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-1, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-2 పోస్టుకు 40 ఏళ్లు మించకూడదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 12

వెబ్‌సైట్: https://thsti.res.in/



చిట్టిఫ్


ఆయుధాలకంటే బలమైనది

పాండురంగ పురాన్ని పాలించే మహేంద్రుడనే రాజుకు చుట్టుపక్కల రాజ్యాలనుంచి శత్రువుల బెడద ఎక్కువ. వారి దాడులను ఎదుర్కోవడానికి అతను తన కోటను అవసరమైన మరమ్మత్తులు చేయించి, దృఢంగా మార్చాలనుకున్నాడు. తన కోట ప్రధాన ద్వారాన్ని పెద్ద పెద్ద ఇనుప కమ్మీలతో బలంగా కట్టించి, వాటిని ఏనుగులతో, ఇంకా ఫిరంగి గుళ్లతో ఢీకొట్టించి, పరీక్షించాడు. ద్వారం చెక్కుచెదరలేదు. అదిచూసి, తన మంత్రితో మహేంద్రుడు ఇలా అన్నాడు 'చూసారా మహామంత్రీ.. ఇక ఏ ఆయుధాల వలనా మన కోటకు ఎలాంటి ఇబ్బందీఉండదు'




ఆ మాటలు విన్న మంత్రి ఏమీ మాట్లాడకుండా చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. ఆ మర్నాడు రాజు మంత్రిని తీసుకుని, మారు వేషాలలో కోట బయటకు వెళ్లారు కొంత సేపటికి కోట ప్రధాన ద్వారం వద్దకు వచ్చి, తలుపులు తెరవమని కాపలా వారిని అడిగారు.. అక్కడి భటులు సాయంత్రం అయిన తర్వాత ఎవరు అడిగినా కోట తలుపులు తెరవగూడదని మా మహారాజు ఆజ్ఞ. కాబట్టి మీకు ఈ సమయంలో తలుపులు తెరవలేము అని చెప్పారు. అది విన్న మహారాజు గర్వంగా చిరునవ్వుతో మంత్రి వైపు చూసాడు. ఈలోగా మంత్రి ఒక కాపలా వాడిని పక్కకు తీసుకెళ్లి, అతనికి వంద బంగారు కాసులు ఇస్తాననీ.. తలుపులు తెరవమనీ అడిగాడు. వెంటనే ఆ భటుడు తలుపులు తెరిచాడు. లోపలికి వెళ్లిన మంత్రి రాజుతో ఇలా అన్నాడు 'ఏ ఆయుధాలూ కూల్చలేని మన కోట తలుపులను ఏమి చేస్తే తెరిపించవచ్చో ఇపుడు అర్థమైందా మహారాజా?' అన్నాడు తన అజాగ్రత్తను తెలుసుకుని మహేంద్రుడు వెంటనే ఆ పనివారిని మార్చి, నిజాయితీ గల వేరే ఉద్యోగులను కాపలాగా నియమించాడు.


10 తేడాలను కనుక్కోండి



ఏవి ఎన్ని ఉన్నాయి?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 379

	5	4			1
1					
	4		1		
		1		5	
					6
6			2	1	

సుడోకు - 378 సమాధానం

4	3	2	5	1	6
6	1	5	4	3	2
5	2	3	6	4	1
1	6	4	3	2	5
3	5	1	2	6	4
2	4	6	1	5	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.